
www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 125

శుక్రవారం | 2-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి మ. 3.27 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఆర్ద్ర ఉ. 10.59 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.11.29-1.09; దుర్ముహూర్తం: ఉ.8.31-9.22, మ.12.46-1.37; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.58; సూర్యాస్తమయం: 6.44

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కారు హ్యాండ్‌బ్రేక్ లోపల 3.57 కిలోల బంగారం

3

యాదాద్రి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టివేత

డీఆర్ఐ అధికారుల సీజ్.. విలువ 2.5 కోట్ల పైనే



వర్గీకరణపై తీర్పునిచ్చిన ధర్మాసనంలోని సభ్యులు వరుసగా జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ

వర్గీకరణకు సై

ఎస్సీ, ఎస్టీలను క్యాటగిరీలుగా విభజించొచ్చు

- ఉప కులాలకు కోటా రాజ్యాంగబద్ధమే
- ఆ అధికారం రాష్ట్రాలకు ఉంది: సుప్రీంకోర్టు
- పక్కా డేటాతోనే వర్గీకరణ చేపట్టాలి
- ఎస్సీ, ఎస్టీల్లోనూ క్రీమీలేయర్ అమలు
- 6-1 మెజారిటీతో తీర్పు వెల్లడి
- ఎస్సీలంతా ఒకే స్థాయిలో లేరు
- సీజే చంద్రచూడ్ బెంచ్ 565 పేజీల తీర్పు
- ఏపీ ఎస్సీ రిజర్వేషన్లపై తీర్పు పునఃసమీక్ష
- తీర్పుపై బాలగోపాల్ వ్యాసం ప్రభావం

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాలుగా దేశంలో రగులుతున్న ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ సమస్యకు సుప్రీంకోర్టు తెరవేసింది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ఉప వర్గీకరణ ఆమోద యోగ్యమేనని, ఆయా వర్గాల్లో అత్యంత వెనుకబడిన ఉప వర్గాల వారికి రాష్ట్రాల స్థాయిలో కోటాలో ప్రత్యేక కోటా కేటాయించవచ్చని ఏడుగురు సభ్యుల ధర్మాసనం గురువారం మెజారిటీ తీర్పును వెలువరించింది. ఎస్సీలంతా ఒకే స్థాయిలో లేరని, అందులో సామాజికంగా, విద్యాపరంగా మరింత వెనుబడిన వర్గాలు ఉన్నాయని, వాటిని పైకి తీసుకురావడానికి ఎస్సీ వర్గీకరణ చేయడానికి రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధంగానే ఆ అధికారం ఉందని చరిత్రాత్మక తీర్పులో పేర్కొంది. దాంతో తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ కోసం పోరాడుతున్న మాదిగలకు ఎస్సీ రిజర్వేషన్లలో ప్రత్యేక కోటా ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. ఇదే డిమాండ్ ఉన్న ఇతర చోట్లా ముందుకు వెళ్లనుంది. పలు రాష్ట్రాల్లో ఎస్టీల వర్గీకరణ కూడా చేపట్టాలని డిమాండ్ ఉంది. సుప్రీం తీర్పు నేపథ్యంలో వాటికి కూడా బలం

మిగతా 12వ పేజీలో...



తొలుత మేమే అమలు చేస్తాం

13

- ఉద్యోగ నోటిఫికేషన్లకూ వర్తింపు
- వర్గీకరణకు ప్రతిపాదిస్తే నాడు నన్ను సంపత్‌ను సభ నుంచి పంపించారు
- శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

ధర్మమే గెలిచింది

- మాదిగ అమరులకు అంకితం
- వర్గీకరణ పూర్తయ్యే వరకు నియామకాలొద్దు: మందకృష్ణ

13



ఊరూవాడా

'దండోరా'!

30 ఏళ్లుగా అలుపెరగని ఎమ్మార్పీఎస్ ప్రస్థానం

12



స్కిల్ వర్సిటీకి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్

న్యూయార్క్‌ను మించేలా

ముచ్చర్లను నిర్మిస్తాం

- హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత 4వ సిటీ
- భూములిచ్చిన రైతులకు అండగా
- 57 ఎకరాల్లో 150 కోట్లతో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం
- శంకుస్థాపన చేసిన సీఎం

14

స్కిల్ వర్సిటీలో డిగ్రీ పట్టా ఇస్తాం

- ఏడాదికి రూ.50 వేల ఫీజు
- ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ వసతి కల్పిస్తాం: సీఎం రేవంత్

జాబ్ క్యాలెండర్‌కు చట్టబద్ధత!

- నేడు అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటన
- కొత్త రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల జారీకి గ్రీన్‌సిగ్నల్
- ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లతోనే ప్రతిపాదనలు
- మూసీ ప్రక్షాళనకు 15 టీఎంసీల గోదావరి నీళ్లు
- నిఖత్ జరీన్, సిరాజ్‌లకు గ్రూప్- 1 ఉద్యోగం, 600 గజాలు.. ఈషాసింగ్‌కు స్థలం
- రాష్ట్ర క్యాబినెట్ భేటీలో నిర్ణయాలు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జాబ్ క్యాలెండర్ ప్రకటించడమే కాకుండా.. దానికి చట్టబద్ధత కూడా కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ప్రతి ఏటా క్యాలెండర్‌ను ప్రకటించేలా ఒక విధానం తీసుకరావాలని క్యాబినెట్ నిర్ణయించింది. శుక్రవారం అసెంబ్లీలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా జాబ్ క్యాలెండర్‌పై ప్రకటన చేయనున్నారు. ఎన్ని ఉద్యోగాలను

మిగతా 14వ పేజీలో...



స్వప్నిల్.. కంచు మోత

2

- 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో దేశానికి తొలి పతకం
- పారిస్ ఒలింపిక్స్‌లో సింధు, నిఖత్, సాత్విక్ పరాజయం

ఆశలు లేని స్థితి నుంచి దూసుకొచ్చాడు.. అంచనాలు లేనివాడే సంచలనం సృష్టించాడు.. అనామకుడే పతకం తెచ్చిన వీరుడయ్యాడు.. పారిస్ ఒలింపిక్స్ 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో మహారాష్ట్ర కుర్రాడు స్వప్నిల్ కుశాలె కాంస్యం కొల్లగొట్టాడు. ఈ అంశంలో భారత్‌కు ఇదే తొలి ఒలింపిక్ పతకం కావడం విశేషం. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఏడో స్థానంతో పతక రౌండ్‌కు అర్హత సాధించిన స్వప్నిల్ మెడల్ రౌండ్‌లో నిలకడైన ప్రదర్శనతో రాణించాడు. ఓ దశలో ఆరో స్థానానికి దిగజారినా.. ఒత్తిడికి లోనుకాకుండా ఏకాగ్రతతో నిలదొక్కుకుని మెడల్ గెలిచాడు. పారిస్‌లో ఇది భారత్‌కు మూడో పతకం కాగా.. అన్నీ కాంస్యాలే.. అన్నీ షూటింగ్‌లోనే వచ్చాయి. తెలుగు క్రీడాకారులు బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ నిరుత్సాహపరిచారు. హ్యాట్రిక్ మెడల్ సాధించే అవకాశం ఉన్న సింధు ప్రికార్టర్స్‌లోనే పరాజయం పాలైంది. భారీ అంచనాలతో బరిలో దిగిన నిఖత్‌కు రౌండ్-16లోనే షాక్ తగిలింది. చిరాగ్ షెట్టితో కలిసి పతకం తెస్తాడనుకున్న సాత్విక్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది.



పీవీ సింధు



నిఖత్ జరీన్

4 కొత్త వైద్య కళాశాలలకు

లైన్‌క్లియర్



- ఎల్‌వోపీ జారీ చేసిన జాతీయ వైద్య మండలి
- రాష్ట్రంలో పెరగనున్న ప్రభుత్వ ఎంబీబీఎస్ సీట్లు
- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు

3

- పెండింగ్‌లో మరో నాలుగు కళాశాల అనుమతులు

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

- బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్: కాంగ్రెస్

7

- నిర్మాణానికి 1,200 కోట్లు
- ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడాల్సొచ్చింది: ఆప్

ఉత్తరాది అతలాకుతలం

- హిమాచల్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి!
- 45 మంది గల్లంతు.. ఐదుగురి దుర్మరణం
- ఉత్తరాఖండ్‌లో రాత్రివేళ పోటెత్తిన వరద
- రాష్ట్రవ్యాప్తంగా వర్షాలకు 12 మంది మృతి
- నీటిలోనే ఢిల్లీ.. ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు
- రాజస్థాన్‌లోనూ భారీ వర్షాలు.. ముగ్గురి మృతి
- 11 రాష్ట్రాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ



ఢిల్లీలో భారీ వర్షాల కారణంగా గోడ కూలి ధ్వంసమైన పలు కార్లు

సిమ్లా, డెహ్రాడూన్, జైపూర్, ఆగస్టు 1: ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కులు, పధార్, మండి, సిమ్లా జిల్లాలను వరద ముంచెత్తింది. 45 మంది గల్లంతవగా.. వీరిలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇళ్లు, బ్రిడ్జిలు, రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. శ్రీఖండ్ మహదేవ్ సమీపంలో బుధవారం రాత్రి క్లౌడ్ బరస్ట్‌తో సర్పారా, గాన్వీ, కుర్బన్ నల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. పార్వతి నదిపై మలానా డ్యామ్ కొట్టుకుపోయి దిగువ ప్రాంతాలను నీరు ముంచెత్తింది. శిమ్లా జిల్లా రాంపూర్‌లోని సమేజ్‌ఖడ్‌లో 30 మంది కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు మృతిచెందారు. మండి జిల్లా తెరాంగ్ సమీపంలోని రాజ్‌బన్ గ్రామం వద్ద మరో క్లౌడ్ బరస్ట్ జరిగింది. ఏడుగురు గల్లంతవగా ముగ్గురు ప్రాణాలు

మిగతా 7వ పేజీలో...

మా నాన్నను కోల్పోయినప్పటి

పరిస్థితి గుర్తుకొచ్చింది

- వయనాడ్ విపత్తుపై రాహుల్
- ప్రియాంకతో కలిసి పర్యటన

7

- ఆగస్టు, సెప్టెంబరులో అధిక వర్షపాతం
- వారంలో తెరుచుకోనున్న సాగర్ గేట్లు

దళిత బిడ్డను అధ్యక్షా అనలేకే..

అసెంబ్లీకి కేసీఆర్ గైర్హాజరు

- దళితులను మోసం చేసినందుకు.. అధ్యక్షా మైక్ ఇవ్వాలని అడుక్కునే స్థాయికి తెచ్చాం: సీఎం రేవంత్
- నన్ను నమ్ముకున్న అక్కలు.. మంత్రులు అయ్యారు
- మీరు నమ్ముకున్న వ్యక్తి సొంత చెల్లెలు జైల్లో ఉంది
- మమ్మల్ని లోపలేయ్యొద్దు.. కావాలంటే మా చెల్లెల్ని మరో ఏడాది జైల్లోనే ఉంచాలన్న నీచులు వాళ్లు
- సబిత, సునీత నిరసన సందర్భంగా సీఎం వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని మోసగించిన, దళితుడిని ఉప ముఖ్యమంత్రి చేసి బర్తరఫ్ చేసిన ఘనత కేసీఆర్‌దైతే.. సోనియాగాంధీ నేతృత్వంలో దళిత బిడ్డను స్పీకర్‌ను చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దళిత బిడ్డను అధ్యక్షా అని సంబోధించడం ఇష్టం లేకే ఆయన సభకు గైర్హాజరవుతున్నారని మండిపడ్డారు. స్పీకర్ అక్కడ కూర్చుంటే ఆయన కింద కూర్చోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతోనే సభకు రావడం లేదని

మిగతా 11వ పేజీలో...

సీఎం క్షమాపణ చెప్పాల్సిందే!

- స్పీకర్ పోడియం ఎదుట బీఆర్ఎస్ సభ్యుల నిరసన
- బయటకు తీసుకొచ్చిన మార్షల్స్.. అరెస్టు

11

- సీఎం అన్‌ఫిట్: కేటీఆర్
- ఇది కౌరవ సభ: హరీశ్

పారిస్ ఒలింపిక్స్ (జూలై 26 - ఆగస్టు 11)





మిస్టర్ కూల్ బుల్లెట్


కలల కోటలో చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకొన్న మిస్టర్ కూల్ బుల్లెట్ స్వప్నిల్ కుశాలె. మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా.. పెద్దపెద్ద కలలనే కన్నాడు. అది నెరవేరే వరకు అకుంఠిత దీక్షతో కృషి చేశాడు.. మువ్వన్నెలను రెపరెప లాడించాడు. 2012లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన స్వప్నిల్.. టోక్యో అవకాశం త్రుటిలో చేజారినా అధైర్యపడలేదు. రెట్టించిన పట్టుదలతో శ్రమించాడు.. పారిస్ బెర్త్ పట్టేశాడు. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగి.. అతి కష్టమైన 50 మీ రైఫిల్ 3 పొజిషన్స్‌లో కంచు మోత మోగించాడు.

అప్పుతో రైఫిల్ కొని..: మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో కంబల్వాడి గ్రామానికి చెందిన స్వప్నిల్ చిన్ననాటి నుంచే షూటింగ్‌పై ఆసక్తి పెంచుకొన్నాడు. ఉపాధ్యాయుడైన అతడి తండ్రి లోన్ తీసుకొని రైఫిల్ కొనిపించగా.. సర్పంచ్ అయిన అతడి తల్లి అనిత ఎంతో ప్రోత్సహించింది. భారత మాజీ షూటర్ దీపాలీ దేశ్‌పాండే శిక్షణలో రాటుదేలాడు. 2015లో ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్స్ జూనియర్ కేటగిరీలో స్వర్ణంతో మెరిశాడు. అనంతరం జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్స్ 50 మీ. రైఫిల్ ప్రోన్‌లో ప్రముఖ షూటర్లు గగన్ నారంగ్, చైన్ సింగ్ లాంటి వారికే ఝలక్ ఇచ్చాడు. కెరీర్‌లో వేగంగా ఎదిగిన స్వప్నిల్.. 2022 ఆసియా క్రీడల్లో టీమ్ స్వర్ణం సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ ఏడాది మేలో జరిగిన ట్రయల్స్‌లో పారిస్ టికెట్ పట్టేసిన కుశాలె.. ఆడిన తొలి ఒలింపిక్స్‌లోనే పతకంతో అదరగొట్టాడు. షూటింగ్‌లో తనకు ఫేవరెట్ ఎవరూ లేకపోయినా.. ధోనీని ఆదర్శంగా తీసుకొంటానని రైల్వే టికెట్ కలెక్టర్ అయిన కుశాలె చెప్పాడు. మహీ బయోపిక్‌ను తాను ఎన్నో సార్లు చూశానని తెలిపాడు. తీవ్ర ఒత్తిడిలోనూ ధోనీలా ఎంతో కూల్‌గా ఉండడాన్ని తాను కూడా అలవర్చుకోవడానికి యత్నిస్తున్నట్టు కుశాలె చెప్పాడు. కాగా, పోటీ జరుగుతున్న సమయంలో దేవుడిని ప్రార్థిస్తూ ఎంతో ఉత్కంఠగా గడిపిన అనిత.. పతకం నెగ్గిన విషయం తెలుసుకొని తీవ్ర భావోద్వేగానికి గురైంది. తన విజయంలో తల్లిదండ్రులు, కోచ్ కృషి ఎంతో ఉందని కాంస్యం నెగ్గిన అనంతరం కుశాలె కూడా చెప్పాడు.

విజేతకు మోదీ ఫోన్

షూటింగ్‌లో కాంస్యం సాధించిన స్వప్నిల్ కుశాలెతో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడి అభినందించారు. అలాగే సోషల్ మీడియాలోనూ అతడి ఘనతను కొనియాడారు. 'కుశాలె నుంచి అత్యద్భుత ప్రదర్శన. పురుషుల 50మీ. రైఫిల్3 పొజిషన్స్‌లో కాంస్యం సాధించినందుకు అభినందనలు. ఈక్రమంలో తను గొప్ప నైపుణ్యం, స్థితప్రజ్ఞత ప్రదర్శించాడు. తన గెలుపుతో ప్రతీ భారతీయుడి హృదయం ఆనందంతో నిండిపోయింది'

- ప్రధాని నరేంద్ర మోదీ



ప్రమోషన్ వచ్చేసింది

ఒలింపిక్స్ కాంస్యం షూటర్ కుశాలెకు ఎక్కడలేని గుర్తింపే కాకుండా ఉద్యోగంలో ప్రమోషన్‌ను కూడా తెచ్చిపెట్టింది. ప్రస్తుతం సెంట్రల్ రైల్వేలో టీటీఈగా పనిచేస్తున్న కుశాలె.. ఇప్పుడు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా మారనున్నట్టు సెంట్రల్ రైల్వే జీఎం రామ్‌కరణ్ యాదవ్ వెల్లడించాడు. 2015లో రైల్వేస్‌లో చేరిన కుశాలె గత కొన్ని సంవత్సరాలుగా ప్రమోషన్ కోసం ఎంతగా ప్రయత్నించినా ఎవరూ పట్టించుకోలేదట.

'దేశానికి మెడల్ అందించినందుకు చాలా సంతోషంగా ఉన్నాను. ఏమీ తినకుండా కేవలం బ్లాక్ టీ తాగి బరిలోకి దిగాను. అలాగే పోటీలో స్కోరుబోర్డును పట్టించుకోకుండా నా శ్వాసపైనే ఎక్కువగా దృష్టి సారించాను. ఈ స్థాయికి చేరుకోవడం నా 12 ఏళ్ల శ్రమ ఫలితం. ఫైనల్లోనూ అదే విషయం నా మనసులో ఉండిపోయింది. కొన్నేళ్లుగా విజయం కోసం చూస్తున్న నేను ఈ పతకంతో అందరినీ గర్వపడేలా చేశాను'

- స్వప్నిల్ కుశాలె

పారిస్ గేమ్స్ పతక రేసులో ఉన్నారంటూ ఎవరెవరి గురించో మాట్లాడుకున్నారు.. కానీ అతడి గురించి ఎవరికీ అంచనాల్లేవు. కనీసం ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాడన్న ఆశలు కూడా పెట్టుకోలేదు. అనామకుడిగా బరిలోకి దిగిన.. 28 ఏళ్ల షూటర్ స్వప్నిల్ కుశాలె లక్ష్యంపైనే గురి పెట్టాడు. చివరకు ఎవరికీ పట్టింపులేని తనను ప్రపంచమే గుర్తించేలా చేసుకున్నాడు. షూటింగ్‌లో అతిక్లిష్టమైన 50మీ. రైఫిల్3 పొజిషన్స్‌లో కంచు మోతతో తన చిరకాల స్వప్నాన్ని నిజం చేసుకోవడమే కాదు.. దేశం గర్వపడేలా చేశాడు. ఎంఎస్ ధోనీని అమితంగా ఆరాధించే స్వప్నిల్ అతడి మాదిరే ఒత్తిడిలోనూ మిస్టర్ కూల్‌గా పనికానిచ్చేసి.. ఈ విభాగంలో మెడల్ కొట్టిన తొలి భారత షూటర్‌గానూ నిలిచాడు.

దేశానికిది మూడో మెడల్

ఖుష్.. కుశాలె

50మీ. రైఫిల్3 పొజిషన్స్‌లో కాంస్యం ● సిఫ్ట్ కౌర్, అంజుమ్ విఫలం

స్వప్నిల్ కెరీర్

2017	కామన్వెల్త్ చాంపియన్‌షిప్స్	50మీ. రైఫిల్ ప్రోన్	కాంస్యం
2021	వరల్డ్‌కప్	50మీ. రైఫిల్3 పొజిషన్స్ టీమ్	స్వర్ణం
2022	ఆసియా గేమ్స్	50మీ. రైఫిల్3 పొజిషన్స్ టీమ్	స్వర్ణం
2022	వరల్డ్ చాంపియన్‌షిప్స్	50మీ. రైఫిల్3 పొజిషన్స్ టీమ్	కాంస్యం
2023	ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్స్	50మీ. రైఫిల్3 పొజిషన్స్ టీమ్	రజతం
2024	ఆసియా రైఫిల్/పిస్టల్ చాంపియన్‌షిప్స్	50మీ. రైఫిల్3 పొజిషన్స్ టీమ్	స్వర్ణం
2024	ఒలింపిక్స్	50మీ. రైఫిల్3 పొజిషన్స్	కాంస్యం

పారిస్: భారత షూటర్లు పతక పండుగ చేసుకుంటూ క్రీడాభిమానులను మురిపిస్తున్నారు. చివరి రెండు ఒలింపిక్స్‌లో తీవ్రంగా నిరాశపరిచినప్పటికీ.. ఈసారి మాత్రం తమ అద్భుత ప్రదర్శనతో దేశానికి హ్యాట్రిక్ పతకం అందించారు. గురువారం జరిగిన 50మీ. రైఫిల్ 3 పొజిషన్స్‌లో స్వప్నిల్ కుశాలె (451.4 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించాడు. తొలిసారి మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన తను క్వాలిఫయింగ్‌లో ఏడో స్థానంలో నిలవడమే కాకుండా ఫైనల్ రౌండ్‌లోనూ అందరినీ ఆశ్చర్యపరిచాడు. ప్రోన్, స్టాండింగ్ దశల్లో ప్రశాంతత, స్థిరత్వంతో కూడిన ప్రదర్శనతో పోడియం ఫినిష్ చేశాడు. ఈ విభాగంలో చైనాకు చెందిన లియూ యుకున్ (453.7) స్వర్ణం, సెరియ్ కులిష్ (461.3, ఉక్రెయిన్) రజతం అందుకున్నారు.

ఆరో స్థానం నుంచి ఎగబాకి..: కఠినంగా సాగిన ఫైనల్స్‌లో స్వప్నిల్ ఆరంభం నిదానంగానే సాగింది. కానీ క్రమంగా అంతులేని ఏకాగ్రతతో ఒక్కో స్థానం మెరుగుపర్చుకుంటూ పతక ఆశలు రేపాడు. ఫైనల్లో పాల్గొన్న 8 మంది ముందుగా 40 షాట్లు సంధించారు. ఇందులో తొలి 15 నీలింగ్ (మోకాళ్ల మీద కూర్చుని), ఆ తర్వాత 15 ప్రోన్ (బోర్లా పడుకుని), మిగిలిన 10 స్టాండింగ్ (నిలబడి) పొజిషన్‌లో షూట్ చేశారు. ఈ క్రమంలో స్వప్నిల్‌కు ఆరంభంలో గురి సరిగ్గా కుదరలేదు. తొలి షాట్‌ను 9.6తో ఆరంభించగా నీలింగ్ పొజిషన్‌ను ఆరో స్థానంతో ముగించాడు. కానీ ప్రోన్‌లో మాత్రం అద్భుతంగా పుంజుకున్నాడు. ఐదు షాట్లను ఇన్నర్ 10గా ముగించడంతో 310.1 పాయింట్లతో ఐదో స్థానానికి ఎగబాకాడు. చివరగా స్టాండింగ్‌లోనూ అదరగొట్టి మూడో స్థానంలో నిలవగలిగాడు. ఇక ప్రతీ షాట్‌కు ఓ షూటర్ తప్పుకొనే కీలక ఎలిమినేషన్ రౌండ్‌లోనూ స్వప్నిల్ తడబాటుకు గురవకుండా టాప్-4కు వెళ్లాడు. ఇందులో 9.9 స్కోరుతో 441.4 పాయింట్లు సాధించి టాప్-3లో ఎంట్రీ ఇవ్వడంతో మెడల్ ఖరారైంది. ఫైనల్ షాట్‌లో 10 స్కోరు చేయడంతో (451.4) 0.5 పాయింట్ల తేడాతో స్వప్నిల్ కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. అతడికన్నా ముందున్న కులిష్ 451.9తో టాప్-2 కోసం చైనా షూటర్‌తో పోటీపడ్డాడు.

సిఫ్ట్, అంజుమ్ ఫ్లాప్ షో: మహిళల 50మీ. రైఫిల్ 3 పొజిషన్‌లో ప్రపంచ రికార్డు నేపథ్యం కలిగిన సిఫ్ట్ కౌర్ శర్మపై, మాజీ వరల్డ్ చాంపియన్ అయిన అంజుమ్ మౌద్గిల్‌పై ముందునుంచీ పతక అంచనాలున్నాయి. కానీ అందరినీ తీవ్రంగా నిరాశపరుస్తూ వీరు కనీసం ఫైనల్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయారు. గురువారం జరిగిన క్వాలిఫయింగ్స్‌లో మొత్తం 32 మంది షూటర్లు పాల్గొనగా.. సిఫ్ట్ 575 పాయింట్లతో 31వ స్థానంలో నిలవడం గమనార్హం. అటు అంజుమ్ 584 పాయింట్లతో 18వ స్థానంలో నిలిచి టాప్-8కు చాలా దూరంలోనే ఉండిపోయింది.

పతకాల పట్టిక

	దేశం	స్వ	ర	కా	మొ
1	చైనా	11	7	5	23
2	అమెరికా	9	14	13	36
3	ఫ్రాన్స్	8	11	8	27
4	జపాన్	8	3	5	16
44	భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

ఆశలు ఆవిరి

- ఒకేరోజు నిష్క్రమించిన తెలుగు ప్లేయర్లు
- నిరాశపరచిన నిఖత్, సింధు, సాత్విక్
- క్వార్టర్స్‌కు లక్ష్యసేన్

పారిస్: పతకం ఖాయం అనుకొన్న తెలుగు క్రీడాకారులు తీవ్రంగా నిరాశపరచారు. పోటీలకు ఆరో రోజైన గురువారం స్వప్నిల్ కుశాలె కాంస్యం, లక్ష్యసేన్ గెలుపు మినహా భారత్‌కు ఏమాత్రం కలిసిరాలేదు. ముఖ్యంగా పీవీ సింధు, నిఖత్ జరీన్, సాత్విక్ సాయిరాజ్ జోడీ పేలవ ప్రదర్శనతో మెగా ఈవెంట్ నుంచి నిష్క్రమించారు.


నిఖత్ జరీన్

నిఖత్ ఏకపక్షంగా...

మహిళల 50 కిలోల ప్రీక్వార్టర్స్‌లో నిఖత్ 0-5తో ఆసియాడ్ చాంపియన్ వు యు (చైనా) చేతిలో చిత్తయింది. చైనా బాక్సర్ ఎత్తులు, చురుకుదనం ముందు నిఖత్ నిలవలేకపోయింది. మూడు రౌండ్లలో ప్రత్యర్థిపై ఒక్కసారి కూడా బలమైన పంచ్ విసరలేక పోయింది. మరోవైపు వేగంగా కదులుతూ ప్రత్యర్థి పంచ్‌లను తప్పించుకుంటూనే.. వు యు ఎదురుదాడి చేస్తూ పాయింట్లు రాబట్టింది. జరీన్ దూకుడు కనబరుస్తున్న ప్రతీసారి వ్యూహాత్మకంగా లాక్ చేసి ఆమె చేతులు కట్టేసింది. బౌట్ ముగిసిన తర్వాత ప్రత్యర్థి వేగంతో తాను పోటీపడలేక పోయానని నిఖత్ అంగీకరించింది. తొలి రౌండ్‌లోనే చైనా బాక్సర్ దూకుడుతో నిఖత్‌పై ఒత్తిడి పెంచింది. వేగవంతమైన ఫుట్‌వర్క్‌తో అదునుచూసి దాడి చేస్తుంటే.. నిఖత్ కౌంటర్ ఇవ్వలేక పోయింది. దీంతో జరీన్ తొలి రౌండ్‌ను 1-4తో కోల్పోయింది. రెండో రౌండ్‌లో నిఖత్ కొంత ఫర్వాలేదనిపించినా.. యు తెలివిగా భారత బాక్సర్ ముఖంపై బలమైన హుక్‌లు విసిరింది. దీంతో రెండో రౌండ్‌లో కూడా జరీన్ 2-3 తేడాతో ఓడింది. అప్పటికే డీలాపడిన నిఖత్.. మూడో రౌండ్‌లో పెద్దగా ప్రతిఘటించలేక బౌట్‌ను చేజార్చుకొంది. అనంతరం ప్రెస్ మీట్‌లో 'అందరికీ క్షమాపణలు' అంటూ కన్నీటి పర్యంతమైంది.

సాత్విక్ కల చెదిరింది



హ్యాట్రిక్ పతక వేటలో ఉన్న ఏస్ షట్లర్ సింధుతోపాటు డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టికి షాక్ తగిలింది. క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-13, 14-21, 16-21తో మలేసియాకు చెందిన ఆరోన్ చియా-సో వుయిక్ చేతిలో పరాజయం పాలైంది. దీంతో స్వర్ణం తెస్తారను కొన్న సాత్విక్ జోడీ.. ఉత్త చేతులతో ఇంటిముఖం పట్టింది.



సింధు కూడా..

మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో సింధు 19-21, 14-21తో హి బింగ్జియావో (చైనా) చేతిలో వరుస గేముల్లో చిత్తయింది. తొలి గేమ్ ఆరంభం నుంచే సింధు వెనుకంజలోనే సాగింది. అయితే, బ్రేక్ తర్వాత పుంజుకొని 19-19తో సమం చేసినా.. కీలక సమయంలో తడబాటులో గేమ్‌ను చేజార్చుకొంది. ఇక, రెండో గేమ్‌లో ఏమాత్రం పోరాటం కనబర్చలేదు. కాగా, సింగిల్స్‌లో లక్ష్య సేన్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. సహచర షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్‌తో జరిగిన రౌండ్-16 పోరులో సేన్ 21-12, 21-6తో అలవోకగా నెగ్గాడు. ఈ క్రమంలో కశ్యప్, శ్రీకాంత్ తర్వాత ఒలింపిక్స్‌లో క్వార్టర్స్‌కు చేరుకొన్న మూడో పురుష షట్లర్‌గా నిలిచాడు. తర్వాతి రౌండ్‌లో 12వ సీడ్ చో టిన్ చెన్ (చైనీస్ తైపీ)తో సేన్ తలపడనున్నాడు.


లక్ష్యసేన్

ప్రియాంకకు 41వ స్థానం..: అథ్లెటిక్స్‌ను భారత్ పేలవంగా ఆరంభించింది. మహిళల 20 కి.మీ రేస్ వాక్‌లో ప్రియాంక గోస్వామి గంటా 39 నిమిషాల 55 సెకన్ల టైమింగ్‌తో ముగించి 41వ స్థానంలో నిలిచింది. పురుషుల 20 కిమీ రేస్‌లో వికాస్ సింగ్ 30, పరమ్‌జీత్ సింగ్ 37వ స్థానంలో నిలిచారు. ఇక ఇదే విభాగంలో తలపడిన ఆకాశ్ దీప్ సింగ్ ఆరు కి.మీ. తర్వాత రేస్ నుంచి వైదొలిగాడు.

ప్రవీణ్ తొలి రౌండ్‌లోనే..: పురుషుల ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో మిగిలిన ఏకైక ఆర్చర్ ప్రవీణ్ జాదవ్ తొలి రౌండ్‌లోనే అవుటయ్యాడు. రౌండ్-64లో జాదవ్ 0-6తో కౌ వెంచావ్ (చైనా) చేతిలో చిత్తయ్యాడు.

శరవణన్ వెనుకంజ..: సెయిలింగ్ పురుషుల డింగీ ఈవెంట్‌లో విష్ణు శరవణన్ రెండు రేస్‌లు ముగిసే సరికి 25వ స్థానంలో కొనసాగుతున్నాడు. తొలి రేస్‌లో 10, రెండో రేస్‌లో 34వ స్థానంలో నిలిచాడు. మొత్తం 10 రేస్‌లు పూర్తయిన తర్వాత టాప్-10లో నిలిచిన సెయిలర్లు పతక రౌండ్‌కు చేరుకొంటారు. మహిళల డింగీలో నేత్ర కుమనన్ తొలి రేస్‌లో ఆరో స్థానంలో నిలిచింది. తగిన విధంగా గాలి లేకపోవడంతో రెండో రేస్‌ను వాయిదా వేశారు.

హాకీలో ఓటమి..

భారత హాకీ జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. గ్రూప్-బిలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-2తో బెల్జియం చేతిలో పరాజయాన్ని చవిచూసింది. 18వ నిమిషంలోనే అభిషేక్ గోల్ చేసి భారత్‌ను 1-0 ఆధిక్యంలో నిలిపాడు. అయితే, తిబ్యూ స్టాక్‌బ్రోక్స్ (33వ నిమిషం), జాన్ డోమెన్ (44వ) చెరో గోల్‌తో బెల్జియాన్ని గెలిపించారు. గ్రూప్‌లో చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. న్యూజిలాండ్‌పై గెలిచి అర్జెంటీనాతో డ్రా చేసుకొన్న టీమిండియా క్వార్టర్స్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకొంది.



పారిస్‌లో నేటి భారతం



గోల్ఫ్: పురుషుల వ్యక్తిగత ఫైనల్స్ (రౌండ్-2): శుభాంకర్ శర్మ, గగన్‌జీత్ భుల్లార్ (మ.12.30)
షూటింగ్: మహిళల 25మీ. పిస్టల్ క్వాలిఫికేషన్: ఇషాసింగ్, మను భాకర్ (మ.12.30); **పురుషుల స్కీట్ క్వాలిఫికేషన్:** అనంత్‌జీత్ సింగ్ (మ. 1గం.)
ఆర్చరీ: మిక్స్‌డ్ టీమ్ విభాగం (1/8 ఎలిమినేషన్ రౌండ్) : ధీరజ్/అంకిత x ఇండోనేసియా (మ.1.19)
రోయింగ్: పురుషుల సింగిల్ స్కల్స్ ఫైనల్స్ (ఫైనల్ డి): బల్‌రాజ్ పన్వర్ (మ.1.48)
జూడో : మహిళల +78 కి. (ఎలిమినేషన్ రౌండ్ 32) :తులికా మాన్xఇడాలిస్ ఓర్టిజ్ (క్యూబా) (మ.2.12)
సెయిలింగ్: మహిళల డింగీ (రేస్-3): నేత్ర కుమనన్ (మ.3.45), (రేస్-4): నేత్ర కుమనన్ (సా.4.53), **పురుషుల డింగీ (రేస్-3) :** విష్ణు (రా. 7.05), (రేస్-4): విష్ణు (రా.8.15)
హాకీ: పురుషుల గ్రూప్ దశ : భారత్ xఆస్ట్రేలియా (సా. 4.45)
బ్యాడ్మింటన్: పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్ : లక్ష్యసేన్ x చౌ టీన్ చెన్ (తైపీ) (సా.6.30)
అథ్లెటిక్స్: మహిళల 5 వేల మీ. (హీట్-1): అంకిత ధ్యానీ (రా.9.40), మహిళల 5 వేల మీ. (హీట్-2) పారుల్ చౌధరి (రా.10.06), పురుషుల షాట్‌పుట్ (క్వాలిఫికేషన్): తజిందర్ పాల్ తూర్ (రా.11.40).

భళా..బైల్స్



అమెరికా స్టార్‌కు 'ఆల్‌రౌండ్' స్వర్ణం

అమెరికన్ సూపర్ స్టార్ సిమోన్ బైల్స్ అదరగొట్టింది. అంచనాలను నిలబెట్టుకొంటూ మహిళల జిమ్నాస్టిక్స్ వ్యక్తిగత ఆల్‌రౌండ్ విభాగంలో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. గురువారం రాత్రి జరిగిన ఫైనల్లో బైల్స్ మొత్తం 59.131 పాయింట్లతో విజేతగా నిలిచింది. తద్వారా 1964లో వెరా కస్లావస్కా తర్వాత ఒలింపిక్స్ వ్యక్తిగత ఆల్‌రౌండ్ విభాగంలో రెండు పసిడి పతకాలు సొంతం చేసుకున్న తొలి జిమ్నాస్ట్‌గా బైల్స్ చరిత్ర సృష్టించింది. ఇక ఈసారి క్రీడల్లో బైల్స్‌కిది రెండో స్వర్ణ పతకం కావడం విశేషం. ఇంతకుముందు ఆర్టిస్టిక్ టీమ్ విభాగంలో అమెరికా జట్టు స్వర్ణ పతకం అందుకొన్న సంగతి తెలిసిందే. ఇక.ఆల్‌రౌండ్ ఫైనల్లో రెబెకా అండ్రాడే (బ్రెజిల్, 57.932) రజతం, ఈ విభాగంలో ప్రస్తుత చాంపియన్, అమెరికాకే చెందిన సునిసా లీ (56.465) కాంస్య పతకం దక్కించుకున్నారు.

ఇక సీనియర్ల వంతు

- నేటి నుంచి శ్రీలంకతో వన్డే సిరీస్
- బరిలోకి రోహిత్, విరాట్, రాహుల్

మధ్యాహ్నం 2.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

కొలంబో: టీ20 వరల్డ్‌కప్‌లో చాంపియన్‌గా నిలిచిన వెంటనే టీమిండియా జింబాబ్వే, శ్రీలంకలపై సిరీస్‌లు గెలుచుకుంది. ఇప్పుడు ఈ ఏడాది తొలిసారిగా వన్డేలు ఆడబోతోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఆతిథ్య శ్రీలంకతో మొదటి మ్యాచ్ జరుగనుంది. కెప్టెన్‌గా రోహిత్ శర్మ పగ్గాలు తీసుకోవడంతో పాటు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా జట్టులో చేరాడు. అలాగే చాలాకాలం తర్వాత కేఎల్ రాహుల్ కనిపించనున్నాడు. హార్దిక్, బుమ్రా, జడేజాలకు విశ్రాంతినిచ్చారు. 2023 వన్డే వరల్డ్‌కప్ నుంచి ఇప్పటివరకు భారత్ కేవలం మూడు వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడింది. మరో ఆరు నెలల్లో చాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉండగా.. లంకతో సిరీస్‌ను సన్నాహకంగా భావించాలనుకుంటోంది. అలాగే వికెట్ కీపర్‌గా ఎవరిని ఆడించాలనేది కూడా తేలాల్సి ఉంది. పంత్ గైర్హాజరీలో ఈ బాధ్యతలు రాహుల్ తీసుకున్నాడు. అయితే రెండేళ్లుగా పంత్ వన్డేలు ఆడలేదు. కానీ టాప్-6 బ్యాటర్లలో ఒక్క లెఫ్ట్ హ్యాండర్ కూడా లేకపోవడం పంత్‌కు కలిసివచ్చే విషయం. ముమ్ముందు రాహుల్ లేదా పంత్‌లలో ఒకరివైపు మొగ్గు చూపేందుకు ఈ మ్యాచ్‌లు ఉపయోగపడగలవు. అలాగే తొలిసారి గంభీర్ శిక్షణలో జట్టు టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయగా.. ఇప్పుడు సీనియర్ల నుంచి తను ఎలాంటి ప్రదర్శన రాబట్టగలడో వేచిచూడాల్సిందే. మరోవైపు ఆరుగురు పేసర్లు గాయంతో దూరం కావడంతో శ్రీలంక బౌలింగ్ బలహీనంగా మారింది. ఈస్థితిలో స్టార్లతో కూడిన భారత్‌కు ఆతిథ్య జట్టు ఏమేరకు పోటీనివ్వగలదనేది ఆసక్తికరంగా మారింది.


గంభీర్, అగార్కర్‌లతో కోహ్లీ

తుది జట్లు (అంచనా): భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రాహుల్/పంత్, దూబే/పరాగ్, అక్షర్, హర్షిత్, కుల్దీప్, సిరాజ్, ఖలీల్/అర్ష్‌దీప్. **శ్రీలంక:** నిస్సాంక, ఫెర్నాండో, కుశాల్ మెండిస్, సమరవిక్రమ, అసలంక (కెప్టెన్), లియనగె, హసరంగ, కరుణరత్నె, వెల్లలగె, తీక్షణ, ఫెర్నాండో.

ఎదురులేని లెడెకి



అమెరికా 'బంగారు చేప' కేటీ లెడెకి 1500 మీ. ఫ్రీస్టయిల్‌లో టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఆమె 15ని 30.02సె. కొత్త ఒలింపిక్ రికార్డు టైమింగ్‌తో పసిడి పతకం చేజిక్కించుకుంది. ఈక్రమంలో టోక్యో విశ్వక్రీడల్లో తానే నెలకొల్పిన రికార్డు (15ని 35.35సె.)ను కేటీ తిరగ రాసింది. కాగా..ఒలింపిక్ మహిళల స్విమ్మింగ్‌లో అమెరికాకే చెందిన జెన్నీ థాంప్సన్ అత్యధిక స్వర్ణాల (8) రికార్డును లెడెకి సమం చేసింది. అంతేకాదు..ఒలింపిక్స్‌లో లెడెకి సాధించిన మొత్తం పతకాల సంఖ్య 12కి చేరింది.

నడాల్..ఒలింపిక్స్ ఆఖరి మ్యాచ్..



స్పెయిన్ దిగ్గజం రఫెల్ నడాల్ ఒలింపిక్స్‌లో చివరి ఆట ఆడేశాడు. తన దేశానికే చెందిన యువ సంచలనం కార్లోస్ అల్కారజ్‌తో కలిసి పురుషుల డబుల్స్ బరిలో దిగిన నడాల్ క్వార్టర్‌ఫైనల్లోనే తిరుగుముఖం పట్టాడు. నాలుగో సీడ్ అమెరికా జంట ఆస్టిన్ క్రాజిసెక్/రాజీవ్ రామ్ 6-2, 6-4తో నడాల్/అల్కారజ్ ద్వయాన్ని చిత్తు చేసి సెమీఫైనల్లో ప్రవేశించింది.

మహిళల పోటీల్లో పురుషులా?

అల్జీరియా, తైవాన్ బాక్సర్లపై వివాదం


ఇమేని ఖెలీఫ్


లిన్ యు టింగ్

విల్లేపింటే (ఫ్రాన్స్): ఒలింపిక్స్‌లో ఇద్దరు మహిళా బాక్సర్లపై తీవ్రమైన చర్చ నడుస్తోంది. అల్జీరియాకు చెందిన ఇమేని ఖెలీఫ్ (25), తైవాన్‌కు చెందిన లిన్ యు టింగ్ (28) మహిళా బాక్సర్లు కాదన్న వాదన బలంగా వినిపిస్తోంది. గురువారం రాత్రి ఖెలీఫ్‌తో మహిళల 66 కి. విభాగం బౌట్ నుంచి ఇటలీ బాక్సర్ యాంజెలా అనూహ్యంగా వైదొలగింది. తొలి రౌండ్ 46 సె. ఆట తర్వాత ఖెలీఫ్ పంచ్‌లకు విలవిలలాడిన యాంజెలా బాధను తట్టుకోలేక విరమించుకుంది. అయితే ఖెలీఫ్‌ను చూసిన వారంతా ఆమె..పురుష బాక్సరని అభిప్రాయపడ్డారు. ఖెలీఫ్ పంచ్‌లకు భయపడి బౌట్ నుంచి యాంజెలా వైదొలగిందని ఆమె పట్ల సానుభూతి ప్రకటిస్తున్నారు. ఖెలీఫ్‌లో టెస్టోస్టెరోన్ స్థాయిలు అధికంగా ఉన్నాయనే వాదనలనూ వారు గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళల పోటీలకు ఖెలీఫ్‌ను ఎలా అనుమతించారని ఐఓసీని వారు నిలదీస్తున్నారు. పైగా..గత ఏడాది ఢిల్లీ వేదికగా అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ) నిర్వహించిన వరల్డ్ మహిళా బాక్సింగ్ చాంపియన్‌షిప్ సందర్భంగా ఇమేని, లిన్ యు అనర్హత వేటుకు గురవడాన్ని వారు ప్రస్తావిస్తున్నారు.

జీఎస్టీ కుంభకోణం కేసు సీఐడీకి బదిలీ

» దర్యాప్తు అధికారితో సీఐడీ చీఫ్ భేటీ.. త్వరలోనే నోటీసుల పర్వం

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో జరిగిన రూ. 1400 కోట్ల వస్తు సేవల పన్ను(జీఎస్టీ) కుంభకోణం కేసు పూర్తిస్థాయిలో సీఐడీకి బదిలీ అయ్యింది. తొలుత హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు ఈ కేసును నమోదు చేయగా.. తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం సీఐడీకి అప్పగించిన విషయం తెలిసిందే. ఆ మేరకు సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్(185/2024)ను గురువారం సీఐడీ అధికారులకు అప్పగించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఐడీ చీఫ్ షికాగోయల్ హైదరాబాద్ తిరిగి రావడంతో కేసు దర్యాప్తు వేగవంతమైంది. వచ్చీ రాగానే ఆమె సీఐడీ దర్యాప్తు అధికారి(ఐవో)తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం స్వయంగా విచారణకు ఆదేశించడం.. మాజీ సీఎస్‌గా, ప్రభుత్వ సలహాదారుగా సేవలందించిన వ్యక్తి నిందితుడిగా ఉండడంతో పకడ్బందీగా దర్యాప్తునకు అనుసరించాల్సిన విధానాలపై ఆమె దిశానిర్దేశం చేశారు. కాగా.. ఎలాంటి వస్తువులను సరఫరా చేయకుండానే.. 75 కంపెనీలు రూ.1,400 కోట్ల మేర ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ని క్లెయిమ్ చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్‌తోపాటు.. వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఎస్వీ కాశీవిశ్వేశ్వర రావు, డిప్యూటీ కమిషనర్ శివరామ్ ప్రసాద్ తదితరులు నిందితులుగా ఉన్నారు. వీరికి నోటీసులు జారీ చేసి, విచారణకు పిలిచేందుకు సీఐడీ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

వారంలో సాగర్ గేట్లు ఓపెన్

» నేడు క్రస్ట్ గేట్లకు చేరుకోనున్న ప్రాజెక్టు నీటిమట్టం
» ఎడమ కాల్వకు మంత్రుల నీటి విడుదల నేడే
» శ్రీశైలం నుంచి 5.18 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో
» ఆల్మట్టి, శ్రీశైలంలో నిల్వల తగ్గుదలకు నిర్ణయం
» భద్రాద్రిలో తగ్గిన గోదావరి..ప్రమాద హెచ్చరిక వెనక్కి



538.80 అడుగుల నీటిమట్టంతో నాగార్జునసాగర్ జలాశయం

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా ప్రవాహానికి శ్రీశైలం పూర్తిగా నిండి.. పది గేట్ల నుంచి భారీగా నీళ్ల విడుదల చేయడంతో నాగార్జునసాగర్ కూడా జలసిరితో కళకళలాడుతోంది. వారం రోజుల్లో సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీశైలంలోకి 4.64 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 5.18లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతూ రెండు వైపులా జలవిద్యుత్తు ఉత్పాదన చేస్తున్నారు. సాగర్ పూర్తి సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా ప్రాజెక్టులో ప్రస్తుతం 182.95 టీఎంసీల నీటినిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టుకు 3.69 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా... జలవిద్యుదుత్పాదన, కుడికాల్వ అవసరాల కోసం 27 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శుక్రవారం ప్రాజెక్టులో నీటి మట్టం క్రస్ట్ గేట్లను తాకనుంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సాగర్ ఎడమ కాల్వ నుంచి సాగు/తాగు అవసరాల కోసం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గేట్లను ఎత్తి, నీటిని విడుదల చేయనున్నారు. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాలు ముగియగానే ఉత్తమ్, మిగతా మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, తుమ్మల హెలికాప్టర్‌లో సాగర్‌కు వెళ్లనున్నారు. నిరుడు సాగర్ ఎడమ కాల్వ నుంచి వరద రాకపోవడంతో గత ప్రభుత్వం క్రాప్ హాలీడే ప్రకటించింది. ఫలితంగా కాల్వ పరిధిలోని 6.5 లక్షల ఎకరాలు బీళ్లుగా మారాయి. ఈ ఏడాది నీటిని విడుదల చేస్తుండటంతో అక్కడి రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం దిగువన ఉన్న పులిచింతల ఖాళీగా ఉంది. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా... 1.12 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. సాగర్ గేట్లు ఎత్తితే పులిచింతల ఒక్కరోజులోనే నిండనుంది. మరోవైపు.. ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చిచేరుతుండటంతో కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టి, శ్రీశైలంలో రూల్‌కర్వ్(ఏసమయంలో ప్రాజెక్టులో ఏ మేరకు నిల్వలు ఉండాలని నిర్దేశించేది) ఆధారంగా నిల్వలు తగ్గించుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఆల్మట్టిలోకి 3.41 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా... ప్రాజెక్టులో 68.46 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టుకు ఎగువన పుణె, కొల్హాపూర్ ప్రాంతాల్లో క్యాచ్‌మెంట్ ఏరియాలో రోజూ భారీ వర్షాలు కురుస్తుండటంతో రూల్‌కర్వ్ ఆధారంగా గణనీయంగా నిల్వలను క్రమంగా తగ్గించుకున్నారు. ఫ్లాష్ ఫ్లడ్స్‌తో 61 టీఎంసీల వరద వచ్చినా తట్టుకునేలా ప్రాజెక్టులో నిల్వలు తగ్గించుకున్నారు. గోదావరి బేసిన్‌లో శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు వరద పెరిగింది. ఈ ప్రాజెక్టుకు 40,786 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... కడెం ప్రాజెక్టుకు 1768 క్యూసెక్కులు, ఎల్లంపల్లికి 8234 క్యూసెక్కుల వరద వచ్చిచేరింది. ఈ ప్రాజెక్టు నుంచి 12910 వేల క్యూసెక్కులను పంపింగ్ చేసి, విఎడ్‌మానేరుకు తరలించేలా పంపింగ్ చేస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీకి 3.62 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా సమ్మక్కసాగర్(తుపాకుల గూడెం) బ్యారేజీకి 6.26 లక్షలు, సీతమ్మసాగర్(దుమ్ముగూడెం) బ్యారేజీకి 8.07 లక్షల క్యూసెక్కుల వరద రికార్డయింది. ఈ బ్యారేజీలకు వచ్చిన వరదను వచ్చినట్లే కిందికి వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం సాధారణ స్థితికి చేరుకుంది. ప్రస్తుతం అక్కడ 40.6 అడుగుల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. కాగా నిజామాబాద్ జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. డిచ్‌పల్లిలో అత్యధికంగా 5.1 సెం.మీ వర్షపాతం నమోదైంది.

అధికారులకు ఆఖరి అవకాశం!

'నీటి పారుదల'లో రిటైర్ కానున్న వారికి సర్కారు కీలక బాధ్యతలు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖలో పదోన్నతుల వివాదం ఇప్పట్లో తేలేలా లేకపోవడంతో పైస్థాయిలోని అధికారులకు పదవీ విరమణ చేసేలోపు చివరి అవకాశంగా కీలక బాధ్యతలను సర్కారు కట్టబెడుతోంది. వచ్చే నెల 30న పదవీ విరమణ చేయనున్న మహబూబ్‌నగర్ ఎస్ఈగా పనిచేస్తున్న కె.శ్రీనివాస్‌కు మంచిర్యాల చీఫ్ ఇంజనీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెడుతూ గురువారం నిర్ణయం తీసుకుంది. ఇక సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న బి.వెంకటకృష్ణారెడ్డిని వాలంతరీ డీజీగా పోస్టింగ్ ఇచ్చారు. వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో రిటైరవ్వబోతున్న మరో ఎస్ఈ దేవేందర్‌రెడ్డికి హైదరాబాద్ చీఫ్ ఇంజనీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టారు.

పూజా ఖేద్కర్‌కు మరో షాక్

ముందస్తు బెయిల్ నిరాకరణ.. పిటిషన్ తోసిపుచ్చిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: మహారాష్ట్రకు చెందిన వివాదాస్పద మాజీ ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ మరింత చిక్కుల్లో పడ్డారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో మోసం చేసి, అర్హత లేకున్నా ఓబీసీ, పీడబ్ల్యూడీ కోటాలో సివిల్స్ పరీక్షలో ప్రయోజనం పొందారనే కేసులో గురువారం ఢిల్లీ కోర్టు ఆమెకు ముందస్తు బెయిల్ నిరాకరించింది. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష-2022 దరఖాస్తులో వాస్తవాలను వక్రీకరించి, తప్పుడు సమాచారం నింపారనే అభియోగాలతో ఢిల్లీ పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనను అరెస్ట్ చేస్తారనే భయంతో పూజ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను పటియాల హౌస్ కోర్టు తోసిపుచ్చింది. యూపీఎస్సీకు చెందినవారు ఎవరైనా పూజకు సహాయం చేశారా అనే కోణంలో విచారణ చేయాలని ఢిల్లీ పోలీసులను కోర్టు ఆదేశించింది.

గనుల తవ్వకాల ప్రాంతాల్లో జల సంరక్షణపై దృష్టి పెట్టండి

» కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి
» పది కీలక బొగ్గు గనులకు అనుమతులు



న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గనుల తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాల్లో జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. గురువారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో బొగ్గు, లిగ్నైట్ గనుల వద్ద జలవనరుల గుర్తింపు, పర్యావరణానికి అనుకూలం గా గనుల నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గనుల ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల కోసం మార్గదర్శకాలను విడుదల చేసి ఆయన మాట్లాడారు. గనుల నుంచి వచ్చే నీటి సద్వినియోగం ద్వారా సవాళ్లను అవకాశాలుగా మార్చుకునే వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే, ఆ శాఖ కార్యదర్శి అమృత్‌లాల్ మీనా పాల్గొన్నారు. అనంతరం బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో పది కీలక బొగ్గు గనులకు అనుమతి పత్రాలను కిషన్‌రెడ్డి అందజేశారు. ఈ గనుల్లో 2,395 మిలియన్ టన్నుల నిల్వలున్నాయని.. వీటి ద్వారా ఏడాదికి రూ.166.36కోట్ల ఆదాయం వచ్చే అవకాశముందన్నారు. తొలుత కిషన్‌రెడ్డిని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ కలిశారు. భారత్-ఆస్ట్రేలియా మధ్య బొగ్గు, ఖనిజాలకు సంబంధించి జరిగిన ఒప్పందాలు, పరస్పర సహకారం తదితర అంశాలపై వీరు చర్చించారు.

తెలంగాణలో 32వేల కోట్లతో రైల్వే పనులు

» కొత్త ప్రాజెక్టుల కోసం రైల్వే మంత్రిని కలిశాం
» మీడియాతో మల్కాజిగిరి ఎంపీ ఈటల

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో రూ.32 వేలకోట్లతో రైల్వే పనులు జరుగుతున్నాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లు, ఆర్వోబీలు, ఆర్యూబీల నిర్మాణం తదితర సమస్యలు పరిష్కరించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశానని తెలిపారు. మౌలాలి నుంచి సనత్ నగర్, సికింద్రాబాద్ నుంచి ఘట్‌కేసర్ మార్గాల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిగ్‌జాగ్ రైల్వే లైన్ల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న బొల్లారం, వాజ్‌పేయి నగర్, అల్వాల్, వెంకటాపూర్, షఫిల్‌గూడ ఏరియాల్లో ఆర్వోబీలు నిర్మించాలని కోరారు. రాష్ట్రం సహకరించకున్నా ఆర్వోబీలు నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారని అన్నారు. మౌలాలి - చర్లపల్లి - సనత్ నగర్ ఏరియాల్లో ప్రజలకు అవసరం ఉన్నచోట ఎంఎంటీఎస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని, సికింద్రాబాద్ నుంచి మేడ్చల్, జూబ్లీ బస్టాండ్ నుంచి శామీర్‌పేట్, ఎల్‌బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు కేంద్ర ప్రభుత్వ డబ్బులతోనే ఎక్స్ ప్రెస్ హైవేల నిర్మాణం చేయాలని కోరినట్లు ఈటల తెలిపారు.

ముందస్తు బెయిల్ కోసం నటుడు రాజ్‌తరుణ్ పిటిషన్



హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను మోసం చేశారనే ఆరోపణలతో నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సినీ నటుడు రాజ్‌తరుణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజ్‌తరుణ్ తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని పేర్కొంటూ లావణ్య అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం రాజ్‌తరుణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ శ్రీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై పోలీసుల వైఖరి తెలియజేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావుకు ఆదేశాలు జారీచేసింది. విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

రాజ్‌తరుణ్ నాకొద్దు: లావణ్య

రాజ్‌తరుణ్ తనకే కావాలంటూ ఇన్నాళ్లూ నానా యాగీ చేసిన లావణ్య చివరికి మాట మార్చారు. ఇకపై రాజ్‌తరుణ్‌తో కలసి ఉండాలని తాను కోరుకోవడం లేదని మీడియా ముందు స్పష్టం చేశారు. మరోవైపు, లావణ్య నుంచి తమకు ప్రాణహాని ఉందని.. తమకేదైనా జరిగితే ఆమెనే బాధ్యురాలని పేర్కొంటూ రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు బసవరాజు, రాజ్యలక్ష్మి మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

4 కొత్త వైద్య కళాశాలలకు లైన్‌క్లియర్

» ఎల్‌వోపీ జారీ చేసిన జాతీయ వైద్య మండలి
» పెరగనున్న సీట్లు.. ఈ ఏడాది నుంచే ప్రవేశాలు
» పెండింగ్‌లో 4 కళాశాలల అనుమతులు
» అప్పీలుకు వెళ్లే యోచనలో ప్రభుత్వం



హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్య మరింత మందికి చేరువకానుంది. తెలంగాణలో నాలుగు కొత్త వైద్య కళాశాలలకు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) అనుమతులిచ్చింది. ఇందుకు సంబంధించి ఎల్‌వోపీ(లెటర్ ఆఫ్ పర్మిషన్)ను బుధవారం రాత్రి జారీ చేసింది. మొత్తం ఎనిమిది వైద్య కళాశాలల కోసం రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఇందులో ములుగు, నర్సంపేట, గద్వాల, నారాయణపేట కాలేజీలకు ఎన్ఎంసీ అనుమతినిచ్చింది. దీంతో ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ కళాశాలల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించవచ్చు. ఇక, యాదాద్రి భువనగిరి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్, మెదక్ వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ అనుమతులు మంజూరు చేయలేదు. ఈ కళాశాలలకు ఎల్‌వోపీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అప్పీలుకు వెళ్లనుంది. నిజానికి, ఈ ఎనిమిది వైద్య కళాశాలలకు బోధనా వైద్యులు లేకపోవడంతో అనుమతులు ఇవ్వలేమని ఎన్ఎంసీ గత నెల 8న ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లకు లేఖలు రాసింది. దీనిపై అప్పీలుకు వెళ్లిన రాష్ట్రం.. లోపాల సవరణకు గడువు కోరింది. ఎన్ఎంసీ వర్చువల్‌గా తనిఖీ చేసే నాటికి అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, ఆస్పత్రులకు సూపరింటెండెంట్లను నియమించింది. దాంతో సంతృప్తి చెందిన ఎన్ఎంసీ నాలుగింటికి ఎల్‌వోపీ జారీ చేసింది. కాగా, ప్రభుత్వ, ప్రైవేటు కలిపి రాష్ట్రంలోని 56 మెడికల్ కాలేజీల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులోని ప్రభుత్వ వైద్య కళాశాలలు 28 ఉండగా వాటిలో 3,915 సీట్లున్నాయి. కొత్తగా నాలుగు కాలేజీలకు అనుమతులు రావడంతో ఈ సీట్ల సంఖ్య మరో 200 పెరిగి 4,115కు చేరింది.

మరో రెండు కాలేజీలకు అనుమతులు !

ఎన్ఎంసీ పెండింగ్‌లో పెట్టిన నాలుగు వైద్య కళాశాలల్లో మెదక్, మహేశ్వరం కాలేజీలకు ఎల్‌వోపీలు వస్తాయని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రెండింటికి అనుబంధ ఆస్పత్రులు ఉండడమే ఇందుకు కారణం. ఇక, యాదాద్రి భువనగిరిలో అనుబంధ ఆస్పత్రి లేకపోవడంతో అక్కడ అనుమతులు రావడం కష్టమేనన్న భావన ఉంది. కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీకి అనుబంధ ఆస్పత్రిగా దేనిని చూపాలనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. కొత్తగా కట్టే టిమ్స్ ఆస్పత్రిని అనుబంధ ఆస్పత్రిగా చూపాలని అనుకుంటున్నారు. కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీలో ఎన్ఎంసీ నిబంధనల మేరకు అధ్యాపక సిబ్బందిని నియమించారు. దాంతో కాస్త ఆలస్యంగానైనా ఈ కళాశాలకు ఎల్‌వోపీ వస్తుందని అంచనా వేస్తున్నారు. కాగా, ప్రైవేటు యాజమాన్యాలు 3 కాలేజీల కోసం దరఖాస్తు చేయగా, వాటి అనుమతులపై స్పష్టత రావాల్సి ఉంది.

5న పెదవాగు, 6న సీతారామపై గోదావరి బోర్డు భేటీ

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పెదవాగు వైఫల్యంపై ఈ నెల 5వ తేదీన తెలుగు రాష్ట్రాల అధికారులతో గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) భేటీ కానుంది. దీని కోసం ఆయా రాష్ట్రాల్లో ప్రాజెక్టు బాధ్యతలు చూస్తున్న అధికారులు సమావేశానికి హాజరు కావాలని బోర్డు కబురు పంపింది. గత నెల 18న వచ్చిన భారీ వరదలతో ప్రాజెక్టు దెబ్బతిని 16 గ్రామాలు నీట మునిగి 400 ఎకరాల్లో ఇసుక మేట వేసిన విషయం తెలిసిందే. అలాగే ఈ నెల 6వ తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు డీపీఆర్‌పై చర్చించడానికి వీలుగా గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం జరగనుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉద్యమానికి 'న్యాయం'

తెలుగు రాష్ట్రాల మాదిగలు ముప్పై సంవత్సరాలుగా చేస్తున్న పోరాటం విజయవంతమైంది. భారత ప్రధాన న్యాయమూర్తితో సహా ఏడుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం ఉదయం ఇచ్చిన చరిత్రాత్మక తీర్పుతో షెడ్యూల్డ్ కులాల, తెగల రిజర్వేషన్ల వర్గీకరణపై బిగుసుకున్న పీటముడి విడిపోయింది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి చేసిన పోరాటం మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో తలెత్తిన ఇవే మోస్తరు డిమాండ్లు, జరిగిన జనాందోళనలు అన్నీ ఈ తీర్పుతో ఒక కీలకమయిన విజయం సాధించాయి. ఇప్పుడిక, రాష్ట్రాలు వాటి వాటి సొంత పరిస్థితులను బట్టి, ఎస్సీఎస్టీ తెగల రిజర్వేషన్లలో ఉప విభజన చేయవచ్చు. కాకపోతే, యథేచ్ఛగా, ఇష్టాయిష్టాలను బట్టి కాకుండా, వాస్తవమైన, లెక్కించదగిన సమాచారం ఆధారంగా మాత్రమే ఉపవిభజన జరగాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. ఈ తీర్పులో మరో ముఖ్యమైన అంశం, షెడ్యూల్డు కులాలు, తెగల రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ప్రాతిపదికను అమలు చేయాలన్న ఆదేశం. రిజర్వేషన్లు అర్హులకే అందాలన్న విలువకు అనుగుణమైనది ఈ క్రీమీలేయర్ పరిగణన. షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ల వర్గీకరణకు కూడా దారి సుగమం చేస్తున్న ఈ తీర్పువల్ల అనేక రాష్ట్రాలలో కొత్త ఆకాంక్షలు, ఆందోళనలు వ్యక్తంకావచ్చు.

న్యాయవివాదం వల్లనే వర్గీకరణ అంశం స్తంభించిపోవడం నిజమే కానీ, ఇది కేవలం లిటిగేషన్ మాత్రమే కాదు. దీని వెనుక ఎంతో ప్రజాపోరాట చరిత్ర ఉన్నది. వర్గీకరణ లేకపోవడం వల్ల తమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుగు రాష్ట్రాల మాదిగ సమాజం ఎలుగెత్తి చాటిన తరువాత, ఆ స్పందనను చూసి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చట్టం చేసి, దాని ప్రకారం రిజర్వేషన్లను కొంతకాలం అమలుచేశారు కూడా. దాని మీద న్యాయస్థానంలో దాఖలైన వ్యాజ్యమే 'ఇ.వి. చిన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్.' 2004 నాటి ఈ కేసు తీర్పులో ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం వర్గీకరణ చెల్లదని చెప్పింది. రాజ్యాంగంలోని 341 అధికరణం షెడ్యూల్డు కులాల, తెగల జాబితా నిర్ణయాన్ని రాష్ట్రపతికి దఖలు పరిచిందని, దాన్ని రాష్ట్రాలు ఉల్లంఘించలేవని ఆ తీర్పు సారాంశం. ప్రస్తుతం పంజాబ్ ప్రభుత్వం వేసిన వ్యాజ్యం మీద ఇచ్చిన తీర్పులో ఈ 2004 నాటి తీర్పునే తప్పు పట్టారు. వర్గీకరణ అన్నది జాబితాను సవరించడం కాదని, అణగారిన తరగతులు ఏకరూప తరగతులు కావని, వాటిలోనూ అంతరాలు ఉంటాయని, ఏ రకంగానూ వర్గీకరణ రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించినట్టు కాదని చెబుతూ, షెడ్యూల్డు కులాలు, తెగల రిజర్వేషన్లలో రాష్ట్రాలు ఉపవిభజన చేసుకోవచ్చునని చెప్పింది. చిన్నయ్య కేసులో ఇచ్చిన తీర్పుతో విభేదిస్తున్నామని ఈ కేసులో ఐదుగురు సభ్యుల బెంచి 2020లోనే అభిప్రాయపడడంతో, ఈ వ్యాజ్యాన్ని ఏడుగురు సభ్యుల బెంచికి నివేదించారు.

సమాజంలో అట్టడుగు, బడుగు వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడానికి ఉన్న సమర్థనలే ఉపవిభజనకు కూడా వర్తిస్తాయి. మంద కృష్ణ మాదిగ చెప్పినట్టు, వర్గీకరణ అన్నది దోపిడీ పీడనలకు సంబంధించినది కాదు. అసమానతలకు సంబంధించినది. ఒక సామాజిక వర్గం విషయంలో సానుకూల వివక్ష చూపించినప్పుడు, ఆ వర్గంలోని వేరువేరు శ్రేణులు సమానంగా ఆ లబ్ధి పొందలేకపోతే, జరిగేది అన్యాయమే. ఆ అన్యాయాన్ని సరిదిద్దడానికి, జనాభా, ఇతర సామాజిక ప్రాతిపదికల పైన వర్గీకరణ చేసి పంచడమే న్యాయమని మాదిగ దండోరా ఉద్యమం వాదించింది. వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాస్వామిక వాదులు, పౌరసమాజం అంతా మాదిగ ఉద్యమానికి సానుభూతిగా నిలిచారు. ఈ ప్రయాణంలో ప్రత్యేకంగా చెప్పుకోదగినది చంద్రబాబు నాయుడు, ఆయన పార్టీ తెలుగుదేశం అందించిన మద్దతు, చూపిన చొరవ. వర్గీకరణ కారణంగా మాదిగలకు కలిగే ప్రయోజనాన్ని ఆచరణాత్మకంగా, నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో అమలైన రిజర్వేషన్లు నిరూపించాయి.

ప్రజా ఉద్యమాల చరిత్రలో ఎంఆర్‌పీఎస్ ది ప్రత్యేకమైన అధ్యాయం. సృజనాత్మకమైన, సాహసోపేతమైన ఆందోళనరూపాలను రూపొందించి, ప్రభుత్వాలను ఉక్కిరిబిక్కిరి చేసింది ఆ సంస్థ. పార్టీల మీద నైతికమయిన, రాజకీయమైన ఒత్తిడిని తీసుకురాగలిగింది. అనేకమార్లు శాసనసభల చేత తీర్మానాలను చేయించింది, అఖిలపక్షాలు ఢిల్లీ వెళ్లేట్టు చేయగలిగింది. ఎవరు మద్దతు ఇస్తే, వారి పక్కన నిలబడి, తన ఉద్యమాన్ని మందకృష్ణ కొనసాగించగలిగారు. దీర్ఘకాలం ఉద్యమం స్తబ్ధ దశలోకి వెళ్లినా, ఇతర ప్రజా ఉద్యమాలను చేపట్టి తమ సంస్థ ఉనికిని చాటుకున్నారు.

రెండు తెలుగురాష్ట్రాలు సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా వర్గీకరణ చేపడతామని ముందుకు రావడం హర్షణీయం. ఈ కేసులో పిటిషనర్లుగా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. అవి అన్నీ వెంటనే నిర్ణయాలు తీసుకునే అవకాశమున్నది. కేంద్రప్రభుత్వం తీసుకోవలసిన చర్యలేవీ లేవు కానీ, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో నిర్ణయాలు ఎట్లా ఉంటాయో చూడవలసి ఉన్నది. ఏది ఏమయినా, వివక్షితులలో అంతర్గత వివక్ష ఉండరాదనే సహజసూత్రం నెగ్గింది. ఈ ఉద్యమం వల్ల దళిత ఉద్యమంలో కొన్ని పొరపొచ్చాలు, అనైక్యత ఏర్పడిందని బాధపడినవారున్నారు. ఇప్పుడు, ఈ తీర్పు తరువాత, అంతా వాస్తవాన్ని అంగీకరిస్తారని, బలశాలి అయిన సమష్టి దళిత సమాజంగా రూపొందుతారని ఆశించవచ్చు.

సుప్రీం 'వర్గీకరణ' తీర్పు

సమన్యాయానికి సరైన దారి

ఎస్సీల్లో ప్రతి వెనుకబడిన కులానికి, ఎస్టీల్లో ప్రతి వెనుకబడిన తెగకు రిజర్వేషన్ల పంపిణీ న్యాయం జరగడానికి వీలుగా, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వర్గీకరించి తీరాల్సిందేనని గురువారం నాడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పునివ్వడాన్ని స్వాగతిస్తున్నాం. దేశ న్యాయ వ్యవస్థలో, సామాజిక న్యాయ కల్పనలో, ఈ తీర్పు ఒక ముఖ్య ఘట్టమవుతుంది. ఎస్సీల్లోనూ, ఎస్టీల్లోనూ అత్యంత వెనుకబడిన ఎస్సీ కులాలు, జాతులు, తెగలకు విద్య–ఉద్యోగ రంగాల్లో పంపిణీ న్యాయం కల్పించడానికి ఈ తీర్పు తొలి అడుగు



దక్షిణాది రాష్ట్రాల్లో మాదిగలు సాగించిన ఉద్యమం, ఉత్తరాది రాష్ట్రాల్లో సాగిన వాల్మీకి ఉద్యమం అనేక చారిత్రక మలుపులు తిరిగాయి. దశాబ్దాల తర్వాత ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల వర్గీకరణ సమస్య ఒక పరిష్కార దశకు చేరింది.

అవుతుందని భావిస్తున్నాం. ఈ తీర్పు పట్ల పంపిణీ న్యాయం, సామాజిక న్యాయం కోరుకునే శక్తులు, వ్యక్తులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో అరవై ఒక్క ఎస్సీ కులాలు ఉన్నాయి. ముప్పై ఐదు ఎస్టీ తెగలు ఉన్నాయి. అలాగే దేశంలో సుమారు 1150 ఎస్సీ కులాలు, 650 ఎస్టీ తెగలు ఉన్నాయి. ఈ రెండు సాంఘిక కేటగిరీల్లోనూ అభివృద్ధి వ్యత్యాసాలు ప్రస్ఫుటంగా, తీవ్రంగా ప్రబలి ఉన్నాయి ఈ విషయం 1965లో కేంద్ర న్యాయశాఖ విచారణ కోసం నియమించిన జస్టిస్ లోకూర్ కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. విద్య, ఉద్యోగ, సంక్షేమ రాజకీయ రంగాల్లో ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన కులాలు, తెగల వారికి భారత రాజ్యాంగం రిజర్వేషన్ అవకాశాలు కల్పిస్తున్నది. కాగా సింహభాగం రిజర్వేషన్ అవకాశాలను కొన్ని ఎస్సీ కులాలు, ఎస్టీ తెగలే అనుభవిస్తుండగా, చాలా కులాలు, తెగలు ఇంకా రిజర్వేషన్లు అందుకోలేని దుస్థితిలోనే ఉన్నాయి. అభివృద్ధిలో అడుగుకి నెట్టివేయబడుతున్నాయి.

దేశ జనాభాలో దాదాపు మూడు వంతులకు పైగా ఎస్సీ, ఎస్టీ జనాభా ఉన్నారు. దేశంలో సుమారు 1780 విడివిడి సమూహాలుగా ఉన్న ఎస్సీ, ఎస్టీల్లో, కేవలం వేళ్లపై లెక్కపెట్టగలిగే కులాలు, జాతులు, తెగల్లో కొంత మంది, కొన్ని కుటుంబాలే అధిక భాగం రిజర్వేషన్ల లబ్ధి పొందుతున్న పరిస్థితి ఉన్నది. ఈ అపసవ్య పరిస్థితులను మార్చుకోవాలని 1994 నుంచి ఎమ్మార్పీఎస్ ఉద్యమిస్తున్నది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మాదిగలు ఎన్నో చరిత్రాత్మక ఉద్యమాలు చేశారు. కర్నాటక, తమిళనాడు మొదలైన దక్షిణాది రాష్ట్రాల్లో మాదిగలు సాగించిన ఉద్యమం, ఉత్తరాది రాష్ట్రాల్లో సాగిన వాల్మీకి ఉద్యమం అనేక చారిత్రక మలుపులు తిరిగాయి. ఈ ఉద్యమాలు రాజకీయ, సామాజిక ప్రభావాలను చూపాయి. దశాబ్దాల తర్వాత ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల వర్గీకరణ సమస్య ఒక పరిష్కార దశకు చేరింది.

ఎవరి వాటా విద్య ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ అవకాశాల రిజర్వేషన్లను వారు పొందగలిగే గ్యారెంటీ పరిస్థితులు ఉండగలిగినప్పుడే, ఆ పరిస్థితుల్ని కాపాడుకోగలిగినప్పుడే అంతర్గతంగా ఎస్సీ (మాదిగ–మాల) కులాల మధ్య, ఎస్సీ–ఎస్టీల మధ్య ఐక్యత సాధ్యమవుతుంది. సాంఘిక రాజకీయ అనుబంధం దృఢమవుతుంది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని సోదర మాల కులస్థులు, లంబాడీ, ఎరుకల జాతి మిత్రులు ఈ తీర్పుకి కట్టుబడాలని పిలుపునిస్తున్నాం. సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన విధంగా ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను హేతుబద్ధంగా పంపిణీ చేయడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలని, ఈ మేరకు రాష్ట్రాలకు అధికారాలను త్వరగా దఖలుపరచాలని కోరుతున్నాం. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సుప్రీంకోర్టు తీర్పు అమలును త్వరగా ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నాం. మాదిగ ఉద్యమాన్ని బలపరిచిన సామాజిక, న్యాయ శక్తులకు, రాజకీయ పార్టీలకు, సంఘాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. తదుపరి ప్రక్రియల్లోనూ అండగా నిలబడాలని, రిజర్వేషన్లలో మేము సత్వర న్యాయం పొందటానికి, తద్వారా అధికార సాధనలో భాగస్వాములు కావడానికి కలిసి రావాలని సామాజిక, న్యాయ శక్తులను కోరుతున్నాం.




○ కృపాకర్ మాదిగ
వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి

రాజ్యాంగ ఉల్లంఘనలకు తెరపడుతుందా?

మూడున్నర, నాలుగు మాసాల్లో పదవీ విరమణ చేయబోతున్న భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ రెండు కీలకమైన వివాదాలను విచారణకు చేపట్టారు. ఇందులో ఒకటి– రాజ్యాంగం ఆర్టికల్ 110 దుర్వినియోగంపై దాఖలైన పిటిషన్లను ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలని తీసుకున్న నిర్ణయం. రెండవది రాష్ట్రాల గవర్నర్లకు కోర్టు కేసుల నుంచి రక్షణ కల్పిస్తున్న రాజ్యాంగ అధికరణ 361ను సమీక్షించాలని సంకల్పించడం.

ఎవరు అధికారంలోకి వచ్చినా రాజ్యాంగానికి లోబడి పాలించాలి. తాము మాత్రం ఇందుకు అతీతులమని బీజేపీ పాలకులు భావిస్తుంటారు. వివాదాస్పద బిల్లులను ద్రవ్య బిల్లుల (మనీ బిల్లు) మార్గంలో (ఆర్టికల్ 110 దారిలో) ఆమోదింప చేసుకునే జబర్దస్తీ పద్ధతిని బీజేపీ పాలకులు ఎంచుకొని చాలాకాలమైంది. ఆధార్ కార్డు బిల్లుకు ఈ విధంగానే పార్లమెంట్ అనుమతిని సాధించారు. అయితే ఇది ఇప్పుడు వివాదంలో కూరుకున్నది. మనీ బిల్లు లేదా ఆర్టికల్ 110 నిజానికి ప్రభుత్వ ధనసేకరణ, ఖర్చులకు మాత్రమే పరిమితమైనది. ఈ మనీ బిల్లు రాష్ట్రపతి, స్పీకర్ అదుపాజ్ఞలలో కేవలం లోక్‌సభ ఆమోదంతో శాసన రూపం ధరిస్తుంది. ఈ అంశాలతో ఏ మాత్రం సంబంధం లేని వివాదాస్పద ఆధార్ బిల్లును మనీ బిల్లుగా పరిగణింపజేసి చట్టం చేయించుకోడం రాజ్యాంగానికి తీవ్ర అపరాధం. బీజేపీకి రాజ్యసభలో ఇప్పటికీ మెజారిటీ సిద్ధించలేదు. అందుచేత మనీ బిల్లు మార్గాన్ని మళ్ళీ దుర్వినియోగం చేయగలరనే భయాలు కొనసాగుతున్నాయి. 2024–25 కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్నందున మనీ బిల్లు మార్గం మళ్ళీ దురుపయోగం కావొచ్చుననే భయాన్ని వ్యక్తం చేస్తూ ఇటీవల సీనియర్ అడ్వకేట్లు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి, ఇందిరా జైసింగ్‌లు సిజెఐని ఆశ్రయించారు. ఆధార్‌ను ఆసరా చేసుకొని పంపిణీ చేస్తున్న సబ్సిడీలు సంఘటిత నిధి నుంచి తీసుకొంటున్నందున ఆధార్ బిల్లు మనీ బిల్లు కిందికే వస్తుందని కేంద్రం బుకాయించింది. అయితే ఆధార్ బిల్లుకు మనీ బిల్లు హోదా కల్పించి చట్టం చేయించుకోడాన్ని 41 మెజారిటీ తీర్పుతో 2018లో సుప్రీంకోర్టు ధ్రువీకరించింది. అసమ్మతి తీర్పు చెప్పిన ఏకైక న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ దానిని రాజ్యాంగ విరుద్ధ చర్యగా పేర్కొన్నారు. ఆధార్ బిల్లులో మన స్వేచ్ఛలను అరికట్టే అంశాలున్నాయని అన్నారు. సాధారణ బిల్లును మనీ బిల్లు మార్గంలో చట్టం చేయించుకోడం శాసన నిర్మాణంలో రాజ్యసభ పాత్రను పరిమితం చేయడమే అవుతుందనీ పేర్కొన్నారు. వాస్తవానికి



రాజ్యాంగ అధికరణ 110 దుర్వినియోగానికి తెరదించడం, గవర్నర్ల 361(2) కవచాన్ని తొలగించడం నేటి అవసరం. మూడున్నర, నాలుగు మాసాల్లో పదవీ విరమణ చేయబోతున్న భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ఈ కీలకమైన వివాదాలను విచారణకు చేపట్టారు.

ఈ వివాదంపై ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం సిఫార్సు మేరకు ఏడుగురు జడ్జీల ధర్మాసనం నియామక నిర్ణయం ఎప్పుడో జరిగిపోయింది. ఈ ముడిని పూర్తిగా విప్పే వైపుగా సిజెఐ హోదాలో చంద్రచూడ్ ఇప్పుడు కీలక నిర్ణయం తీసుకున్నారు.

ఈ పద్ధతిని సవాలు చేస్తున్న పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనం వచ్చే అక్టోబర్‌లో విచారణకు చేపడుతుందని ప్రకటించారు. చంద్రచూడ్ చేసిన ప్రకటనను కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేష్ స్వాగతించారు. గత పదేళ్లలో చాలా బిల్లులను మనీ బిల్లుల పేరిట ఆర్టికల్ 110 ద్వారా బుల్డోజ్ చేశారన్నారు. వచ్చే నవంబర్‌లో తాను రిటైర్ అయ్యేలోగానే దీనిపై చంద్రచూడ్ స్పష్టమైన అంతిమతీర్పును ప్రకటించాలని జైరాం రమేష్ కోరారు.

సుప్రీంకోర్టు నుంచి చంద్రచూడ్ ఇచ్చిన తీర్పుల్లో ప్రముఖమైనది వ్యక్తి గోప్యత హక్కుకు సంబంధించినది. ఇది రాజ్యాంగం హామీ ఇస్తున్న హక్కు అని, వ్యక్తికి వ్యక్తిగత గోప్యత హక్కు ద్వారానే ఆత్మ గౌరవం, స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు లభిస్తాయని జస్టిస్ కెఎస్ పుట్టస్వామి, ఎఎస్ఆర్ వెర్సెస్ భారత యూనియన్ కేసులో స్పష్టం చేశారు. ఈ తీర్పు ఫ్యూడల్ సమాజ దుర్మార్గ విలువల పట్టును బద్దలు గొట్టి సమాజంలో వ్యక్తి గౌరవానికి పట్టం కట్టింది. ఈ తీర్పుతోనే తొమ్మిది మంది న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం పౌరుల వ్యక్తిగత గోప్యతా హక్కును రాజ్యాంగం 21 అధికరణ కింద ప్రాథమిక హక్కుల్లో చేర్చింది. పరస్పర సమ్మతితో సాగే స్వలింగ సంపర్కానికి ఆమోద ముద్ర వేసి మానవ సంబంధాల్లో విప్లవాత్మక మార్పును చంద్రచూడ్ ఆవిష్కరించారు. బ్రిటిష్ హయాంలో శిక్షాస్మృతిలో చేర్చిన 377 సెక్షన్ కోరలను పెకిలించారు. స్వలింగ సంపర్క హక్కును నిరాకరించడం వ్యక్తి గోప్యత హక్కును ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. సైన్యంలో మహిళలకు పురుషులతో సమానంగా పూర్తి స్థాయి సైనిక బాధ్యతలు అప్పగించాలని ఇచ్చిన మరో తీర్పు సైతం చరిత్రాత్మకమైనదే. ఇలా చంద్రచూడ్ తన పదవీకాలంలో న్యాయవ్యవస్థకు మరింత సునిశితమైన మానవీయ చూపును కల్పించారు. మహిళకు తన శరీరంపై పూర్తి అధికారం ఉండాలని చెబుతూ ఆమె తాను ధరించిన గర్భం వద్దనుకుంటే 20–24 వారాల పిండాన్ని కూడా తొలగింపజేసుకోవచ్చని తీర్పు ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియకు అపూర్వ స్థాయిలో కార్పొరేట్ ధన కాలుష్యాన్ని చేర్చిన ఎలక్టోరల్ బాండ్ల పద్ధతి గుట్టు రట్టు చేసి దానికి తెరదించారు. ఇప్పుడు మనీ బిల్లు మార్గం దురాక్రమణను కూడా అరికట్టిస్తారని చంద్రచూడ్‌పై ఆశలు పెట్టుకోడం సహజం.

రాష్ట్రాల గవర్నర్లపై కేసులు పెట్టకుండా నిరోధించడం తగదంటూ దాఖలైన పిటిషన్ కూడా ఎంతో ముఖ్యమైనది. రాష్ట్రపతి, గవర్నర్లు పదవిలో ఉన్నంతకాలం వారిపై ఎటువంటి కోర్టు కేసులు పెట్టరాదని ఆర్టికల్ 361(2) నిర్దేశిస్తున్నది. గత పదేళ్లలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు ఇష్టావిలాసంగా రాజకీయ విమర్శలు చేసి అక్కడి ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టిన సంగతి తెలిసిందే. ఈ ధోరణి ఇంకా కొనసాగుతున్నది. ప్రతిపక్ష రాష్ట్రాల్లో ప్రభుత్వాలు శాసనసభలో ఆమోదింపజేసుకున్న బిల్లులకు మాసాలు, ఏళ్ల తరబడిగా ఆమోదం తెలపకుండా రాజ్‌భవన్‌లు కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచాయి. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. తమిళనాడు గవర్నరు ఎన్.రవి రాజ్యాంగ విరుద్ధ ప్రవర్తన పట్ల చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం మొన్న మార్చి నెలలోనే తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఆయన రాజ్యాంగాన్ని ఉల్లంఘించి మాట్లాడుతుంటే మేము కళ్ళు మూసుకొని కూర్చోవాలా అని చంద్రచూడ్ ప్రశ్నించారు. డిఎంకె నాయకుడు కె.పొన్ముడి శిక్షపై సుప్రీంకోర్టు స్టే విధించిన తర్వాత ముఖ్యమంత్రి స్టాలిన్ సిఫార్సు మీదట ఆయన చేత తిరిగి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించడానికి గవర్నర్ నిరాకరించడాన్ని సిజెఐ తప్పుపట్టారు. ఆయన సుప్రీంకోర్టునే ధిక్కరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఒకరోజులో పొన్ముడి చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించాలని అల్టిమేటమ్ ఇచ్చారు.

గవర్నర్లు దారి తప్పి రాష్ట్ర ప్రభుత్వాల పాలనను అడ్డుకుంటున్నప్పుడు వారిని సరి చేయించాల్సిన బాధ్యత గల కేంద్ర పాలకులు నిమ్మకు నీరెత్తినట్టు కూచుంటున్నారు. పైపెచ్చు అలా ప్రవర్తించడంలో అగ్రేసరులు అనిపించుకొంటున్న గవర్నర్లకు మరింత ఉన్నత పదవులిచ్చి గౌరవిస్తున్నారు. తనను రాజ్‌భవన్‌లోనే లైంగికంగా వేధించారని పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనంద బోస్ మీద ఇటీవల ఒక మహిళ చేసిన ఆరోపణ తెలిసిందే. దీనిపై విచారణ జరిపి న్యాయం ప్రసాదించవలసిందిగా కోరుతూ ఆమె సుప్రీంకోర్టుకు ఎక్కారు. సిజెఐ చంద్రచూడ్ సారథ్యంలో ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏర్పాటైంది. గవర్నర్లు కోర్టు కేసుల నుంచి రాజ్యాంగం 361(2)ద్వారా పొందుతున్న పూర్తి రక్షణ ఉచితానుచితాల నిగ్గు తేల్చాలంటూ ఆ మహిళ అర్థించారు. దీనిని మన్నించిన ధర్మాసనం ఇప్పుడు ఆర్టికల్ 361(2) మంచి చెడ్డలపై దృష్టి సారించింది.

రాజ్యాంగ అధికరణ 110 దుర్వినియోగానికి తెరదించడం, గవర్నర్ల 361(2) కవచాన్ని తొలగించడం నేటి అవసరం. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగంపై జరిగిన చర్చకు దీనివల్ల సార్థకత కలుగుతుంది.

▪ జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

'తెలుగు నేల మీద ఆమె నడవని ఉద్యమం లేదు'

మాధవి కూడా వెళ్లిపోయింది. చాలా నిశ్శబ్దంగా.

అత్యంత ప్రభావశీలురైన వ్యక్తుల్లో బాలగోపాల్ ఒకరు. అనేక పెద్ద పెద్ద హత్యా ప్రయత్నాల నుండి బయటపడి అతి చిన్న అనారోగ్య కారణంగా బాలగోపాల్ మనల్ని విడిచి వెళ్లిన తర్వాత ఆ వెలితి, ఆ శూన్యం అలాగే ఉంది. గుండె కింద తడి కూడా. బాలగోపాల్ చెల్లెలు మాధవి కూడా మరణించారని విన్నాక ఆ తడి మళ్ళీ ఉబికి వచ్చింది. బాలగోపాల్ తాత్వికతను జీవనశైలిని పని విధానాన్ని ఎక్కువగా అనుసరించిన, ఆచరించిన కుటుంబసభ్యురాలు మాధవి.



దాదాపుగా 1990 నుంచి 2020 వరకు నిరంతరం తెలుగు నేల మీద ఆమె నడవని ఉద్యమం లేదు, నిలవని పోరాటం లేదు. చాలా నిశ్శబ్దంగా పనిచేసింది.. అంతకంటే నిశ్శబ్దంగా వెళ్లిపోయింది. తాను పని చేసిన సంఘాలకు వ్యక్తులకు కూడా తెలియనంత పని చేసింది. తాను ఎవరి కోసమైతే పని చేసిందో వాళ్లకు కూడా తను చేసిన పని గాని, దాని ఫలితం గాని తెలియదు. గ్రామీణ ఉపాధి హామీ పథకం తెలంగాణ, స్త్రీ వాద, దళిత, అస్తిత్వ దళిత ఉద్యమాల్లో తన పరిమితుల మేర పనిచేసింది, కళింగ సముద్రపు ఒడ్డు నుండి నల్లమల మీదుగా దండకారణ్య నడిబొడ్డు వరకు అన్ని పనుల్లో అన్నతో పాటు నడవడమే గాక, తాను అవసరమనుకున్న చోట ఒంటరిగాను ఇతరులతోను కలిసి పనిచేసింది.

సమస్త జీవరాశుల కోసం ఏదో ఒక మేరకు పని చేస్తున్న హక్కుల ఉద్యమకారులు ఇలా ఒకొక్కరు వెళ్లిపోతుంటే దుఃఖం కూడా ఇంకిపోతుంది. కులం, మతం, ప్రాంతం, భాష, వర్గం ఆధిపత్యాల నడుమ; పరిసరాలు, పరిస్థితులు, అవకాశాలు, అవసరాల ప్రభావాలతో కుటుంబం సంసారం బరువు బాధ్యతల మధ్య తాము జీవించిన కాలంలో విలువల కోసం తపించి, ఆచరించి అసమానతలు అన్యాయాలకు ఎదురునిలిచి పౌర మానవ సమస్త జీవజాతుల హక్కుల కోసం జీవించిన వాళ్లకు మరణం ఏముంటుంది. మాధవి విద్యావంతురాలు హక్కుల ఉద్యమకారిణిగానే కాకుండా పేద పిల్లల చదువుల కోసం తన వంతుగా అనేక మందికి ఆర్థిక, హార్దిక సహకారం అందించింది. మంచి గాయని కూడా.. రఫీని తన గొంతులో భలే నింపుకునేది. ఎంతలా అంటే రఫీ ఆడపిల్ల అయితే ఇలాగే పాడేవాడన్నంతగా.

గ్రామీణ ఉపాధి హామీ పథకం–తెలంగాణ ఉద్యమంలో, నల్లగొండ, నల్లమలలో తనతో పని చేసిన అనేక అనుభవాలు ఉన్నాయి. తను 'మనందరిల్లు' ఆలగడపలో గడిపిన జ్ఞాపకాల బరువుతో మానవ హక్కుల సంఘ సభ్యురాలు మాధవికి, ఆమె నడిచిన తోవలో అమరులకు నివాళులు.

–వేనేపల్లి పాండురంగారావు, 'మట్టి మనిషి'

అధికారం కోసం అగ్గిరాజేస్తారు...!

అధికారంలో ఏ పార్టీ ఉన్నా, రాష్ట్రంలో శాంతిభద్రతలు చక్కగా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చి రాష్ట్ర యువతకు ఉద్యోగాలు రావాలని అన్ని పార్టీలూ కోరుకోవాలి. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, రాష్ట్రం బాగుండాలని కోరుకోవాలి. రాజకీయాల్లో ఉన్నవారు, నాయకులైనవారు ప్రజల బాగు కోరాలి. రాష్ట్రాభివృద్ధికి ప్రతిపక్షం కూడా బాధ్యతాయుతంగా ప్రభుత్వానికి సహకరించాలి. కానీ నేడు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ వైఖరి ఇందుకు పూర్తి విరుద్ధం. అధికారం చేతిలో లేకపోతే రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించాలి, అల్లర్లతో రాష్ట్రం అట్టుడకాలి, అశాంతిని అడ్డం పెట్టుకొని రాజకీయం చేసి అధికారంలోకి రావాలనేది మొదటి నుంచి కేసీఆర్‌కు ఉన్న దుష్ట ఆలోచన. రాష్ట్రం పచ్చగా ఉండటం కేసీఆర్‌కు ఇష్టం ఉండదు. ఏదో ఒక సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని ఆయన నిరంతరం ఆలోచిస్తుంటారు. ప్రజలేమైనా పర్లేదు, తనకు, తన కుటుంబానికి అధికారం ఉంటే చాలు.

గతంలో చంద్రబాబు మంత్రి పదవి ఇవ్వకపోవటంతో ఆయనను బెదిరించటానికి తెలంగాణ పాటను ఎత్తుకున్నారు. ఉద్యమం శాంతియుతంగా నడుస్తుంటే కేసీఆర్‌కు నచ్చలేదు. ఒక రోజు హఠాత్తుగా హరీశ్‌రావు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ముట్టించుకోవటానికి అగ్గిపెట్టె దొరకడం లేదంటూ మీడియా ఎదుట డ్రామాలాడారు. ఇది సంచలనమై, ఇదేవిధంగా చేస్తే రాష్ట్రం సిద్ధిస్తుందని యువత భావించింది. శ్రీకాంతాచారి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోవటంతో రాష్ట్రంలో అగ్గిరాజుకుంది. ఈ విషయాన్ని టీఆర్ఎస్ విపరీతంగా ప్రచారం చేసింది. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత భావించి ఆవేశంతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని యువకులను శాంతింపజేయాల్సింది పోయి వారిని మరింతగా టీఆర్ఎస్ నాయకులు రెచ్చగొట్టిన కారణంగా వందలమంది విద్యార్థులు బలైపోయారు. నిజానికి చావునోట్లో తలపెట్టింది విద్యార్థులయితే.. అదంతా తన ఖాతాలో వేసుకొని సకుటుంబ సపరివార సమేతంగా పదవులు, భోగాలు అనుభవించారు కేసీఆర్. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇస్తే తానే తెలంగాణ తెచ్చిన వీరుడినని ప్రచారం చేసుకొని విద్యార్థుల బలిదానాలను అడ్డంపెట్టుకొని, సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. వచ్చిన తరువాత బలిదానాలు చేసిన యువత కుటుంబాలను, త్యాగాలు చేసిన వారిని కేసీఆర్ విస్మరించారు. ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను, నాయకులను ఫిరాయింపు చేసుకొని వారికి పదవులు ఇచ్చారు తప్ప త్యాగాలు చేసిన కుటుంబాలకు ఒక్కరికి కూడా పదవులివ్వలేదు కదా వారిని దగ్గరికి కూడా రానివ్వలేదు. దీనిని బట్టి తెలుస్తున్నదేమిటంటే.. ఉద్యమంలో విద్యార్థులను రెచ్చగొట్టింది తాను అధికారంలోకి రావటానికి తప్ప వారికి న్యాయం చేయటానికి కాదని.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ పోతున్నది. అయినా కరెంట్ ఉండటం లేదని, పొలాలు ఎండిపోతున్నాయని, వడ్లు కొనడం లేదని, రైతుబంధు ఇవ్వడం లేదని, రుణమాఫీ చేయడం లేదని ప్రజలను రెచ్చగొట్టడానికి బీఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నించింది. పార్లమెంట్ ఎన్నికలలో ఇదే అబద్ధాలను ఊరూరా ప్రచారం చేసింది. కానీ ప్రజలు ఇవేవీ నమ్మలేదు. వారు ప్రచారం చేసిన అన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చటంతో బీఆర్ఎస్‌కు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. పదేళ్లు అధికారం అనుభవించి వేల కోట్లు కూడబెట్టుకున్న కేసీఆర్‌ను ప్రజలు అధికారానికి దూరం చేయడంతో ఆయన నీటిలోంచి ఒడ్డున పడ్డ చేపలాగా గిలగిల కొట్టుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ విధంగానైనా అశాంతి నెలకొల్పి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరం చేయాలని కుట్రలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే 30వేల ఉద్యోగాలిచ్చి రికార్డు సృష్టించింది. ఆ వెంటనే డీఎస్సీ, గ్రూప్–1 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చింది. ఇది బీఆర్ఎస్ నాయకులకు కంటగింపుగా మారింది. తాము 10 సంవత్సరాల్లో చేయలేని పనిని మూడు నెలలు గడిచేటప్పటికే కాంగ్రెస్ నెరవేరుస్తుండటంతో వారు తట్టుకోలేకపోయారు. పార్లమెంట్ ఎన్నికలలో డిపాజిట్లు కోల్పోయి ఒక్క సీటు కూడా గెలుచుకోక కుదేలైపోయిన బీఆర్ఎస్‌కు ఏ అస్త్రం దొరకలేదు. దీనితో విద్యార్థులను రెచ్చగొట్టడానికని కేసీఆర్ తన క్రిమినల్ బ్రెయిన్‌ను వాడారు. ఉద్యమ సమయంలో యువతను రెచ్చగొట్టినట్లే ఇప్పుడు కూడా రెచ్చగొట్టడానికి ఆయన ఫామ్‌హౌస్‌లో కూర్చొని కొడుకు, అల్లుడుతో కలిసి వ్యూహం రూపొందించారు. డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలను వాయిదా వేయాలంటూ విద్యార్థులను రెచ్చగొట్టి రోడ్డెక్కించారు. గతంలో పరీక్షలు సక్రమంగా నిర్వహించాలంటూ విద్యార్థులు రోడ్డెక్కడం చూశాం. ఇప్పుడు, పరీక్షలు పెడతామంటే, కాదు వాయిదా వేయాలంటూ కొంతమంది ఆర్టిఫిషియల్ నిరుద్యోగుల చేత కేసీఆర్ ధర్నా చేయించడం చూస్తున్నాం.

రాష్ట్రం పచ్చగా ఉండటం కేసీఆర్‌కు ఇష్టం ఉండదు. ఏదో ఒక సెంటిమెంట్ రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని ఆయన నిరంతరం ఆలోచిస్తుంటారు. ప్రజలేమైనా పర్లేదు, తనకు, తన కుటుంబానికి అధికారం ఉంటే చాలు. అధికారానికి దూరమైన ఆయన నీటిలోంచి ఒడ్డున పడ్డ చేపలాగా గిలగిల కొట్టుకుంటున్నారు. రాష్ట్రంలో ఏవిధంగానైనా అశాంతి సృష్టించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కుట్రలు చేస్తున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల మాదిరిగా కాకుండా అన్ని పార్టీల సభ్యులకు శాసనసభలో మాట్లాడే అవకాశం కల్పిస్తున్నది. సభలో సస్పెన్షన్లు లేవు, గొడవలు లేవు. నిరాటంకంగా సభ జరుగుతున్నది. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ సభకు హాజరై మాట్లాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదే పదే కోరుతున్నా ఆయన సభకు రావటం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతిపక్షం నుంచి ఎవరూ మాట్లాడవద్దు అని బయటికి నెట్టివేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్ష నాయకుడు సభకు వచ్చి మాట్లాడాలంటూ కోరుతున్నది. కానీ కేసీఆర్ సభకు హాజరుకాకుండా ఫామ్‌హౌస్‌లో ఉంటూ ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారు.

ఈ ప్రభుత్వం ఐదేళ్లు పాలన చేయవద్దని, దానిని కూల్చాలని కేసీఆర్ కోరుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు రోజులు కాకముందే ఈ ప్రభుత్వం త్వరలో కూలిపోతుందన్నారు. రాష్ట్రంలో అస్థిరత సృష్టించాలని ప్రయత్నించారు. జగన్, బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని కూల్చాలని ప్రయత్నించినట్లు వార్తలు వచ్చాయి. ఇదేకాక, సభ సాఫీగా నడుస్తుంటే తట్టుకోలేక మహిళలను అవమానించారంటూ పెద్ద డ్రామాకు తెరతీశారు. సభను నడవనివ్వబోమంటూ స్పీకర్ పోడియం దగ్గర చేరి నినాదాలు చేస్తూ తీవ్ర ఆటంకం కలిగించారు. మహిళా సెంటిమెంట్ రెచ్చగొట్టాలని సభలో రచ్చ చేశారు. శాసనసభలో ప్రతిపక్షం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే ధర్నా చేయటం ఆనవాయితీ. కానీ బీఆర్ఎస్‌కు ప్రజా సమస్యలేవీ కనపడకపోవటంతో వ్యక్తిగత సమస్యలకు సభను వేదికగా మార్చారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యయుతంగా సభను నడుపుతున్నది. ప్రతిపక్షానికి మాట్లాడటానికి కావాల్సినంత సమయం ఇస్తున్నది. అయినా సభామర్యాదలను పాటించకుండా బీఆర్ఎస్ నాయకులు అనుచితంగా ప్రవర్తించారు. గురువారంనాడు స్కిల్ యూనివర్సిటీ బిల్లు, ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అనే రెండు అంశాలపై శాసనసభలో చర్చ జరిగింది. ముఖ్యమైన ఈ అంశాలపై మాట్లాడవలసిందిగా బీఆర్ఎస్ సభ్యులను పదేపదే కోరినా, పెడచెవిన పెట్టి నినాదాలు, అల్లర్లతో ఇతర సభ్యులు మాట్లాడకుండా ఆటంకం కలిగించారు. ఎస్సీ వర్గీకరణపై సభ్యులు మాట్లాడుతుంటే అరుస్తూ అంతరాయం కలిగించటాన్ని సభలోని అన్ని పక్షాలు తప్పుబట్టాయి. అయినా బీఆర్ఎస్ సభ్యులు తమ మొండి వైఖరి వీడలేదు. ఎంత అల్లరి చేసినా సస్పెండ్ చేయకపోవటంతో నిరాశకు గురై వారంతట వారే సభనుంచి వాకౌట్ చేశారు. వారు వాకౌట్ చేసింది ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగానా? లేక స్కిల్ యూనివర్సిటీకి బిల్లుకు వ్యతిరేకంగానా? అనే అనుమానం కలుగుతోంది. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో వారు వాకౌట్ చేశారంటే దానికి వ్యతిరేకంగానే వారు వాకౌట్ చేశారనే అభిప్రాయం కలుగుతోంది.

మహిళలను అడ్డంపెట్టుకొని బీఆర్ఎస్ నీచ రాజకీయానికి దిగింది. ఏదో ఒక సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించి లబ్ధిపొందాలనేది కేసీఆర్ వికృత ఆలోచన. ఆ పార్టీ పుట్టినప్పటి నుంచి వారి చరిత్ర గమనిస్తే ఇదే అర్థమవుతున్నది. రాష్ట్ర, ప్రజా ప్రయోజనాలతో వారికి సంబంధం ఉండదు. అధికారమే వారికి పరమావధి. ఇది గ్రహించే ప్రజలు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కు పంపించారు. ఈ విషయాన్ని కేసీఆర్ ఎంత తొందరగా గ్రహిస్తే రాష్ట్రానికి అంత మంచిది.

• బోరెడ్డి అయోధ్యరెడ్డి
సీపీఆర్ఓ–తెలంగాణ ముఖ్యమంత్రి

అభాగ్యుల జీవితాల్లో వెలుగులు

దశాబ్దాల తరబడి రాజ్యాంగఫలాలు అందుకోలేని అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపిన చారిత్రాత్మక తీర్పు గురువారంనాడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు. న్యాయం వైపు ధర్మం నిలబడి అన్యాయాన్ని ఓడించిన తీర్పు. 30 ఏళ్ల నిరీక్షణకి, పడిన ఆవేదనకి ఒక ముగింపు పలికిన తీర్పు. ఏ పక్షంపై పక్షపాతం చూపని తీర్పు. మాదిగ ఉపకులాల మనుగడకు జీవం పోసిన తీర్పు. ఓ వర్గం పాటించిన బయటకి కనిపించని ఓ వింత వివక్షపై విజయంగా ఈ తీర్పును చూడాలి. న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయాన్ని బలపరిచిన తీర్పుగా గౌరవించాల్సిన అవసరం ఉంది. ఈ ఉద్యమంలో అమరులైన ఉద్యమకారులు, ఎన్నో త్యాగాలు చేసిన కార్యకర్తల త్యాగ ఫలం ఈ తీర్పు అనే చెప్పాలి. చావు నోట్లో తలకాయ పెట్టి ఈ ఉద్యమాన్ని విజయతీరాలకు నడిపిస్తున్న మందకృష్ణ మాదిగ ముమ్మాటికీ సాటిలేని మహాత్ముడుగా భారతదేశ చరిత్రలో నిలిచిపోతారు. భారత రాజ్యాంగం పట్ల, డా. బి.ఆర్. అంబేడ్కర్ భావజాలం పట్ల ఏ మాత్రం గౌరవం ఉన్నా ఈ తీర్పును గౌరవించాలి. సహృదయంతో స్వాగతించాలని సలహా.

– డప్పోల్ల రమేష్, ప్రముఖ కవి, రచయిత

నగరాల్లో నరకం

ఢిల్లీ నడిబొడ్డున గొప్పపేరున్న ఒక కోచింగ్ సెంటర్‌లో వరదనీటిలో మునిగి ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. ఎంతో ధనం వెచ్చించి ఆ సంస్థలో ఎన్నో ఆశలతో చేరిన విద్యార్థులు, సదరు సంస్థ నిర్వాహకుల అత్యాశ, అధికారుల అవినీతి, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల జీవితాల్ని కోల్పోయారు. బేస్ మెంట్‌ని లైబ్రరీగా వాడుకోవడం ఆ సంస్థ కక్కుర్తి. దానిని లంచాలు తిని ఉపేక్షించడం నగర పాలక సంస్థ నిర్వాకం. ఈ సమస్య ఆ ఒక్క కోచింగ్ సెంటర్‌కో, ఆ ప్రాంతానికో పరిమితం కాదు. పుట్టగొడుగుల్లా నగరమంతా వ్యాపించిన కోచింగ్ సెంటర్లు, వాణిజ్య సముదాయాలు, అక్రమ కట్టడాలు.. ఇలా పట్టణ ప్రణాళికల్ని తుంగలో తొక్కేవి కోకొల్లలు. దేశంలో ప్రతీ పట్టణమూ ఇలా అఘోరిస్తున్నవే. కొంచెం ఎక్కువ వర్షం పడితే చాలు డ్రయినేజి పొంగి మునిగిపోయేవే. కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థలు విధులు సక్రమంగా నిర్వహిస్తే ప్రమాద రహిత పట్టణాలు తయారవుతాయి. ఎట్టి పరిస్థితిలోనూ పట్టణ ప్రణాళికలను అతిక్రమించకూడదు. ఈ పరిస్థితి మారనంతవరకూ నగరాలు నరకాలుగానే ఉంటాయి. కేంద్రం రాష్ట్రాలకు పెరుగుతున్న వత్తిడి మేరకు నిధులు, మార్గదర్శకాలు ఇవ్వాలి. రాష్ట్రాలు పట్టణాల అభివృద్ధిని దగ్గరగా పర్యవేక్షించాలి. నగర పాలక సంస్థలు సమర్థవంతంగా వ్యవహరించాలి.

– డి.వి.జి. శంకరరావు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
శుక్రవారం 2 ఆగస్టు 2024

కోచ్ తూచ్!




- కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కొర్రీలు
- 1982, 2004లో మంజూరైనా.. ఇతర రాష్ట్రాలకు తరలింపు
- చివరకు వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు
- రైల్వే డివిజన్ విషయంలోనూ పేచీలే
- అన్ని అర్హతలున్నా డివిజన్‌కు నోచుకోని కాజీపేట రైల్వే జంక్షన్
- కోచ్ ఫ్యాక్టరీ వస్తే 60వేల మందికి ఉపాధి.. వ్యాగన్‌తో అయితే 2వేల మందికే..
- దక్షిణ మధ్య రైల్వేకు గేట్‌వేగా ఉన్నా అభివృద్ధిపై నిర్లక్ష్యం

'రాష్ట్ర విభజన' హామీని విస్మరించిన కేంద్రం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ ఏర్పాటు కలగానే మారుతున్నాయి. 55ఏళ్లుగా కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజలు, ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. 2014లో ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన కోచ్ ఫ్యాక్టరీ హామీపై కూడా కేంద్ర ప్రభుత్వం 'తూచ్' అన్నట్టుగానే వ్యవహరిస్తోంది. కోచ్ ఫ్యాక్టరీకి బదులు 2023లో వ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంది. వేలాది మందికి ఉపాధిని కల్పించే కోచ్ ఫ్యాక్టరీని కాదని, వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేయటంపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో 'వ్యాగన్ వద్దు.. కోచ్ ఫ్యాక్టరీ ముద్దు' అంటూ ఓరుగల్లువాసులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పట్టాలెక్కటం లేదు.

కాజీపేట చేజారిన కోచ్ ఫ్యాక్టరీ..

కాజీపేట రైల్వే స్టేషన్ ఉత్తర, దక్షిణ భారత దేశానికి వారిధిగా నిజాం కాలంలోనే నిర్మించారు. కాశీ నుంచి కన్యా కుమారి, చెన్నై నుంచి కోల్‌కత్తా, హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు.. ఎక్కడికి వెళ్లాలనుకున్నా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక అదాయం వచ్చే ప్రాంతం కావటంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో 1969లోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు మొదలయ్యాయి. అప్పటి కమ్యూనిస్టు నేతలు టీఆర్ భగవాన్‌దాసు, కాళీదాసు నేతృత్వంలో మొదలైన కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. 1978-80లో అన్ని పార్టీలు తమ జెండాలను పక్కన పెట్టి అఖిల పక్షంగా ఏర్పడి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో హనుమకొండ ఎంపీగా ఉన్న పీవీ.నర్సింహరావు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం చొరవ తీసుకుని అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వద్దకు అఖిల పక్ష నేతలను తీసుకెళ్లారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై అఖిల పక్ష నేతల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్న ఇందిరాగాంధీ 1982లో పార్లమెంట్ వేదికగా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురవడంతో, ఖలిస్థాన్ ఉద్యమాన్ని చల్లార్చడానికి కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపుర్తాలకు తరలించారు. ఇక 2004లో యుపీఏ ప్రభుత్వంలో ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మరోసారి కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే కాజీపేటకు మంజూరైన కోచ్‌ఫ్యాక్టరీ రాజకీయ కారణాలతో యూపీలోని రాయబరేలికి తరలిపోవటంతో రెండోసారి కూడా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ దక్కకుండా పోయింది. ఆ తరువాత 2010-11 బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మమత బెనర్జీ ప్రభుత్వ

మిగతా 8వ పేజీలో..

కోచ్ అడిగితే.. వ్యాగన్ ఇచ్చిన మోదీ..

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన గత కేంద్ర ప్రభుత్వం 150 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించింది. కానీ 2017లో కేంద్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ కూడా కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని స్పష్టం చేసి.. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని ఇవ్వలేమని చెప్పిందని పరోక్షంగా అంగీకరించిందని అందరూ భావించారు. అయితే 2018 ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని లాతూరులో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రూ.625కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా ఉన్న కాజీపేటపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, తెలంగాణ నుంచి ఒత్తిడి పెరగటంతో కేంద్ర ప్రభుత్వం 2023 జూలై 8వ తేదీన కాజీపేటలో 160 ఎకరాల్లో రైల్వేవ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా భూమి పూజ నిర్వహించారు. 2025లోపు పూర్తయ్యేలా రూ.521కోట్లతో ఈ వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. అయితే కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ చేస్తే కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేయటంపై ఓరుగల్లువాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న వ్యాగన్ ఫ్యాక్టరీ

వ్యాగన్‌నే అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి
- దేవులపల్లి రాఘవేందర్, రాష్ట్ర రైల్వే ఉద్యోగుల జేఏసీ చైర్మన్



కాజీపేటలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమనే అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీగా ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 20ఎకరాల్లో కూడా కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవచ్చు. ఈ కోచ్‌ఫ్యాక్టరీతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. అలాగే దక్షిణమధ్య రైల్వేకు వచ్చే అదాయంలో అధిక అదాయం కాజీపేట నుంచే వస్తుంది. రైల్వే డివిజన్ ఏర్పాటుకు కాజీపేటకు అన్ని అర్హతలున్నాయి. కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధించే వరకు ఉద్యోగ జేఏసీ పోరాటం చేస్తుంది.

బీజేపీ ఎంపీల అసమర్థత వల్లే..
- నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే



విభజన చట్టాలను నెరవేరుస్తారన్న ఆకాంక్షతోనే ప్రజలు బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చారు. కానీ ఆ ఎంపీల అసమర్థత మూలంగానే తెలంగాణలో కీలకమైన కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రావటం లేదు. ఏపీ, బిహార్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కేంద్రం తెలంగాణకు ఇవ్వటం లేదు. కోచ్ ఫ్యాక్టరీతో పాటు రైల్వే డివిజన్ కోసం క్షేత్రస్థాయి నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ పోరాడుతుంది. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కాగానే విభజన చట్టంలోని హామీలను అమలు చేసి తీరుతాం. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీతో పాటు డివిజన్‌ను తీసుకొస్తాం.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేద్దాం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ క్రైం, ఆగస్టు 1 : రోడ్డు ప్రమాదాల నివారణతోపాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. గురువారం సీపీ కార్యాలయంలో జరిగిన రోడ్డు భద్రతా సమావేశంలో వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతోపాటు ట్రాఫిక్ పోలీసులు, విద్యుత్, మునిసిపాలిటీ, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపకప, రోడ్డు రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్యను అధి గమించడంపై ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇందులో పలు అంశాలు, చర్యలపై చర్చించారు. పది ప్రధాన జంక్షన్లలో ఉన్న పాత సిగ్నల్స్ తొలగించడం, అదే విధంగా రద్దీగా ఉన్న జంక్షన్లలో నూతన సిగ్నల్స్ ఏర్పాటుపై తగు సూచనలు చేశారు. సీపీ చేసిన సూచనలపై ఇరువురు కలెక్టర్లు స్పందిస్తూ పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణ కోసం శ్రమించే ట్రాఫిక్ పోలీసులు, వారి సూచనల మేరకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ సమస్యలను సీపీ, కలెక్టర్, కమిషనర్ పరిశీలించారు. అదాలత్ జంక్షన్‌లో సిగ్నల్స్‌పై ఉన్న తీగలను పరిశీలించారు. సమావేశంలో డీసీపీలు రవీందర్, షేక్ సలీమా, డీటీ వో పుప్పాల శ్రీనివాస్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, తిరుమల్, తిరుపతి, దేవేందర్‌రెడ్డి, నందిరాం నాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోగా డాక్టర్ అప్పయ్య



వరంగల్ మెడికల్, ఆగస్టు 1: హనుమకొండ జిల్లా వైద్యఅధికారిగా డాక్టర్ ఎ.అప్పయ్య నియమితులైనట్టు సమాచారం. ఈ మేరకు శుక్రవారం అధికారిక ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ములుగు డీఎంహెచ్‌వోగా ఉన్న డాక్టర్ అప్పయ్య 2021లో సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందారు. నాడు ఆయన్ను హనుమ కొండకు కేటాయించినప్పటికీ పరిపాలన కారణాలతో ములుగులోనే కొనసాగించారు. ప్రస్తుత సాధారణ బదిలీల్లో డాక్టర్ బి.సాంబశివరావు వరంగల్‌కు బదిలీ కావడంతో అప్పయ్య హనుమకొండ రానున్నారు. ప్రస్తుతం డీఎంహెచ్ డాక్టర్ కె.వెంకటరమణ కరీంనగర్ జిల్లాకు వెళ్లనున్నారు.

సబ్‌జైలు హోంగార్డు ఆత్మహత్యాయత్నం

- కుటుంబసమస్యలే కారణం?



రవి

పరకాల, ఆగస్టు 1 : పరకాల సబ్‌జైలులో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు రవి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన గురువారం జరిగింది. పరకాల సబ్‌జైలర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల పీఎస్‌లో హోంగార్డుగా ఉన్న పెండెల రవిని మే 2023న పరకాల సబ్‌జైలుకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. అయితే కుటుంబసమస్యల కారణంగా ఐదు రోజుల క్రితం రవి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించగా గమనించిన కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. ఆ తర్వాత కూడా రోజూ విధులకు హాజరవుతున్న రవి.. గురువారం ఉదయం సబ్‌జైలుకు వచ్చి పని ఉందని సెలవు కావాలని జైలర్ ప్రభాకర్‌రెడ్డి దగ్గర అనుమతి తీసుకొని మధ్యాహ్నం 1 గంటకు వెళ్లిపోయాడు. సాయంత్రం 5గంటలకు పరకాల ఏసీపీ కార్యాలయంలోని రాకేశ్ అనే కానిస్టేబుల్‌కు వీడియో కాల్ చేసి.. తాను ఆత్మహత్య చేసుకుంటున్నాని లోకేషన్ షేర్ చేసి పురుగుల మందుతాగాడు. వెంటనే అక్కడే ఉన్న ప్రభుత్వ వాహనంలో రాకేశ్ తనకు రవి పంపిన లోకేషన్‌కు చేరుకొని అతడిని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. ప్రస్తుతం రవి చికిత్స పొందుతున్నాడు. అయితే హోంగార్డులకు జీతభత్యాలు సక్రమంగా రాక కుటుంబ పోషణ భారంగా మారిందని, తన భర్త కూడా ఆ ఆవేదనతోనే ఆత్మహత్యయత్నం చేశాడని రవి భార్య లక్ష్మీ పేర్కొన్నారు.

5న స్వచ్ఛదనం-పచ్చదనం

వీసీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 1 : పరిశుభ్ర పరిసరాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గురువారం రాత్రి ఆమె సచివాలయం నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. 5వ తేదీన కార్యక్రమం ప్రారంభమవుతుందని, 6న తాగునీరు, వాననీటి హార్వెస్టింగ్, 7న నీరు నిల్వ ఉండే ప్రాంతాలను పూడ్చడం, 8న ఆరోగ్యం, వీధికుక్కలపై దృష్టి పెట్టాలని, 9వ తేదీన ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయించాలని కలెక్టర్‌లకు సీఎస్ సూచించారు. ఈ వీడియెకాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతోపాటు అధికారులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసన

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం
- రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని వినయభాస్కర్ డిమాండ్

రాంనగర్, ఆగస్టు 1 : అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు ఇతర మహిళా నేతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశాడని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గురువారం హనుమకొండ కాళోజీ జంక్షన్ వద్ద బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి రాస్తారోకో చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వినయభాస్కర్



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

మాట్లాడుతూ.. మహిళా నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతలపై అధికార పక్షం హద్దుమీరి వ్యవహరిస్తుందని ఆరోపించారు. హుందాగా వ్యవహరించాల్సిన రేవంత్‌రెడ్డి దిగజారుడు మాటలు మాట్లాడటం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన అధికార పక్షం ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగత దాడులకు దిగుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని తెలిపారు. అహంకారంతో వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కు రానున్న రోజుల్లో ఆడబిడ్డలే బుద్ధి చెబుతారని వినయభాస్కర్ హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, నల్లా స్వరూపారాణి, నర్సింగ్, ఇమ్మడి రాజు లోహిత, సోదా కిరణ్, రంజిత్‌రావు, మధు, పులి రజనీకాంత్, సారంగపాణి, జోరిక రమేశ్, చాగంటి రమేశ్, నయీమ్, బండి రజనీకాంత్, కమరున్నీసా, పరుశరాములు, సరస్వతి, జ్యోతి, విద్య, రజిత, మౌనిక, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు. కాగా, దిష్టిబొమ్మ దహనం చేసే క్రమంలో జ్యోతి అనే నేత కాలకి గాయమైంది.

అనుమతుల్లేని అకాడమీలు

- నీట్, జేఈఈ కోచింగ్ మాటున ఇంటర్ తరగతులు
- విద్యాశాఖ తనిఖీలు లేవు.. చర్యలు లేవు..
- ఆమ్యామ్యాలకు అలవాటు పడిన ఇంటర్ విద్యా అధికారులు



వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 1 : ఇంటర్ విద్యాశాఖ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేటు అకాడమీలు విసిరేస్తున్న ఆమ్యామ్యాలకు అలవాటు పడిన అధికారులు.. జేఈఈ, నీట్ పేరిట ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఇంటర్ తరగతులు నిర్వహించాలంటే ఇంటర్ బోర్డు అనుమతి ఉండాలనే కనీస నిబంధన తెలియకుండానే హనుమకొండ డీఐఈవో మూడున్నరేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. నగరంలో 20కి పైగా ఇతర అకాడమీల మాటున ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నా ఈయనకు మాత్రం కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలే అనుమతులు లేని అకాడమీలు వాటికి తోడు హాస్టళ్లు నిర్వహిస్తూ.. విద్యార్థులను ఒత్తిడులకు గురిచేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలాంటి అనుమతుల్లేని అకాడమీలు నిర్వహిస్తున్నారని అలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకునేలా కలెక్టర్లు, అధికారులు దృష్టి సారించాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

నీట్, జేఈఈ మాటున ఇంటర్ తరగుతులు..

రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత విద్యా కేంద్రంగా విలసిల్లుతున్న వరంగల్‌ను కేంద్రంగా చేసుకొని ఎలాంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్థుల భవనాల్లో అన్ని హంగులతో అకాడమీలు ఏర్పాటవుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఫ్రాంచైజీస్ తీసుకుంటున్న స్థానికులు సైతం అకాడమీలను ఏర్పాటు చేస్తూ నీట్, జేఈఈ కోచింగ్ ఇస్తామని చెబుతూ బాహాటంగానే అనుమతులు లేకుండా ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముఖ్యంగా హనుమకొండ హార్ట్ ఆఫ్ ద సిటీలో 20కి పైగా అనుమతుల్లేని అకాడమీలతో పాటు ఐదుకుపైగా ఆనల్‌లైన్ అకాడమీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ముందుగానే అధికారులను మచ్చిక చేసుకోవడంతో వారి అకాడమీలవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అకాడమీలన్నీ అందులో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రైవేటులో ఇతర కళాశాలల నుంచి పరీక్షలకు పంపిస్తున్నట్లు విద్యార్థి సంఘ నాయకులు చెబుతున్నారు.

డీఐఈవోకు అవగాహన లేదట!

హనుమకొండ జిల్లా ఇంటర్మీడియెట్ విద్యా శాఖాధికారి ఎ.గోపాల్ మూడేళ్లుగా పర్యవేక్షణ, అవగాహన లేకుండా పనిచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతుల్లేకుండా ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై కొరడా ఝులిపించాల్సిన అధికారి అంటీముట్టనట్టు ఉంటున్నారని, అనుమతులు లేని కళాశాలలను గుర్తించండంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదులు చేస్తే వాటిని బుట్టదాఖలు చేస్తున్నారని, కనీసం తనిఖీలు కూడా చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. నిర్వాహకుల నుంచి రూ.లక్షల్లో డబ్బులు దండుకుంటూ వారికి వంత పాడుతున్నారన్న చర్చ జరుగుతోంది.

అకాడమీలపై పర్యవేక్షణ మా పరిధి కాదు...
హనుమకొండ డీఐఈవో ఎ.గోపాల్



మాకు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలపై మాత్రమే పర్యవేక్షణ చేసే అధికారం ఉంది. అకాడమీల పర్యవేక్షణ అధికారం మాకు లేదు. అకాడమీల్లో ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్న మాకు తనిఖీలు చేసే అధికారం లేదు. పర్యవేక్షణ మా పరిధి కాదు. అనుమతుల్లేకుండా ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్న అకాడమీలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫారసులు చేస్తున్నాం.

అనుమతుల్లేని అకాడమీలను మూసివేయాలి...



భాషబోయిన సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

ఎలాంటి అనుమతుల్లేకుండా నగరంలో నాలుగైదు చోట్ల బ్రాంచీలను ఏర్పాటు చేసి యథేచ్ఛగా ఇంటర్ తరగతులు బోధిస్తున్న అకాడమీలను మూసివేయాలి. ఇదంతా ఇంటర్మీడియెట్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది. ట్యూషన్ సెంటర్ల లాంటి అకాడమీల్లో ఇంటర్ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మరో కళాశాల నుంచి పరీక్షలు రాయిస్తున్నారు. విద్యార్థుల జీవితాలను పణంగా పెడుతూ రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు.

ఆ అకాడమీ యాజమాన్యానికి నోటీసులిచ్చాం : డీఐఈవో

నగరంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వైబ్రంట్ అకాడమీ యాజమాన్యానికి గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశామని డీఐఈవో గోపాల్ తెలిపారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశాలిచ్చామని, అయితే నర్సంపేటకు చెందిన కాకతీయ జూనియర్ కళాశాలకు చెందిన అనుమతిని హనుమకొండకు మార్చాలని, దాంతో పాటు పేరును మార్చాలని ఆ కళాశాల యాజమాన్యం దరఖాస్తు చేసుకుందన్నారు. కానీ ఇప్పటి వరకైతే బోర్డు నుంచి ఎలాంటి అనుమతి రాలేదని, రెండు రోజుల తర్వాత కళాశాల యాజమాన్యం ఇచ్చే వివరణ తర్వాత వైబ్రంట్ అకాడమీని సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.


ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

- ఘటనపై కుటుంబసభ్యుల అనుమానాలు
- వైబ్రంట్ అకాడమీ ఎదుట విద్యార్థుల ధర్నా, ఫర్నీచర్ ధ్వంసం
- కళాశాలకు అనుమతులు లేవని వెల్లడించిన అధికారులు
- యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్

వివరాలు 8లో..



భవానిరెడ్డి(ఫైల్)



ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, ఆగస్టు 1 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలను వివిధ పోలీస్ స్టేషన్‌లకు బదిలీ చేస్తూ గురువారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన సీఐలు

ఎ.శ్రీనివాస్‌రెడ్డి వీఆర్ నుంచి రఘునాథ్‌పల్లి, ఇ.శ్రీనివాస్ రఘునాథ్‌పల్లి నుంచి కమిషనరేట్, ఎ.ప్రవీణ్‌కుమార్ ఎల్కతుర్తి నుంచి ధర్మసాగర్, ఎ.మహేందర్ ధర్మసాగర్ నుంచి సీసీఎస్ వరంగల్, జి.వేణు మల్టీజోన్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్.

ఎస్ఐలు వీరే..

బండి శ్రావణ్‌కుమార్ కొడకండ్ల నుంచి లింగాలఘనపూర్, సీహెచ్.రాజు లింగాలఘనపూర్ నుంచి ఇంతెజార్‌గంజ్, బానోత్ రాంచరణ్ కేయూసీ నుంచి జాఫర్‌గడ్, ఎ.సురేష్ వీఆర్ నుంచి వేలేర్, డి.హరిత వేలేర్ నుంచి సుబేదారి, ఎస్.నవీన్‌కుమార్ వీఆర్ నుంచి చిల్పూర్, ఎం.రాజేందర్ చిల్పూర్ నుంచి కేయూసీకి బదిలీ అయ్యారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 1 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని జేఎన్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు.

డెంగీకి నిండు గర్భిణి బలి

గర్భస్థ కవల శిశువులు సహా కన్నుమూత

శాయంపేట, ఆగస్టు 1: మరో వారం పది రోజుల్లో పురుడు పోసుకుని పండండి ఇద్దరు కవల ఆడపిల్లలకు జన్మనివ్వాల్సిన ఆ తల్లిని డెంగీ జ్వరం బలితీసుకుంది. గర్భంలో ఉన్న పిల్లలు సహా తల్లి మృతి చెందిన విషాదకరమైన ఘటన హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి శ్రీకాంత్ ప్రింటర్స్ సర్వీస్ చేస్తూ జీవిస్తున్నాడు. రెండేళ్ల క్రితం పరకాల మండలం మల్లక్కపేట గ్రామానికి చెందిన దొమ్మాటి లక్ష్మి-భిక్షపతి దంపతుల మొదటి కుమార్తె అయిన ప్రియాంకతో శ్రీకాంత్ వివాహం జరిగింది. కొద్దికాలంలోనే ప్రియాంక అనారోగ్యంతో మృతి చెందింది. అనంతరం భిక్షపతి కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. భిక్షపతి రెండో కూతురు అయిన శిరీష(29)ను కుటుంబసభ్యులు శ్రీకాంత్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ నేపథ్యంలో నిండు గర్భిణి అయిన శిరీష మూడు రోజుల క్రితం డెంగీ జ్వరం బారిన పడగా ఆమెను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. రక్తకణాలు పూర్తిగా పడిపోవడం, గురువారం ఆమె పరిస్థితి తీవ్ర విషమంగా మారడంతో కనీసం గర్భంలో ఉన్న కవల శిశువులనైనా బతికించాలని డాక్టర్లు ప్రయత్నం చేశారు. కానీ వారి ప్రయత్నం ఫలించలేదు. గర్భస్థ శిశువులు సహా శిరీష మృతి చెందింది. కుటుంబంలో వరుస విషాద సంఘటనలు జరగడంతో వారి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగారు.

బీసీల అభివృద్ధికి రూ. 20 వేల కోట్ల కేటాయించాలి

కాజీపేట, ఆగస్టు 1: బీసీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ కోల జనార్దన్ డిమాండ్ చేశారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీసీ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 4న హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో బీసీ సంఘాల నాయకులు సాధినేని సుధాకర్, మాచర్ల శరత్ కుమార్, గొల్లపల్లి వీరస్వామి, తాడిశెట్టి క్రాంతికుమార్, దువ్వ కనుకరాజ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, ఆగస్టు 1 : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి చికిత్సపొదుతూ మృతి చెందాడు..కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట ప్రశాంత్‌నగర్ కు చెందిన ఎస్‌డీ అలీ (40), ఈ నెల 25న బైక్‌పై నిట్ నుంచి తన ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఎస్‌డీ అలీకి తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

» 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని ఆష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

» జూలై 13న గాజాలో అంతం చేశాం

» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)





వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేందర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

రేపు ఎస్సార్ యూనివర్సిటీలో ద్వితీయ స్నాతకోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సార్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 1: హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో శనివారం ద్వితీయ స్నాతకోత్సవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహిస్తున్నామని ఎస్సార్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనారెడ్డి తెలిపారు. గురువారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి సయంట్ ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ బీవీఆర్. మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. గత 45 ఏళ్లుగా విద్యారంగంలో ఎస్సార్ విద్యాసంస్థలు ముందున్నాయని, 2022లో ప్రైవేటు యూనివర్సిటీగా ఎస్సార్ ఆమోదించబడిందని గుర్తు చేశారు. 2002లో ప్రాంభంమైన ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ నాక్, ఎన్‌బీఏ, డబ్లుజీసీ అక్రిడిటేషన్లు సాధించిందన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో 2023లో 98వ స్థానం సాధించిందన్నారు. నూతన ఆవిష్కరణలతో అటల్ ర్యాంకింగ్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో డిగ్రీల ప్రదానంతో పాటు గౌరవ డాక్టరేట్లు, పూర్వ విద్యార్థులకు సత్కారం, కాంక్లేవ్స్, టాసింగ్ ఆఫ్ క్యాప్స్, అధికారిక ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేష్, డాక్టర్ రామ్‌దేశ్‌ముఖ్, డాక్టర్ సుమన్‌కుమార్, డీన్లు, హెడ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ పోరాటం ఫలించిన వేళ

» ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు

» వర్గీకరణ పోరాటానికి, నాయకత్వానికి వేదికైన ఓరుగల్లు



హనుమకొండ సిటీ, ఆగస్టు 1: మూడు దశాబ్దాల మాదిగల ఆత్మగౌరవ రక్షణ పోరాటం ఫలించింది. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పు చెప్పడంతో మాదిగ జాతి ఆనందడోలికల్లో మునిగితేలుతోంది. వర్గీకరణే లక్ష్యంగా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలకు ఓరుగల్లు నుంచే అంకుర్పారణ జరిగింది. ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ కమిటీ నిర్మాణం జరిగినా.. అంతకు ముందు నుంచే ఓరుగల్లులో ఎంఆర్‌పీఎస్ స్థాపనపై ఆలోచనలు, సమావేశాలు, చర్చలు జరిగాయి. ఈ మహోత్తర పోరాటానికి వ్యవస్థ నిర్మాణమే కాదు నాయకత్వం వహించిన నాయకుడు మందకృష్ణ మాదిగ ఓరుగల్లు వాసే. పోరుగల్లు పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఆయన లక్ష్య సాధన వైపు అడుగులు వేయగా.. ఆయన వెంట మాదిగ జాతి యావత్తు నడిచింది. పోరాట క్రమంలో అభిప్రాయభేదాలు వచ్చినా.. అప్పటి వరకు ఒక్కటిగా ఉన్న మాదిగ సంఘాలు వేరయినా.. అందరి లక్ష్యం 'వర్గీకరణే' అన్నట్టుగా పోరు సాగింది. చివరకు గురువారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో దేశ చరిత్రలో ఓ మహా ఘట్టం ఆవిష్కృత మైంది. విద్య, ఉద్యోగాల్లో మాదిగ జాతి అభ్యర్థులకు సముచిత న్యాయం దక్కే అవకాశం వచ్చింది.

పోరాటంలో ఓరుగల్లుదే కీలక పాత్ర

ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా మూడు దశాబ్దాల పాటు సాగిన పోరాటంలో ఓరు గల్లు కీలకపాత్ర పోషించింది. హనుమకొండ హంటర్‌రోడ్డు న్యూశాయంపేటకు చెందిన మందకృష్ణ మాదిగ అడుగు ముందుకేశారు. 1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో 20మంది యువకులతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని ఏర్పాటు చేసిన ఆదే రోజున గ్రామ కమిటీని నియమించారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఒంగోలు, హైదరాబాద్‌లో జరిగిన భారీ బహిరంగ సభలు వర్గీకరణ పోరాటానికి బలమైన పునాదులు వేశాయి. అనంతరం 1998లో జస్టిస్ రాంచంద్రరాజు కమిషన్ ఏర్పటవగా.. వర్గీకరణకు ఆ కమిషన్ సిఫార్సు చేసింది. నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్ర బాబు వర్గీకరణకు ఓకే చెప్పడంతో 2004 వరకు 22వేల ఉద్యోగాలు మాదిగ సామాజిక అభ్యర్థులకు లభించాయి. కానీ పార్లమెం ట్‌లో బిల్లు ప్రవేశపెట్టకుండా వర్గీకరణ అమలు చేయడమేంటన్న వివాదాలు తలెత్తడంతో వర్గీకరణకు ఆటంకంఏర్పడింది. దీనిపై మళ్లీ ఉద్యమం రగిలింది. వైయస్ ప్రభుత్వ హయంలో 2004లోనే మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఛలో అసెంబ్లీ పోరాటం చేయడంతో నాటి వైయస్ ప్రభుత్వం వర్గీకరణపై తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.

2006లో నాటి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఉషామెహ కమిషన్ వేయగా 2008లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన కమిషన్ బృందం వర్గీకరణతోనే సామాజిక న్యాయం జరుగుతుందని నివేదిక ఇచ్చింది. ఆ తరువాత తెలంగాణ మలి దశ ఉద్యమం ఆరంభం కావడంతో వర్గీకరణ బిల్లు తెరమరుగైంది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత మళ్లీ వర్గీకరణ పోరాటం ఊపందుకుంది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు వర్గీకరణ అమలు తీర్పును ఇవ్వడంతో మూడు దశాబ్దాల పోరాటానికి విజయంతో ముగింపు వచ్చింది.



జిల్లాలో జరిగిన ముఖ్య ఘట్టాలు..

2006లో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఇందులో భాగం గా కాజీపేటలో అర్ధరాత్రి పుష్‌పుల్ రైలుకు నిప్పంటించారు. ఈ ఘటన దేశ వ్యాప్తంగా వర్గీకరణ ఉద్యమ తీవ్రతను చాటింది. ఇక అదే ఏడాది హైదరాబా ద్‌లో మందకృష్ణ చేపట్టిన ఆమరణ దీక్షలో వరంగల్ జిల్లా నుంచే అత్యధికంగా మేధావులు, యువకులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను ప్రభుత్వపరంగా ఆదుకుంటాం

వడ్డెపల్లి,ఆగస్టు 1: ఆటోడ్రైవర్లను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆటో డ్రైవర్స్ ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ గౌరవ అధ్యక్షుడు చిర్ర రమేష్‌గౌడ్, చైర్మన్ ఎండీ అంకూషావలి, కన్వీనర్ పి. యాదగిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, గీత, నేత కార్మికుల మాదిరిగా నెలకు రూ. 4 వేలు చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతో పాటు సహజ మరణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని, డబుల్ బెడ్ రూం పథకంలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జేఏసీ నేతలు పస్తం లక్ష్మయ్య, ఎల్లయ్య, సాంబయ్య, సదయ్య తదితరులు ఉన్నారు.

'కుడా' చైర్మన్‌ను కలిసిన టీజీవోలు


కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే నాయినికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీజీవోలు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 1 : నూతనంగా కుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇనగాల వెంకట్రామిరెడ్డిని, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని టీజీవోస్ గురువారం హనుమకొండలోని 'కుడా' క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కుడా చైర్మన్‌ను కలిసిన వారిలో టీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ఈగ వెంకటేశ్వర్లు, టీజీవోస్ నాయకులు సంజీవరెడ్డి, నాగ నారాయణ, కిరణ్ కుమార్, కోల రాజేష్‌కుమార్, రత్నవీరాచారి తదితరులు ఉన్నారు. అలాగే జిల్లా నూతన ట్రెజరీ అధికారిగా నియామకం అయిన ఆకవరం శ్రీనివాస్‌ను పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

● లైసెన్సుడు సర్వేయర్లు గురువారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మెన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డిని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు ఎల్ఆర్ఎస్ 2020కి సంబంధించి డ్రాయింగ్ ప్లాన్ అంశాన్ని చైర్మెన్ దృష్టికి తీసుకువచ్చారు. ఎల్ఆర్ఎస్ 2020 విజయవంతం కావాలంటే డ్రాయింగ్ ప్లాన్ ఉండాలన్నారు. చైర్మెన్‌ను కలిసిన లైసెన్సుడు సర్వేయర్లలో గోరంటల జగదీశ్వర్, పాము సత్యనారాయణ, నాగపురి రాజు, బొల్లు వెంకటేశ్వర్లు, ఆకారపు కోదండరాములు, ఏ జగదీశ్వర్ ఉన్నారు

'ప్రతీ కార్మికుడు లేబర్‌కార్డు కలిగి ఉండాలి'

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 1 : ప్రతీ కార్మికుడు లేబర్‌కార్డు కలిగి ఉండాలని శ్రమ శక్తి అవార్డు గ్రహీత కుసుమ శ్యాంసుందర్ అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్‌లోని వైభవ్ ఎంటర్ ప్రైజెస్‌లో గురువారం లేబర్‌కార్డులపై కార్మికులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుసుమ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. కొత్త లేబర్ యాక్ట్ ప్రకారం లేబర్‌కార్డులు ప్రతీ కార్మికునికి ఉండాలని, లేబర్‌కార్డులు లేకపోతే పనిలోకి రానివ్వరన్నారు. అనంతరం వైభవ్ ఎంటర్ ప్రైజెస్ యజమాని గుండేటి నరేంద్ర కుమార్‌తో కలిసి కుసుమ శ్యాంసుందర్ కార్మికులకు లేబర్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వరుతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిపాలనే తాగించాలి

వరంగల్ మెడికల్, ఆగస్టు 1 : పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రసూతి ఆస్పత్రిలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాన్పు అయిన వెంటనే వచ్చే ముర్రుపాలు మొదటి కొద్ది రోజులు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయని, వీటినే ముర్రుపాలు లేదా కొలస్ట్రం అంటారని తెలిపారు. ఇందులో ప్రోటీన్లు, రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఉంటుందన్నారు. ముర్రుపాలు బిడ్డకు సంజీవని వంటివని, ఇవి అమృతంతో సమానమని తెలిపారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వినోద్ కుమార్, ఇఫ్తికర్ అహ్మద్, మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, డాక్టర్ గీత, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ సుమలత, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి, రామేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుతో ఎమ్మార్పీఎస్ సంబరాలు

వడ్డెపల్లి, ఆగస్టు 1: ఎస్సీల వర్గీకరణ కు సుప్రీం కోర్టులో అనుకూలంగా తీర్పు రావడాన్ని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశం మేరకు గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఎమ్మార్పీఎస్ నేతలు స్వీట్లు పంచుకొని బాణా సంచాను కాల్చి సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నేత మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పోరాటం, అమర వీరుల త్యాగం వలనే వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునిచ్చిందని అన్నారు. వర్గీకరణ కోసం సహాయ సహకారాలు అందించిన ప్రధాన నరేంద్రమోదీకి ఎమ్మార్పీఎస్ రుణపడి ఉంటుందని అన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నేతలు వేల్పుల సూరన్న కాపు, బొర్ర భిక్షపతి, గద్దల సుకుమార్, బండారి సురేందర్, బుర్రి సతీష్, జన్ను దినేష్, చాతాళ్ల శివ, ఏకు శంకర్, మంద వర్ధన్, తిప్పారపు మల్లేశం, మంద స్వరాజ్ మాదిగలు పాల్గొన్నారు.

● సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వచ్చిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాతూరి వెంకన్న మాదిగ ఆదేశం మేరకు గురువారం ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా కన్వీనర్ గంగారపు సుమన్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలు మారి బాలస్వామి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. స్వీట్లను పంపిణీ చేసుకొని సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నేతలు దామెర కరుణ, మస్కె సదయ్య, చిలుక గోపి, కొడవటి తిరుపతి, పొలిమేర గోపి, గంగారపు యశ్వంత్, ఐలపాక దయాసాగర్, చిలుక రాజేష్, ఎనగందుల మనోహర్, సునిల్, లోకేష్, సత్యకుమారి పాల్గొన్నారు.

-వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని పురస్కరించుకొని మిత అయ్యల్‌వార్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారులు టీఎస్ స్వామి, భిక్షపతి ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేసుకొని సంబరాలు నిర్వహించుకున్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

● ఐనవోలు : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఐనవోలు, కొండపర్తి గ్రామాల్లో బాణసంచా కాల్చి సీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ జిల్లా నాయకుడు బొక్కల నారాయణమాదిగ మాట్లాడుతూ 30 సంవత్సరాల పోరాటాలకు ఫలితం లభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా, మండల నాయకులు ప్రవీణ్, రమేష్, చంద్రమౌళి, రహీం, సుమన్, శోభన్, ప్రణయ్, అరుణ్, రాజేందర్, వీరన్న, దివాకర్, రాజు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

ఘటనపై కుటుంబసభ్యుల అనుమానాలు

బాలసముద్రం, ఆగస్టు 1 : హనుమకొండ నగరం నక్కలగుట్టలోని వైబ్రంట్ అకాడమీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఇనుముల భవానిరెడ్డి(15) బుధవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన ఇనుముల జనార్దన్‌రెడ్డి, సుమలత దంపతులకు కూతురు భవానిరెడ్డి, కుమారుడు రిషిరెడ్డి ఉన్నారు. జనార్దన్‌రెడ్డి కమలాపూర్‌లో మోటర్ వైండింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భవానిరెడ్డి వైబ్రంట్ అకాడమీలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం రాత్రి 9:30 గంటలకు భవానిరెడ్డి హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకోగా.. గమనించిన వెంటనే ఆమెను అక్కడి నుంచి వాహనంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించామని, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో మృతదేహాన్ని వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించినట్టు హాస్టల్ వార్డెన్ సంగీత, ఇన్‌చార్జ్ ధరణి తెలిపారు. ఇక భవానిరెడ్డి మృతి విషయంలో తమకు అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబసభ్యులు, విద్యార్థిసంఘాల నాయకులు గురువారం ఉదయం వైబ్రంట్ అకాడమీ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. కాలేజీ ఎదుట ధర్నా చేసి.. ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వారు ఆందోళన చేయగా.. సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి పోలీస్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అయినప్పటికీ వారు శాంతించపోవడంతో ఏసీపీ దేవేందర్ రెడ్డి వచ్చి వారితో మాట్లాడారు. కాలేజీ యాజమాన్యం విద్యార్థిని మృతికి బాధ్యత వహించి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పడంతో గొడవ సద్దుమనిగినట్లు భవానిరెడ్డి బంధువులు, పోలీసులు తెలిపారు. కాగా మృతురాలి తండ్రి జనార్దన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థి మృతికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారులు వెంటనే కళాశాల వద్దకు రావాలని వారు కోరడంతో ఏసీపీ దేవేందర్ రెడ్డి డీఈవోతో ఫోన్‌లో మాట్లాడించారు. కళాశాలకు అనుమతులు లేవని డీఈవో వారికి తెలపడంతో వారు మరింత ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా నడిపిస్తున్న వైబ్రంట్ అకాడమీని తక్షణం మూసేసి చైర్మన్ రాజేందర్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మృతి చెందిన భవానిరెడ్డి కుటుంబానికి యాజమాన్యమే రూ.50లక్షలు చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధానకార్యదర్శి భాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో ఆర్డినేటర్ అజ్మీరా వెంకట్ నాయక్, ధర్మ స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి పూరెల్ల విష్ణు పాల్గొన్నారు.

'డిస్నీల్యాండ్'లో ఉద్యోగ విరమణ వేడుకలు

దామెర, ఆగస్టు 1 : మండలంలోని ఒగ్లాపూర్‌లోని డిస్నీల్యాండ్ హై స్కూల్ ఆవరణలో ముఖ్య సలహాదారులు(డైరెక్టర్స్)దయ్యాల సదయ్య(ఎస్ఏ హిందీ పండిట్- పరకాల గర్ల్స్), బాలుగు లక్ష్మీనివాసం (హెచ్ఎం ఎంపీపీఎస్ హరిజన వాడ-దామెర)లు జూలై 31న ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో గురువారం డిస్నీల్యాండ్ స్కూల్ ఆవరణలో వారి ఉద్యోగ విరమణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తోటి ఉపాధ్యాయుల నుంచి సన్మాన పత్రాలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మేధావులు, ఉపాధ్యాయులు, కవులు, రచయితలు, జబర్దస్త్ ఫేమ్ వెంకీ మంకీ తదితర ప్రముఖులు హాజరై, తమ ఉపన్యాసాలను ఇచ్చారు. ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగానికే గానీ మనస్సుకు కాదని.. దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మీనివాసంలు ఉపాధ్యాయులుగా చేసిన సేవలు మరువలేనివని పలువురు అభిప్రాయపడ్డారు. వారి భావి జీవితంలో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, విద్యార్థుల భవిష్యత్‌ను, ఆకాంక్షలను తీర్చేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.శోభారాణి, డైరెక్టర్లు డి.రాకేశ్‌భాను, డి.దినేష్‌చందర్, ముఖ్య సలహాదారులు, పాఠశాల వ్యవస్థాపకులు మల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


డిస్నీల్యాండ్ స్కూల్‌లో ఉద్యోగ విరమణ వేడుకల్లో దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 1 : అధికారులు సమన్వయంతో పనిచేసి, వచ్చే నెల మొదటి వారంలోపు నయీంనగర్ బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశించారు. గురువారం మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాఖాడేలతో కలిసి నయీంనగర్ నాలా బ్రిడ్జి నిర్మాణ పనుల ను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణం పను ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జి నిర్మాణంలో పాలు పంచుకుంటున్న వివిధ శాఖ ల అధికారులు ప్రతీ రోజు ఒక గంట పాటు బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో కలుసుకునేందుకు వెసలుబాటు కల్పించుకొని, పనులు వేగంగా పూర్తి అయ్యేందుకు ఆలోచనలు చేయాలన్నారు. త్వరగా అందుబాటులోకి తీసుకవస్తే సీఎం రేవంత్‌రెడ్డి చేతులు మీదుగా ప్రారంభోత్సవం జరుపుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ క్రమంలో ఉత్పన్నమవుతున్న సమస్యలను అధికారులతో పాటు గుత్తేదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఈవీ శ్రీనువాస్‌రావు, బత్తిని శ్రీనివా స్, 7, 49, 54వ డివిజన్ కార్పొరేటర్స్ వేముల శ్రీనువాస్, గుంటి శ్రీను, ఎనుగల మానస, మాజీ కార్పొరేటర్ వీరగంటి రవీందర్, బంక సంపత్, రాంప్రసాద్, నలబోలు సతీష్, చీకటి ఆనంద్, మహిళ నాయకురాళ్లు రహీమున్నిసాబేగం, బంక సరళ పాల్గొన్నారు.


కార్పొరేషన్ ఈఈ రాజయ్యతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

చెక్కుల పంపిణీ

హనుమకొండ సిటీ, ఆగస్టు 1 : హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మీతో పాటు సీఎం సహాయ నిధి చెక్కులను అందచేశారు. సంక్షోభ పరిస్థితులను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవ చేస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించకుండా ప్రభుత్వంపై అవాస్తవ ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు

వరంగల్ సిటీ, ఆగస్టు 1: బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కార్పొరేటర్లు గురువారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం ఓ సిటీలోని క్యాంపు కార్యాలయంలో 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, 37వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్, 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మరవి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కొండా మురళి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్పొరేటర్లతోపాటు సుమారు వందమంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కొండా మురళీధర్‌రావు మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని రూ.500 కోట్లతో అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించామని, త్వరలోనే సీఎం ను కలిసి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, నాయకులు గోపాల నవీన్‌రాజ్, ఎండి. ఆయూబ్ పాల్గొన్నారు.

లారీలు రావద్దంటూ రోడ్డుపై ధర్నా

మడికొండ, ఆగస్టు 1: తరచూ రోడ్డు ప్రమాదాలకు కారణనమవుతున్న లారీలు, భారీ వాహనాలు గ్రామంలోకి రావద్దంటూ గ్రామస్థులు గురువారం మడికొండలోని అంబేద్కర్ సెంటర్ వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. లారీలను నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా దువ్వ నవీన్, పొనగోటి వెంకట్రావు మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా భారీ వాహనాలు గ్రామంలోని రోడ్డు మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. అసలే ఇరుకు రోడ్డు అందులో భారీ వాహనాలు వస్తుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అనేక మంది మరణిస్తున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే కార్పొరేటర్లు స్పందించి లారీలను గ్రామంలోకి రాకుండా రాంపూర్ వైపుకు మళ్లించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని లేనియెడల పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక ఎస్సై దివ్య వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో దువ్వ కొమురయ్య, గడ్డం మహేందర్, బొల్లికొండ వినోద్‌కుమార్, శివ పాల్గొన్నారు.

కోచ్ తూచ్!

(5వ పేజీ తరువాయి)

ప్రైవేట్ భాగస్వామ్యంతో కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రూ.15కోట్లు మంజూరు చేశారు. దీనికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 54ఎకరాల భూమిని కూడా కేటాయించినా.. ఆ భూమిపై వివాదాలు రావటంతో ఆ ప్రాజెక్టు వెనక్కు వెళ్లింది. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత విభజన చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం హామీ ఇచ్చినా అది నెరవేరలేదు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమతో ఒనగూరేది ఏమిటనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. తాము డిమాండ్ చేస్తున్న కోచ్ ఫ్యాక్టరీకి కొర్రీలు పెట్టి.. కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారని విమర్శిస్తున్నారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే సుమారు 60వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని, వ్యాగన్ ద్వారా కేవలం 2వేల మందికి కూడా ఉపాధి లభించే అవకాశాలు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసినా కోచ్‌ఫ్యాక్టరీ కూడా కాజీపేటలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇటీవల కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చల్లో తెలంగాణకు ఇచ్చిన విభజన హామీల్లోని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయాలని కోరారు. అయితే ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన లేదు. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ వస్తే మరి కొన్ని రైల్వే సంబంధిత భారీ పరిశ్రమలు కూడా వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి బలంగా వచ్చింది. కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియాకు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా నిత్యం సుమారు 200లకు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ ఆదాయం వచ్చే జంక్షన్లలో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తుంది. ఇక కాజీపేటకు అతి సమీపంలో సికింద్రాబాద్ డివిజన్ ఉండటం మూలంగానే కాజీపేటకు డివిజన్ ఇవ్వటం కుదరటం లేదని కేంద్ర చెప్పుతుందని, అయితే విజయవాడకు కేవలం 30కిలో మీటర్ల దూరంలోనే ఉన్న గుంటూరును డివిజన్ చేసినప్పుడు హైదరాబాద్-సికింద్రాబాద్‌కు 128కిలో మీటర్లకు పైగా ఉన్న కాజీపేటను డివిజన్ చేయటంలో అభ్యంతరం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

తల్లి మందలింపు..
మనస్తాపంతో యువతి ఆత్మహత్య

వరంగల్ క్రైం, ఆగస్టు 1: తల్లి మందలించిందని మనస్తాపం చెందిన స్రవంతి(19) అనే యువతి పురుగు ల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్టేషన్ పరిధిలోని భీమారంలో సహదేవుడ బాబు, సరోజన దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత నెల 29న బాబు, సరోజన దంపతుల కూతురు స్రవంతి ఇంట్లో ఉన్న వెయ్యి రూపాయలు ఖర్చు చేసింది. తల్లికి తెలిసి కూతురు స్రవంతిని మందలించింది. మనస్తాపం చెందిన స్రవంతి క్రిమిసంహారక మందు తాగింది. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. చికిత్స పొందుతూ స్రవంతి గురువారం మృతి చెందింది. ఈ విషయాన్ని ఎస్ఐ రాజ్‌కుమార్ ధృవీకరించారు. యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాలి

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 1 : తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం కలెక్టర్ కలెక్టర్‌లోని చాంబర్‌లో తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి మదన్‌మోహన్‌రావు, జిల్లా సంక్షేమ అధికారితోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కెపాసిటర్లపై రైతులకు అవగాహన

హనుమకొండ టౌన్, ఆగస్టు 1 : మోటార్ల దగ్గర కెపాసిటర్స్ ఏర్పాటు చేసుకోవడం వలన కలిగే ఉపయోగాల పై గురువారం న్యూశాయంపేట రైతులకు హనుమకొండ డివిజన్ విద్యుత్ అధికారులు అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ - పొలం బాట కార్యక్రమంలో భాగంగా సుబేదారి సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూశాయంపేట పంట పొలాలను విద్యుత్ అధికారులు సందర్శించి రైతులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏలాంటి విద్యుత్ సమస్యలున్న వెంటనే స్థానిక ఏఈ దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరించడం జరుగతుందన్నారు.

మేయర్‌ను కలిసిన బల్దియా అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 1 : రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. కాగా, గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు పోస్టింగ్‌పై వచ్చిన అధికారులు గురువారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రసన్నరాణి, పన్నుల శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన బిర్రు శ్రీనివాస్, డీఈ రాజ్‌కుమార్, టెక్నికల్ ఆఫీసర్ గౌతమిలు మేయర్ గుండు సుధారాణిని మర్యాద పూర్వకంగా కలిశారు. మేయర్ చాంబర్‌లో కలిసి పూలమొక్కలను అందించారు. ఈ సందర్భంగా మేయర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడారు.

టెక్నాలజీ అందిపుచ్చుకోవాలి

కేయూ క్యాంపస్, ఆగస్టు 1 : భాష నైపుణ్యాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.మల్లారెడ్డి అన్నారు. గురువారం కేయూ గణితశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో 40 రోజుల శిక్షణ ప్రారంభ సమావేశం జరిగింది. సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. మేఘనారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.నూతన విషయాలను తెలుసుకుని, ఎప్పటికప్పుడే అప్డేట్ కావాలని అన్నారు. భాషా నైపుణ్యాల థీమ్‌ను రిజిస్ట్రార్ మల్లారెడ్డి రిలీజ్ చేశారు.

అగ్నికి ఆహుతైన పెళ్లి దుస్తులు

కాలిపోయిన నిరుపేదల దుకాణం

మడికొండ, ఆగస్టు 1 : వారం రోజుల్లో జరగాల్సిన పెళ్లికి సంబంధించిన దుస్తులు అగ్నికి ఆహుతి కావడంతో అటు పెళ్లి వారు, ఇటు టైలర్ ఆవేదనకు గురయ్యారు. బాధితులు పల్లపు సరోజన, వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం మడికొండలోని వడ్డెర కాలనీలో కెనరా బ్యాంకు సమీపంలో డబ్బాను ఏర్పాటుచేసుకుని అందులో కుట్టు మిషన్, టైలరింగ్ సామాగ్రి, కిరాణా సామాను, కూరగాయలు విక్రయిస్తూ, టైలరింగ్ చేస్తూ దుకాణం నడుపుకుంటున్నారు. బుధవారం సాయంత్రం 9 గంటల తర్వాత దుకాణం మూసి ఇంటకి వెళ్లారు. అర్ధరాత్రి తర్వాత సమీపంలోని ఓ వ్యక్తి వచ్చి దుకాణంలో నుంచి మంటలు వస్తున్నాయని చెప్పడంతో వచ్చి చూసేసరికి అప్పటికే మొత్తం మంటల్లో కాలిపోతోంది. మంటలు ఆర్పి చూడగా దుకాణంలోని కుట్టు మిషన్, ఇతర సామాన్లు మెత్తం కాలి బూడిదయ్యాయి. అలాగే వారం రోజుల్లో జరగాల్సిన ఓ పెళ్లికి సంబంధించిన బట్టలు కుట్టడానికి ఇవ్వగా ఆ బట్టలు సైతం అందులోనే కాలిపోయాయని బాధితులు వాపోయారు. ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల మేర నష్టపోయినట్లు వారు తెలిపారు. ఎవరో కావాలనే తమ షాపును తగలబెట్టారనివారు ఆరోపించారు. ఈ ప్రమాదంతో రోడ్డున పడ్డ తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరా రు. గురువారం ఘటనా స్థలాన్ని స్థానిక ఇన్‌స్పెక్టర్ డి. ప్రతాప్ సందర్శించి పరిశీలించారు. సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించి నింధితులను పట్టుకుంటామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మెడికల్ షాపుపై దాడి

వరంగల్ మెడికల్, ఆగస్టు 1 : గడువు తేదీ ముగిసిన ఔషధాలు విక్రయిస్తున్న రోహిణీ మెడికేర్‌పై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు దాడి చేసి, కేసు నమోదు చేశారు. సుబేదారిలోని రోహిణి హస్పిటల్‌లో ఉన్న రోహిణి మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ఓ రోగి ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమల్‌హాసన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. డీజీ ఆదేశానుసారం స్థానిక ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, అరవిందరెడ్డి, పవన్‌లు దాడులు చేశారు. గడువు తీరిన మందులు ఇస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు.

యువత మత్తుకు బానిసలు కావద్దు

వరంగల్ క్రైం, ఆగస్టు 1 : యువత మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్ అంధకారం చేసుకో వద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. గురువారం కేయూ పోలీసుల ఆధ్వర్యంలో కిట్స్ కళాశాల లో మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణకు కమిషనరేట్ పరిధిలో డ్రగ్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేయ డం జరిగిందన్నారు. ముత్త పదార్థాలు అమ్మినా, సేవించి నా 87125 84473 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆంధ్రజ్యోతి

నవ్య నివేదన

శుక్రవారం • 2 ఆగస్టు 2024

సత్పురుషుల స్నేహం

క్షీరేణాత్మగతో దకాయహి గుణా దత్తాః పురాతేఖిలాః
క్షీరోత్తాపమపేక్ష్య తేన పయసాస్వాత్మా కృశానో హుతః
గన్తుం పావక మున్మన స్తదభవ ద్దృష్ట్వాతు మిత్రాపదం
యుక్తం తేన జలేన శామ్యతి సతాం మైత్రి పునస్త్వీదృశీ...

అనే ఈ శ్లోకంలో మంచివారితో చెలిమి గురించి తన నీతిశతకంలో భర్తృహరి వివరించాడు. దాన్ని...


సుభాషితం



క్షీరము మున్ను నీటికొసగెన్ స్వగుణంబులు దన్నుజేరుటన్
క్షీరముతప్తమౌట గని చిచ్చురికెన్ వెతచే జలంబు, దు
ర్వార సుహృద్విపత్తిగని వహ్ని జొరం జనె దుగ్ధమంతలో
నీరముగూడి శాంతమగు నిల్చు మహాత్ముల మైత్రి యీగతిన్... అనే పద్య రూపంలో ఏనుగు లక్ష్మణకవి తెలుగులోకి అనువదించాడు.

భావం: పాలలో నీరు కలిసినప్పుడు... తన తెల్లదనాన్ని, తియ్యదనాన్ని నీటికి ఇచ్చి... నీటితో పాలు మైత్రి చేసుకుంటాయి. పాలను కాచుతున్నప్పుడు... పాలు మరిగిపోవడాన్ని సహించలేక... నీరు పైకి లేచి ఆవిరైపోతుంది. తనను స్నేహితుడు విడిచి వెళ్ళిపోతున్నాడనే వేదనతో... పాలు పొంగి మంటల్లో పడిపోవడానికి ప్రయత్నిస్తాయి. అప్పుడు పాల మీద నీరు పడితే (చల్లితే)... తనను మిత్రుడు మళ్ళీ కలిశాడన్న సంతోషంతో పాలు ఊరట పొంది వెనక్కు తగ్గుతాయి. మహాత్ములతో స్నేహం కూడా ఈ విధంగానే ఉంటుంది. మిత్రులకు కష్టం వచ్చినప్పుడు, దూరమైనప్పుడు తల్లడిల్లుతారు. వారు తిరిగి తమను చేరుకున్నప్పుడు సంతోషపడతారు.

చింతన



జాతస్య హి ధ్రువో మృత్యు ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యర్థే న త్వం శోచితు మర్హసి

"పుట్టిన ప్రతి ఒక్కడూ గిట్టక మానడు. గిట్టినవాడు మళ్ళీ పుట్టకమానడు. అనివార్యమైన ఈ విషయం గురించి శోకించడం తగదు" అని శ్రీకృష్ణుడు 'భగవద్గీత'లో చెప్పాడు. కానీ ఈ యదార్థం అంతిమ సంస్కారాలు జరిగే సమయంలో... ఘంటసాల గళంలో వినిపిస్తూ ఉంటుంది. అసలు వినవలసినవాడు పార్థివదేహంగా మారి... దాన్ని వినలేడు. విఎగిలినవారు విన్నా దాన్ని పట్టించుకోరు. ప్రతి మనిషి జీవితకాల చక్రంలో ఎనిమిది దశలు ఉంటాయి. అవి గర్భస్థ దశ, బాల్యం, విద్య, సంసారం, సంపాదన, విరామం, విముక్తం, చివరకు నిర్యాణం. ఈ దశలలో ఎదురయ్యే బాధలను, కన్నీళ్ళను, సుఖాలను, దుఃఖాన్ని, క్రోధాన్ని, ఆవేశాన్ని జయించాలంటే, కర్మనే కార్యంగా స్వీకరించి జీవించా లంటే, స్థిత ప్రజ్ఞుడిగా ఉండాలంటే... ఈ ఒక్క శ్లోకంలోని మర్మాన్ని అర్థం చేసుకుంటే చాలు. జీవితం ఒడుదొడుకులు లేకుండా ఉంటుంది. కార్యోన్ముఖంగా సాగుతుంది. 'కర్మ' అంటే తలరాత కాదు. మనం చేసే ప్రతి పనినీ 'కర్మ' అనే అంటారు. కర్మ సిద్ధాంతం అంటే తన లక్ష్యాన్ని తానే ఎంచుకొని, శ్రమించి పోరాడడం, సాధించడం.

మరణానికి ప్రణాళిక

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ...

అని కూడా చెప్పాడు గీతాచార్యుడు. మనం ధరించిన వస్త్రాలను విడిచిపెట్టి, వేరొక దుస్తులను ఎలా ధరిస్తామో... అలాగే ఆత్మ ఒక శరీరాన్ని విడిచిపెట్టి... కొత్త శరీరంలోకి వెళుతుంది. ఇది నిరంతరం జరుగుతున్న ప్రక్రియ. కాబట్టి దీనికోసం సుదీర్ఘంగా చింతించవద్దని అర్థం. మనమందరం గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే... శరీరం ధాతు సమ్మేళనం. మరణించిన తరువాత ఆ ధాతువులు పంచభూతాలలో కలుస్తాయి. ప్రకృతిలో (పరమాత్మలో) విలీనం అవుతాయి. కాబట్టి అనివార్యమైన మరణం కోసం ప్రణాళిక వేసుకోవాలి. మానసిక, ఆధ్యాత్మిక, కుటుంబ, సమాజ శ్రేయస్సుకు అది అత్యవసరం.

కుటుంబంలో చర్చించాలి:

విద్య, ఉద్యోగం, ఆస్తి, అంతస్తులు, ఆరోగ్యం, బీమా... ఇలా అన్నిటి గురించీ మనం చర్చిస్తాం. కానీ జీవితంలో తప్పనిసరిగా సంభవించే మరణం గురించి ఆలోచించడానికి భయపడతాం. అలాంటి ఆలోచనను అపశకునంగా భావిస్తాం. చర్చ జరిగినప్పుడే వాస్తవ పరిస్థితి అర్థమవుతుంది. జీవన లక్ష్యాల గురించి ఆలోచిస్తాం. మానసిక, ఆర్థిక, అంతిమ సంస్కార, అనంతర సంస్కార ప్రణాళిక రూపొందించుకోగలుగుతాం. "అహనీ అహని భూతాని గచ్ఛంతిహ యమాలయం... శేషః స్థిరత్వం ఇచ్ఛంతి కిమాశ్చర్యమతః పరం... ప్రతి క్షణం ఎందరో చనిపోతూనే ఉన్నారు. కానీ బతికి ఉన్నవారికి మేము కూడా ఒక రోజు మరణిస్తామనే ఆలోచనే రాదు. ఇది చాలా ఆశ్చర్యకరం. ఇది వాస్తవం" అని శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. దాన్ని ఇప్పటికీ మనం అర్థం చేసుకోలేదు.

చర్చ ఎందుకు జరగాలంటే:

మరణం అనివార్యం అని తెలిసినప్పుడు మనిషిలో భయం తగ్గుతుంది. లక్ష్య సాధన కోసం ధైర్యం పెరుగుతుంది. పదవీ విరమణ ప్రణాళిక మాదిరిగానే నిర్యాణ (మరణ) ప్రణాళిక ద్వారా... మరణించే వరకూ ఎలా బతకాలి, ఏం చెయ్యాలి అనేది నిర్ధారించుకోగలం. ఆరోగ్యం కోసం, కుటుంబం కోసం, ఆస్తుల పంపకం కోసం ప్రణాళికలు రూపొందించుకోగలం. మరణం మరో ప్రయాణానికి నాంది అని గ్రహించి... దాన్ని సంతోషంగా స్వీకరించగలం.

> **మానసిక దృఢత్వం అవసరం**
>
> **చావు భయం చాలామందిని పిరికివాళ్ళుగా చేస్తుంది. అది లక్ష్య సాధనకు అవరోధంగా మారుతుంది. మరణం అనివార్యం అని అర్థం చేసుకున్నప్పుడు, లక్ష్య సాధనలో మరణం కూడా ఒక ఆయుధంగా మారుతుంది.**

అంతిమ సంస్కారం:

ఏ వ్యక్తికైనా మరణానంతర కార్యక్రమాలు కూడా గౌరవప్రదంగా ఉండాలి. అంతిమ సంస్కారం ఎక్కడ జరగాలి, ఎలా జరగాలి, ఎవరు చేయాలనే విషయంలో స్పష్టత ఉండాలి. పార్థివ శరీరానికి కూడా సజీవుడైన వ్యక్తికి ఇచ్చే గౌరవం ఇవ్వాలి. దశదిన కర్మ, సంతాప సభలు కూడా శోక సమావేశాల్లా కాకుండా... మృతుడైన వ్యక్తితో తమ అనుబంధాలను, గత స్మృతులను ఆత్మీయులు తలచుకొనేలా ఉండాలి. స్మారక చిహ్నాల్లాంటివాటిని కోరుకొనే ఉంటారు. వీటన్నిటికీ అయ్యే ఖర్చు కుటుంబానికి భారం కాకుండా ముందే ఆర్థికమైన ఏర్పాటు చేసుకుంటే మంచిది. ఇలాంటివి ఆలోచించడం కష్టంగాను, భయంగాను అనిపిస్తుంది. కానీ అవతార పురుషులకు కూడా మరణం తప్పలేదు. కాబట్టి జన్మ, కర్మ, మరణం, పునర్జన్మ అనేవి తప్పించుకోలేనివని గమనించాలి.

ఆత్మీయ సందేశం:

మనం మన జీవితకాలంలో ఎందరినో కలుసుకుంటాం. కానీ ఎన్నో సంఘటనలను మనకు అత్యంత సన్నిహితులైన బంధు మిత్రులతో పంచుకోం. మన అనుభవాలను, అనుభూతులను ఆడియో లేదా వీడియో రూపంలోని ఒక సందేశం ద్వారా... మరణానంతరం మన సన్నిహితులకు అందించేలా వినూత్నమైన ఆలోచన చేయవచ్చు. మీరు ప్రత్యక్షంగా చెప్పలేని విషయాలు... మీ తదనంతరం వారికి తెలియడం వల్ల మీపట్ల వారి ఆత్మీయత మరింత పెరుగుతుంది.

- డాక్టర్ బూర నర్సయ్య గౌడ్
మాజీ ఎంపీ

గీతాసారం

తటస్థతతోనే మనశ్శాంతి

'సుఖ దుఃఖే సమకృత్వా' అనే శ్లోకంలో... సుఖ దుఃఖాలను, లాభనష్టాలను, జయాపజయాలను సమానంగా భావించి యుద్ధానికి సిద్ధపడాలని అర్జునుడికి శ్రీకృష్ణుడు సూచించాడు. సమత్వానికి ఆయన ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇచ్చాడు. ఆ తరువాత "అయుక్తుడికి అంటే ఇంద్రియ నిగ్రహం లేనివాడికి ఆత్మ విషయకమైన బుద్ధి, ఆత్మ స్వరూపం తాలూకు భావన.. ఈ రెండూ కలగవు. ఫలితంగా అతనికి శాంతి ఉండదు. శాంతి లేనివారికి సంతోషం ఉండదు" అని 'నాస్తి బుద్ధి రయుక్తశ్య' అనే శ్లోకం ద్వారా బోధించాడు. దీనిలో సమత్వానికి సంబంధించిన మరో దృష్టి కోణం ఉంది. మనుషులు తమలో తమను స్థిరపరచుకొనేవరకూ... అంటే ఆత్మ వివేచన పొందే వరకూ... స్నేహితులు, శత్రువులు, ఉద్యోగం, జీవిత భాగస్వామి, పిల్లలు, డబ్బు, ఆనందం, అధికారం ఆస్తులు అనే వాటి మీద తమ మనుగడ కోసం ఆధారపడతారు. దృష్టి డబ్బు మీద కేంద్రీకృతం అయినవారి ప్రణాళికలన్నీ సంపదను పెంచుకోవడం చుట్టూ తిరుగుతాయి. దానికోసం ఆరోగ్యం, అనుబంధాలు లాంటి అన్ని విషయాలనూ పణంగా పెడతారు. సుఖమే ప్రధానం అనుకున్నవారు ఆ సుఖాన్ని పొందడం కోసం ఇతరులను మోసం చేయడానికి వెనుకాడరు. శత్రుత్వమే ప్రధానంగా భావించేవారు తమ శత్రువులను ఎలా దెబ్బ తీయాలా? అని ఆలోచిస్తారు. మనం ఇతరులతో ముడిపడి ఉన్నప్పుడు... మన శాంతి వారి చేతుల్లో ఉంటుంది. మనల్ని వారి మీద ఆధారపడేలా చేస్తుంది. అందుకే మనం మధ్యలో కేంద్రీకృతమై ఉండే సమస్థితి గురించి శ్రీకృష్ణుడు నొక్కి చెప్పాడు. ఆ స్థితే మోక్షం.

> **"ఇంద్రియ నిగ్రహం లేనివాడికి ఆత్మ విషయకమైన బుద్ధి, ఆత్మ స్వరూపం తాలూకు భావన కలగవు. ఫలితంగా అతనికి శాంతి ఉండదు. శాంతి లేనివారికి సంతోషం ఉండదు" అని 'నాస్తి బుద్ధి రయుక్తశ్య' అనే శ్లోకం ద్వారా శ్రీకృష్ణుడు బోధించాడు.**

శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఉపయోగించిన 'భావం' అనే పదాన్ని మనం



భావోద్వేగాలతో ముడిపెట్టి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. ఎవరైనా వ్యక్తి లేదా వస్తువు 'నా' లేదా 'నేను'తో ముడిపడి ఉన్నప్పుడు... లోతైన భావోద్వేగాలు ప్రేరేపితమవుతాయి. లేదంటే కొన్నిసార్లు అవి మన హృదయాన్ని తాకనుకూడా తాకకపోవచ్చు. మన భావోద్వేగాలన్నీ వ్యక్తిపరమైనవని ఇది సూచిస్తుంది. అయితే శ్రీకృష్ణుడు చెబుతున్నది... సమానత్వం నుంచి ఉద్భవించే 'భావం' గురించి.. అది 'నేను' అనే భావనతో సంబంధం కలిగి ఉన్నా, లేకున్నా ఒకటిగానే ఉంటుంది. మన పరిసరాలు అప్రియంగా, అస్తవ్యస్తంగా, కలవరపెట్టేవిగా ఉండవచ్చు. కానీ తటస్థంగా ఉండడం ద్వారా అంతర్గత సామరస్యాన్ని పొందిన వ్యక్తిని అవి ప్రభావితం చేయలేవు. శ్రీకృష్ణుడు దాన్నే 'శాంతిని పొందడం' అని సూచించాడు. అది అంతిమంగా మనకు ఆనందాన్ని ఇస్తుంది.



కె. శివప్రసాద్
ఐఏఎస్

జూలై జీఎస్టీ ఆదాయం రూ.1.82 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: జూలైలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 10.3 శాతం వృద్ధితో రూ.1.82 లక్షల కోట్లకు చేరుకుంది. జీఎస్టీ చట్టం అమలులోకి వచ్చిన (2017 జూలై నుంచి) ఏడేళ్లలో ఇది మూడో అత్యధిక నెలవారీ వసూలు. గత నెలలో పన్ను రిఫండ్లు రూ.16,283 కోట్లుగా నమోదయ్యాయి. రిఫండ్లు మినహాయించగా.. నికర జీఎస్టీ వసూళ్లు 14.4 శాతం వృద్ధితో రూ.1.66 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం జీఎస్టీ ఆదాయం రూ.1,82,075 కోట్లలో సెంట్రల్ జీఎస్టీ రూ.32,386 కోట్లు, స్టేట్ జీఎస్టీ రూ.40,289 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ.96,447 కోట్లుగా ఉన్నాయి. సెస్సు రూపంలో మరో రూ.12,953 కోట్లు సమకూరాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో జీఎస్టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 10.2 శాతం వృద్ధి చెంది రూ.7.39 లక్షల కోట్లకు చేరుకుంది.ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2.10 లక్షల కోట్లకు పెరగగా.. 2023 ఏప్రిల్‌లో రెండో అత్యధిక స్థాయి రూ.1.87 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

తెలంగాణ ఆదాయం రూ.4940 కోట్లు

గత నెలకు తెలంగాణ జీఎస్టీ ఆదాయం 2 శాతం పెరిగి రూ.4,940 కోట్లుగా, ఏపీ జీఎస్టీ రాబడి 7 శాతం తగ్గి రూ.3,346 కోట్లుగా నమోదయ్యాయి.

ఇన్ఫోసిస్ జీఎస్టీ నోటీసులు వెనక్కి

బెంగళూరు: పన్నుల ఎగవేతకు సంబంధించి రూ.32,000 కోట్లు చెల్లించాలని ఇన్ఫోసిస్‌కు జారీ చేసిన ప్రీ-షోకాజ్ నోటీసుల్ని కర్ణాటక ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. బెంగళూరులోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ నుంచి ఈ మేరకు సమాచారం అందినట్టు ఇన్ఫోసిస్ తెలిపింది. అయితే దీనికి సంబంధించి కంపెనీ మరిన్ని వివరాలు అందజేయాలని కోరింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటలిజెన్స్ బుధవారం జారీ చేసిన ఈ నోటీసు కార్పొరేట్ రంగంలో ప్రకంపనలు సృష్టించింది. నిబంధనలు తుచ తప్పక పాటించే ఇన్ఫోసిస్‌కు ఇలా నోటీసులు జారీ చేయడాన్ని అనేక మంది తప్పు పట్టారు. కంపెనీ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ అయితే దీన్ని 'పన్ను టెర్రరిజం'గా అభివర్ణించారు. ఈ విమర్శలతో కర్ణాటక ప్రభుత్వం ఈ విషయంలో వెనక్కి తగ్గినట్టు భావిస్తున్నారు.

ఏథర్ ఎనర్జీతో అమరరాజా ఒప్పందం

బెంగళూరు: అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ (ఏఆర్ఈఎం) పూర్తి యాజమాన్య కంపెనీ అయిన అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ (ఏఆర్ఏసీటీ) ఏథర్ ఎనర్జీతో ఒక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసింది. ఈ ఒప్పందం కింద తెలంగాణలోని దివిటిపల్లిలో రానున్న తమ గిగా ఫ్యాక్టరీలో ఎన్ఎంసీ (నికెల్ మాంగనీస్ కోబాల్ట్), ఎల్ఎఫ్‌పీ (లిథియం ఐరన్ ఫాస్ఫేట్), లిథియం అయాన్ (లై-అయాన్) వంటి ఆధునిక రసాయనిక బ్యాటరీలు ఉత్పత్తి చేయడంలో ఉభయ సంస్థలు సహకరించుకుంటాయి. భారతదేశం స్వచ్ఛ, హరిత ఇంధనాల వినియోగానికి మారుతున్న నేపథ్యంలో ఆటోమొబైల్ పరిశ్రమ విద్యుత్ వాహనాలు ప్రత్యేకించి విద్యుత్ టూవీలర్ల తయారీపై దృష్టి సారించింది. 2030 నాటికి విద్యుత్ టూవీలర్ల పరిశ్రమ 40 శాతం విస్తరిస్తుందని అంచనా. పెరుగుతున్న మార్కెట్ అవకాశాలు అందిపుచ్చుకునేందుకు అమరరాజా, ఏథర్ ఆశావహ ప్రణాళికలు రూపొందించుకున్న నేపథ్యంలో ఈ ఒప్పందం ఉభయ సంస్థలకు కీలకం కానుంది. ఏథర్ ఎనర్జీకి కర్ణాటకలోని హోసూరు, తమిళనాడుల్లో రెండు తయారీ ప్లాంట్లు పని చేస్తున్నాయి. మహారాష్ట్రలో మరో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు ఇటీవలే ప్రకటించింది. అమరరాజా కూడా ఇ-మొబిలిటీ రంగానికి అవసరం అయిన ఉత్పత్తులు, సొల్యూషన్లు అందించేందుకు కట్టుబడి ఉంది. ఇదిలా ఉండగా లిథియం అయాన్ సెల్స్‌ను భారతదేశంలోని పరిస్థితులకు అనుగుణంగా తయారుచేసేందుకు వీలుగా ఎల్ఎఫ్‌పీ టెక్నాలజీని లోకలైజ్ చేసేందుకు జీబీటీతో అమరరాజా ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. జీబీటీతో తాము ఇటీవల కుదుర్చుకున్న ఒప్పందంతో పాటు తాజాగా ఏథర్ ఎనర్జీతో కుదుర్చుకున్నం ఒప్పందం వల్ల ఈవీ మార్కెట్‌కు అవసరమైన సొల్యూషన్లు అందించేందుకు తాము చేస్తున్న కృషికి మరింత బలం చేకూరుతుందని ఏఆర్ఈఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్రమాదిత్య గౌరినేని అన్నారు.

నిఫ్టీ @25,000

ఇంట్రాడేలో 82,000 స్థాయికి సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా ఐదో రోజూ సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించింది. ఎన్ఎస్ఈ ప్రధాన సూచీ నిఫ్టీ తొలిసారిగా 25,000 మైలురాయిని దాటగా.. ఇంట్రాడేలో సెన్సెక్స్ 82,000 స్థాయిని చేరుకుంది. సెప్టెంబరు నుంచి వడ్డీరేట్లను తగ్గిస్తామని యూఎస్ ఫెడరల్ రిజర్వ్ సంకేతాలిచ్చిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఆయిల్ రంగ షేర్లలో కొనుగోళ్లకు పాల్పడటం ఇందుకు దోహదపడింది. సెన్సెక్స్ ఆరంభ ట్రేడింగ్‌లో 388.15 పాయింట్ల వరకు పెరిగి 82,129.49 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. అయితే, ఐరోపా, ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాలు, పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా మన సూచీలూ క్రమంగా తగ్గుతూ వచ్చాయి. మధ్యాహ్నం సెషన్‌లో లాభ, నష్టాల మధ్య దోబూచులాడిన సెన్సెక్స్.. చివరికి 126.21 పాయింట్ల పెరుగుదలతో జీవితకాల గరిష్ఠ స్థాయి 81,867.55 వద్ద స్థిరపడింది. ప్రారంభ ట్రేడింగ్‌లో 127.15 పాయింట్ల వరకు పెరిగి 25,078.30 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసిన నిఫ్టీ చివరికి 59.75 పాయింట్ల లాభంతో 25,010.90 వద్ద క్లోజైంది. నిఫ్టీ 25000 పైన ముగియడం ఇదే ప్రథమం.



24 రోజుల్లో 1,000 పాయింట్ల వృద్ధి

కేవలం 24 ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 24,000 నుంచి 25,000 స్థాయికి చేరుకుంది. సూచీకిది మూడో అత్యంత వేగవంతమైన 1,000 పాయింట్ల వృద్ధి. నిఫ్టీ 23,000 నుంచి 24,000కు 23 సెషన్లలో పుంజుకుంది. అది రెండో అత్యంత వేగవంతమైన ర్యాలీ. కాగా, 2021 ఆగస్టులో సూచీ కేవలం 19 ట్రేడింగ్ సెషన్లలో 16,000 నుంచి 17,000 పాయింట్లకు ఎగబాకింది. ఇప్పటివరకు సూచీకిదే అత్యంత వేగవంతమైన 1,000 పాయింట్ల వృద్ధి.

221 రోజుల్లో 5,000 పాయింట్ల ర్యాలీ

గత ఏడాది సెప్టెంబరు 11న తొలిసారిగా 20,000 మైలురాయికి చేరిన నిఫ్టీ.. గడిచిన 221 ట్రేడింగ్ సెషన్లలో 5,000 పాయింట్లు పెరిగి 25,000 స్థాయికి అధిరోహించింది. ఈ ర్యాలీలో సూచీలోని 50 కంపెనీల షేర్లలో 45 పాజిటివ్ రిటర్నులు పంచాయి. ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు టాప్ గెయినర్లుగా నిలిచాయి. నిఫ్టీ 50 సూచీని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి 1,000 బేస్ పాయింట్లతో 1,996 ఏప్రిల్ 22న ప్రారంభించింది.

కీలక మైలురాళ్లివే...

5,000	2007 సెప్టెంబరు 27
10,000	2017 జూలై 25
15,000	2021 ఫిబ్రవరి 5
20,000	2023 సెప్టెంబరు 11
21,000	2023 డిసెంబరు 14
22,000	2024 జనవరి 15
23,000	2024 మే 25
24,000	2024 జూన్ 27
25,000	2024 ఆగస్టు 1

ఐపీఓకు హీరో ఫిన్‌కార్ప్

హీరోమోటోకార్ప్ ఆర్థిక సేవల విభాగం హీరో ఫిన్‌కార్ప్ ఐపీఓకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.3,668 కోట్ల వరకు సమీకరించేందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా సంస్థ రూ.2,100 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ఇన్వెస్టర్లకు చెందిన రూ.1,568 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలనుకుంటోంది.

ఫస్ట్ క్రై ఇష్యూ ధర రూ.440-465

- ఫస్ట్ క్రై మాతృసంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ లిమిటెడ్ వచ్చే నెల 6న విడుదల చేయనున్న ఐపీఓలో ధరల శ్రేణిని రూ.440-465గా నిర్ణయించింది. తద్వారా రూ.4,194 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.
- అదే రోజు విడుదల కానున్న యూనికామర్స్ ఈ-సొల్యూషన్స్ లిమిటెడ్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.102-108గా నిర్ణయించింది.

టాప్‌గేర్‌లో టాటా మోటార్స్ లాభం

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.5,566 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 74 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం సైతం రూ.1,03,597 కోట్ల నుంచి రూ.1,09,623 కోట్లకు పెరిగింది. అనుబంధ కంపెనీలను మినహాయించినా (స్టాండ్ అలోన్) టాటా మోటార్స్ రూ.2,190 కోట్ల నికర లాభం నమోదు చేసింది.

ఐటీసీ లాభం రూ.4917 కోట్లు

కోల్‌కతా: ఐటీసీ తొలి త్రైమాసిక ఫలితాలు మార్కెట్‌ను నిరాశ పరిచాయి. ఈ కాలానికి కంపెనీ స్టాండ్ అలోన్ లాభం రూ.4,917.45 కోట్లుగా నమోదయింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.4,902.74 కోట్లతో పోలిస్తే ఇది కేవలం 0.3 శాతం మాత్రమే ఎక్కువ. కంపెనీ ఆదాయం రూ.17,704.23 కోట్ల నుంచి రూ.18,921.01 కోట్లకు చేరింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభాలు అదుర్స్

న్యూఢిల్లీ: అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) జూన్ త్రైమాసికానికి రూ.1,458 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.675 కోట్లతో పోలిస్తే ఇది 116 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం కూడా 13 శాతం వృద్ధితో రూ.26,067 కోట్లకు చేరింది. ఇదిలా ఉండగా ఏఈఎల్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న డేటా కేంద్రం పూర్తి కావస్తున్నట్టు తెలిపింది. ఇప్పటి వరకు ఈ కేంద్ర నిర్మాణం 94 శాతం పూర్తయినట్టు కంపెనీ తెలిపింది. గురువారం సమావేశమైన ఏఈఎల్ బోర్డు మరో కీలక నిర్ణయం తీసుకుంది. కంపెనీకి చెందిన ఆహార ఎఫ్ఎంసీజీ వ్యాపారాన్ని అదానీ విల్‌మార్ కంపెనీకి బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపింది.

ఆటో మార్కెట్ జోరుకు బ్రేక్



న్యూఢిల్లీ: దేశంలోని ప్రముఖ కార్ల తయారీ కంపెనీలన్నింటి అమ్మకాలు జూలై నెలలో నిరాశావహంగా ఉన్నాయి. ప్రధానంగా అగ్రగామి కంపెనీలు మారుతి సుజుకీ, హ్యుండయ్, టాటా మోటార్స్ అమ్మకాల్లో క్షీణత నమోదు చేశాయి. వాహనాలకు డిమాండు తగ్గడం ఇందుకు కారణం. జూలై నెలలో మారుతి 1,37,463 కార్లు విక్రయించింది. గత ఏడాది ఇదే నెలలో నమోదైన విక్రయాలు 1,52,126తో పోల్చితే అమ్మకాల్లో 9.64 శాతం క్షీణత నమోదయింది. ప్రధానంగా మినీ సెగ్మెంట్‌లోకి వచ్చే ఆల్టో, ఎస్-ప్రెసో కార్ల అమ్మకాలు 9590 నుంచి 9960కి పెరిగాయి. కాని కాంపాక్ట్, యుటిలిటీ కార్ల అమ్మకాలు తగ్గాయి. ఇదిలా ఉండగా ఫ్యాక్టరీ నుంచి డీలర్లకు పంపిన వాహనాల సంఖ్య జూలై నెలలో 3 శాతం తగ్గి 50,701 యూనిట్ల నుంచి 49,013 యూనిట్లకు తగ్గిందని హ్యుండయ్ మోటార్ ఇండియా ప్రకటించింది. టాటా మోటార్స్ 70,161 కార్లు విక్రయించింది. గత ఏడాది ఇదే నెలలో జరిగిన 78,844 అమ్మకాలతో పోల్చితే 11 శాతం క్షీణత నమోదయింది.

టూ వీలర్ల జోరు: ద్విచక్ర వాహనాల అమ్మకాలు మాత్రం జోరుగానే సాగాయి. బజాజ్ ఆటో 2,10,997 వాహనాలు విక్రయించింది. గత ఏడాది జూలైతో (1,79,263 యూనిట్లు) పోల్చితే అమ్మకాలు 18 శాతం పెరిగాయి.

- టీవీఎస్ మోటార్ కంపెనీ అమ్మకాల్లో 8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ కంపెనీ అమ్మకాలు 2,35,230 నుంచి 2,54,250కి పెరిగాయి.
- హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా అమ్మకాలు 41 శాతం పెరిగి 4,39,118 యూనిట్లకు చేరాయి.

బిజినెస్

ఐడీబీఐ బ్యాంకు రేసులో కోటక్ బ్యాంకు !

న్యూఢిల్లీ: ఐడీబీఐ బ్యాంకు ఈక్విటీలో మెజారిటీ వాటా కొనుగోలు చేసేందుకు కోటక్ మహీంద్రా బ్యాంకు ఆసక్తి చూపిస్తున్నట్టు సమాచారం. ఇందు కోసం బిడ్డింగ్‌లో కూడా పాల్గొంది. ఈ బ్యాంకు ఈక్విటీలో కేంద్ర ప్రభుత్వానికి 45.48 శాతం, ఎల్ఐసీకి 49.24 శాతం వాటా ఉంది. ఇందులో మేనేజ్‌మెంట్ కంట్రోల్‌తో 60.7 శాతం వాటా అమ్మకానికి ప్రభుత్వం బిడ్లు ఆహ్వానించింది. దీంతో కోటక్ బ్యాంకుతో పాటు ప్రవాస భారత బిలియనీర్ ప్రేమ్ వత్సా నేతృత్వంలోని ఫెయిర్‌ఫాక్స్ ఇండియా, యూఏఈకి చెందిన ఎమిరేట్స్ ఎన్‌డీబీ సంస్థలు ప్రాథమిక బిడ్స్ ఫైల్ చేశాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ బిడ్స్‌కు ఇప్పటికే క్లియరెన్స్ ఇచ్చింది. ఆర్‌బీఐ అనుమతి ఒక్కటే మిగిలి ఉంది. త్వరలోనే ఆర్‌బీఐ నుంచి కూడా అనుమతి లభిస్తుందని భావిస్తున్నారు. అపుడు ఈ మూడు సంస్థలు తమ తుది బిడ్స్ సమర్పించాలి. అయితే ఈ వార్తలపై ఈ మూడు సంస్థలు అధికారికంగా నోరు మెదపడం లేదు. ఈ ప్రయత్నంలో విజయవంతమైతే కోటక్ బ్యాంకుకు ఐఎన్‌జీ వైశ్యా బ్యాంకు తర్వాత ఇది రెండో కొనుగోలు అవుతుంది.

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వడ్డీరేటు తగ్గింపు

లండన్: యూరో జోన్‌లో వడ్డీరేట్ల తగ్గింపు ప్రారంభమైంది. స్వల్ప కాలిక వడ్డీరేటును బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ) 5.25 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించింది. 2020 కొవిడ్ తర్వాత బీఓఈ వడ్డీ రేట్లు తగ్గించడం ఇదే మొదటిసారి. రిటైల్ ద్రవ్యోల్బణం నిర్ణీత రెండు శాతానికి రావడంతో ఈ చర్య తీసుకున్నట్టు బీఓఈ గవర్నర్ ఆండ్రూ బెయిలీ చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,360 ▲	64,500 ▲	91,700 ▲
ముంబై	69,720 ▲	63,860 ▲	83,460 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	440
చిత్తూరు	513	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	87	విజయవాడ	92
వరంగల్	87	గుంటూరు	92
కరీంనగర్	87	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	87	చిత్తూరు	106
కర్నూలు	87	నెల్లూరు	106
విశాఖపట్నం	86	అనంతపురం	92
గోదావరి	92		


studio green
STUDIO GREEN FILMS (P) LTD.
BESTEST ENTERTAINMENT
SINGLE SCREENS RS.99/-
@ THE BESTEST PRICE
MULTIPLEXES RS.125/-
K.E.GNANAVELRAJA & AADHANA GNANAVELRAJA
ALLU SIRISH'S
బడ్డీ
WRITTEN & DIRECTED BY SAM ANTON
PRODUCED BY K.E.GNANAVELRAJA AADHANA GNANAVELRAJA
FROM TODAY
NETFLIX
Junglee


TRISHA PRESENTS
SURAKSH
నేడే బ్రహ్మాండమైన విడుదల
తిరగబడరసామీ...
MALKAPURAM SHIVAKUMAR
ADITYA MUSIC


VIJAYA BHASKAR KRAFT
A VIJAYA BHASKAR FILM
నేడే
విడుదల
SREE KAMAL TANVI AKAANKSHA
ఉషాపరిణయం
Love is Beautiful..!
WRITTEN, PRODUCED & DIRECTED BY VIJAYA BHASKAR K
DOP SATISH MUTYALA MUSIC RR DHRUVAN


SRI NEELAKANTA MAHADEVA ENTERTAINMENTS LLP
PVR INOX PICTURES RELEASE
నేడే విడుదల
Average Student
నాని
MARKS: JUST PASS — CHARACTER: 100%
IN THEATRES 2 AUGUST


IN CINEMAS AUG 2nd
SVC RELEASE
అలనాటి రామచంద్రుడు
నేడే
విడుదల


INFINITI FILM VENTURES
sree siri sai CINEMAS
IN THEATRES
AUGUST 9th
VIJAY ANTONY
తుఫాన్
S.D.VIJAY MILTON
SCRIPT | DOP | DIRECTION SD VIJAY MILTON
PRODUCED BY
KAMAL BOHRA | D. LALITHAA | B.PRADEEP | PANKAJ BOHRA


M3 MEDIA
MAHARSHI KONDLA PRESENTS
SINGLE SCREENS RS 99
MULTIPLEXES RS 112
You Are TRAPPED
VARUN SANDESH
విరాజీ
ప్రపంచవ్యాప్తంగా
ఆగస్టు
2న
విడుదల
నేడే
విడుదల
PRODUCER MAHENDRA NATH KONDLA DIRECTOR ADHYANTH HARSHA
MUSIC ON SABARI MUSIC


MEGA
BLOCKBUSTER
2ND
WEEK
KALANITHI MARAN PRESENTS
DHANUSH
రాయన్
WRITTEN AND DIRECTED BY DHANUSH
A R RAHMAN MUSICAL
IN CINEMAS NOW

అసెంబ్లీలో మహిళల పట్ల సీఎం తీరు సరికాదు

» సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో తమను సీఎం రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా విమర్శించారని, మహిళల పట్ల ఆయన తీరు సరికాదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం మరో ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. కుటుంబ యజమాని హత్యకు గురైతే తప్పనిసరి పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వచ్చామని, తాము ఎవరినీ మోసం చేయలేదన్నారు. 'పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న నువ్వు కూడా నిన్ను నమ్మిన రాహుల్ గాంధీ బతుకును సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేస్తావా?' అని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి మహిళలంటే గౌరవం లేదని, ఆయన తాలిబన్ల సంస్కృతికి వారసుడిలా కనబడుతున్నారని వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యేలు నాలుగున్నర గంటలు నిలబడినా అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు. కాగా, అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీ గొంతు నొక్కేశాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఇతర సభ్యులకు మాట్లాడే అవకాశం రాకుండా బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేశారన్నారు.

మీ వేధింపులు తాళలేం..ఉద్యోగం చేయలేం

» కడెం తహసీల్దార్ వేధిస్తున్నారంటూ సిబ్బంది సెలవు

ఖానాపూర్, ఆగస్టు 1: నిర్మల్ జిల్లా కడెం తహసీల్దార్ తమను వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొంటూ కార్యాలయ సిబ్బంది గురువారం సామూహిక సెలవు పెట్టారు. 'మీ వేధింపులు తాళలేకపోతున్నాం, ఇకపై మీ వద్ద ఉద్యోగం చేయలేం' అంటూ తహసీల్దార్ సుజాతరెడ్డికి డిప్యూటీ తహసీల్దార్ శంకర్ సహా కార్యాలయ సిబ్బంది 13 మంది సామూహిక సెలవు పత్రాన్ని అందజేశారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ శంకర్ విలేకరులతో మాట్లాడుతూ, తహసీల్దార్ సుజాతరెడ్డి గత ఆరు నెలలుగా సిబ్బందిని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ఇష్టారాజ్యంగా దూషిస్తూ అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లుగా తమపై అధికారి అని గౌరవిస్తూ వచ్చామని, అయినా ఆమెలో మార్పు రాకపోవడంతో నిరసనగా మూడు రోజులపాటు సామూహికంగా సెలవులపై వెళ్లాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు. కాగా, ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని నిర్మల్ ఆర్డీవో రత్న కల్యాణి తెలిపారు.

చార్జర్ వైరు నోట్లో పెట్టుకుని...
విద్యుదాఘాతానికి గురై 18 నెలల చిన్నారి మృతి

ఖానాపూర్, ఆగస్టు 1: మొబైల్ ఫోన్లు చార్జింగ్ పెట్టుకున్న తర్వాత చాలా మంది స్విచ్ ఆపకుండా చార్జర్లను స్విచ్ బోర్డులకు అలానే నిర్లక్ష్యంగా వదిలేస్తారు. ఇదే నిర్లక్ష్యానికి గురువారం ఓ పసి ప్రాణం బలైంది. సెల్ ఫోన్ చార్జర్ వైరు నోట్లో పెట్టుకుని విద్యుదాఘాతానికి గురై 18 నెలల వయస్సు ఉన్న ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. నిర్మల్ జిల్లా కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన దుర్గం సుశీల, రాజలింగు దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె ఆరాధ్యకు 18 నెలల వయస్సు. గురువారం రాత్రి తల్లిదండ్రులు ఇంట్లోనే ఉండగా.. ఆడుకుంటూ అటుఇటు తిరుగుతున్న ఆరాధ్య.. గోడకు వేలాడుతున్న సెల్‌ఫోన్ చార్జర్ వైరును నోట్లో పెట్టుకుంది. అయితే, స్విచ్ బోర్డులో స్విచ్ ఆన్ చేసి ఉండడంతో విద్యుత్ షాక్‌కు గురైన ఆరాధ్య ఒక్కసారిగా స్పృహ కోల్పోయింది. గుర్తించిన తల్లిదండ్రులు ఆరాధ్యను హుటాహుటిన ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించిందని వైద్యులు వెల్లడించారు. దీంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న వారందరి హృదయాలు చలించిపోయాయి.

శరవేగంగా గౌరవెల్లి ప్రాజెక్టు పనులు

» లక్షా 6 వేల ఎకరాలకు సాగు నీరు: పొన్నం

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్టుతో పాటు ఎస్సారెస్పీ-ఐఎఫ్ఎఫ్‌సీలోని ప్యాకేజీ నంబర్-7లోని పనులు పూర్తి చేయడానికి రూ.437 కోట్లు కేటాయించడంతో త్వరితగతిన పనులు పూర్తవుతాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. హుస్నాబాద్‌తో పాటు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాల్లో బీడు భూములు గోదావరి జలాలతో సస్యశ్యామలమవుతాయని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ కుడి కాల్వ ద్వారా 90 వేల ఎకరాలు, ఎడమ కాల్వ ద్వారా 16 వేల ఎకరాలు.. మొత్తం లక్షా ఆరు వేల ఎకరాలకు సాగు నీరందుతుందని వెల్లడించారు. జాబ్ క్యాలెండర్‌కు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హర్షం వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్ మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని మరోసారి రుజువైందని పేర్కొన్నారు. రాష్ట్ర యువత పక్షాన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. 32 ఏళ్లుగా వీలుకాని జాబ్ క్యాలెండర్.. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో గురువారం విడుదల కావడం నిరుద్యోగులకు వరమని కాంగ్రెస్ నేత చనగాని దయాకర్ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రంథాలయంలో నిరుద్యోగులు సంబరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కాగా, పారిస్ ఒలింపిక్స్‌కు ఈనెల 3న తెలంగాణ ప్రభుత్వం తరఫున ప్రతినిధులుగా ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో పాటు పలువురు అధికారుల బృందం వెళ్లనుంది. క్రీడా పోటీలు ముగిసే వరకు ఈ బృందం అక్కడే పర్యటించనుంది.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రుణమాఫీ చేశారా ?

» బీజేపీ నేతలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజం

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రైతుల రుణాలను మాఫీ చేశారా ? చెప్పండంటూ ఆ పార్టీ నేతలపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రుణమాఫీ జరగలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రైతులను గందరగోళంలో పెట్టవద్దని బీజేపీ నేతలను కోరారు. అదే సమయంలో రైతులకు పెట్రోల్, డీజిల్ సబ్సిడీ ధరలపై సరఫరా చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచన చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చి హామీ ఏమైందని బీజేపీ నేతలను నిలదీశారు. బీజేపీ ఇచ్చిన హామీలపై ఏర్పాటు చేసిన టోల్ (బీజేపీ) ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే ఎవరైనా సమాధానం చెప్తారా ? అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తుందని తెలిపారు. రుణమాఫీ అంశంలో అక్కడక్కడా ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరిస్తూ, అర్హులైన ప్రతి రైతుకు పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామని తుమ్మల స్పష్టం చేశారు.

భౌబోయ్.. పీక్కుతిన్నాయ్..!!

» నిద్రిస్తున్న వృద్ధురాలిపై దాడి చేసి చంపిన వీధి కుక్కలు


రాజ్యలక్ష్మి (ఫైల్)

ముస్తాబాద్, ఆగస్టు 1: వీధి కుక్కల దాడులు రోజురోజుకి అధికమవుతున్నాయి. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా మనుషుల ప్రాణాలు తోడేస్తున్నాయి. తాజాగా రాత్రి వేళ ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న 80 ఏళ్ల వృద్ధురాలిపై దాడి చేసిన వీధి కుక్కలు ఆమెను పీక్కుతిని ప్రాణాలు తీశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాలో జరిగిన ఈ ఘటనలో పిట్ల రాజ్యలక్ష్మి(80) ప్రాణాలు కోల్పోయింది. సేవాలాల్ తండాకు చెందిన రాజ్యలక్ష్మి, పోచయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పోచయ్య మరణించగా తల్లి రాజ్యలక్ష్మి కోసం కొడుకులు ఓ రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. వృద్ధాప్య సమస్యలతో ఐదేళ్లుగా మంచానికే పరిమితమైన రాజ్యలక్ష్మి ఆ షెడ్డులో ఉంటుండగా.. కొడుకులు సమీపంలోనే వేర్వేరుగా ఉంటూ తల్లి బాగోగులు చూస్తున్నారు. ఎప్పట్లాగే బుధవారం సాయంత్రం తల్లికి భోజనం అందించిన కొడుకులు ఎవరి ఇంటికి వారు వెళ్లి నిద్రపోయారు. అయితే, గదిలో ఒంటరిగా నిద్రిస్తున్న రాజ్యలక్ష్మిపై అర్ధరాత్రి వేళ వీధికుక్కలు దాడి చేశాయి. ముఖంపై విచక్షణారహితంగా కొరికి రాజ్యలక్ష్మి ప్రాణం తీశాయి. గురువారం ఉదయం తల్లి దగ్గరకు వెళ్లిన కుమారులు ఈ ఘోరాన్ని చూసి... పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్కిల్ వర్సిటీలో డిగ్రీ పట్టా ఇస్తాం

17 కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ.. ఈ ఏడాది 2 వేల మందికి ప్రవేశం: సీఎం రేవంత్‌రెడ్డి

» డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ ఏర్పాటు చేస్తాం: శ్రీధర్‌బాబు

» అసెంబ్లీలో వర్సిటీ బిల్లు పెట్టిన మంత్రి





హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): యువతకు కేవలం సర్టిఫికెట్లతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకడం కష్టంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. సాంకేతిక నైపుణ్యాలు పెంచుకుంటేనే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకే తమ ప్రభుత్వం కొత్తగా 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేస్తోందని చెప్పారు. గురువారం శాసనసభలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్కిల్ వర్సిటీ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వర్సిటీలో 17 కోర్సులు ప్రవేశపెట్టి, ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో యూనివర్సిటీని నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడు రకాలుగా సర్టిఫికెట్ కోర్సులు అందిస్తామన్నారు. ఇదివరకు స్కిల్ వర్సిటీలో డిగ్రీ ఇచ్చే విధానం లేదని, ఫలితంగా విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న స్కిల్ వర్సిటీలో డిగ్రీ పట్టా ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఫీజు ఏడాదికి రూ.50 వేలుగా నిర్ణయించామని, రీయింబర్స్‌మెంట్, హాస్టల్ వసతి కల్పిస్తామని చెప్పారు. తాత్కాలికంగా హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో 1500 మందికి, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్)లో 500 మందికి ఆరు కోర్సుల్లో తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. ఇక్కడికే పరిమితం కాకుండా భవిష్యత్తులో జిల్లాలకూ విస్తరిస్తామని చెప్పారు. పారిశ్రామిక అవసరాలకు, విద్యకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా యువత ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని, అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని అన్నారు. 2 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని, ఇందుకోసం త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారు. పరిశ్రమల్లో ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలు అందించడానికే వర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఆర్నెల్లలో 20కి పైగా సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఆరోగ్యం, ఔషధాలు, కృత్రిమ మేధ, లైఫ్ సైన్సెస్, బ్యాంకింగ్, యానిమేషన్ వంటి 12 రంగాలకు చెందిన బోధన ఉంటుందన్నారు. వర్సిటీ కోసం ముచ్చర్లలో 57 ఎకరాలను కేటాయించామని, అక్కడ శాశ్వత క్యాంపస్ ఏర్పాటవుతుందని శ్రీధర్‌బాబు వివరించారు. స్కిల్ వర్సిటీతో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గత పదేళ్లలో ఎంఎస్ఎంఈ పాలసీ లేదని, తమ ప్రభుత్వం తీసుకురాబోతోందని చెప్పారు. ఆయా రంగాలకు చెందిన పరిశ్రమల నిపుణులే ఫ్యాకల్టీగా ఉంటారని, భవిష్యత్తులో స్కిల్ వర్సిటీని జిల్లాలకు విస్తరిస్తామని తెలిపారు. ఇక వర్సిటీతో పాటు 'డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ ఆఫ్ ఇండియా'ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఉద్యోగార్థులు, నైపుణ్య శిక్షణ పొందినవారు ఉద్యోగాల కోసం ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. వర్సిటీ బిల్లుకు బీజేపీ మద్దతివ్వడం శుభపరిణామమని చెప్పారు.

శాటిలైట్ క్యాంపస్‌లు పెట్టాలి: ఏలేటి

స్కిల్ వర్సిటీ ఏర్పాటు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రకటించారు. గుజరాత్, హరియాణా వంటి రాష్ట్రాల్లో స్కిల్ వర్సిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం పదేళ్లలో రాష్ట్రంలోని వర్సిటీలను పట్టించుకోలేదన్నారు. స్కిల్ వర్సిటీలో ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. వెనకబడిన జిల్లాల్లో వర్సిటీ శాటిలైట్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్కిల్ వర్సిటీ కులపతిగా గవర్నర్ ఉండాలని, పాలకమండలి చైర్మన్‌గా పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర లేదా టీవీ మోహన్‌రెడ్డిని నియమించాలని బీజేపీ ఎమ్మెల్యే హరీశ్‌బాబు సూచించారు. వర్సిటీ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపించాలని మజ్లిస్ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యులెవరూ చర్చలో పాల్గొనలేదు. మండలిలోనూ వర్సిటీ బిల్లును శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మాట్లాడడానికి ప్రయత్నించగా చైర్మన్ గుత్తా సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

అన్ని అంశాలు పరిగణనలోకి: భట్టి

అన్ని అంశాలు, సభ్యుల సూచనలు, సలహాలు తీసుకుని స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అసెంబ్లీలో స్కిల్ వర్సిటీ బిల్లుపై చర్చ సందర్భంగా సభ్యులు తెలిపిన అంశాలపై భట్టి మాట్లాడారు. గతంలో ప్రైవేటు వర్సిటీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్(ఆర్‌వోఆర్) ఉండేది కాదన్నారు. కానీ, ప్రస్తుత వర్సిటీకి ఆర్‌వోఆర్ ఉంటుందని చెప్పారు. దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న వారికి ఫీజు తగ్గింపు, అర్హులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర అన్ని అంశాలనూ పరిశీలించి, ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భట్టి తెలిపారు.

సీఎం క్షమాపణ చెప్పాల్సిందే!

స్పీకర్ వద్ద పోడియం ఎదుట బైఠాయించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నినాదాలు

» సీఎం చాంబర్ వద్ద కూడా బైఠాయింపు

» మోసుకుంటూ బయటకు తెచ్చిన మార్షల్స్

» అరెస్టు... తెలంగాణ భవన్‌కు తరలింపు


కేటీఆర్‌ను బయటికి తీసుకొస్తున్న మార్షల్స్


వ్యానులో హరీశ్‌రావును తరలిస్తున్న పోలీసులు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసనలతో రెండో రోజూ అసెంబ్లీ హోరెత్తింది. గురువారం ఉదయం కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు నల్ల బ్యాడ్జీలు ధరించి సభలోకి వచ్చారు. సభ ప్రారంభం కాగానే స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి నినాదాలు చేశారు. ముగ్గురు మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి సభ జరుగుతున్నంత సేపు శాసన సభా కార్యదర్శి టేబుల్ ఎదుట నిల్చొని నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి... సీఎం డౌన్ డౌన్.. సీఎం అహంకారపూరిత వైఖరి నశించాలి.. అంటూ నినదించారు. ఈ అరుపులు, కేకల మధ్యనే 'స్కిల్ యూనివర్సిటీ బిల్లు'ను మంత్రి శ్రీధర్‌బాబు సభలో ప్రవేశపెట్టారు. బిల్లు సారాంశాన్ని మంత్రి వివరిస్తుండగా.. వివరణ అక్కర్లేదంటూ హరీశ్‌రావు, కేటీఆర్ లేచి నిలబడి, నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకొని.. 'సభ నడవాలని లేదా..? సభా మర్యాదను కాపాడాలని లేదా..?'అంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ సభ్యులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తు కోసం స్కిల్ వర్సిటీ బిల్లు పెడితే స్వాగతించకుండా నిరసనలేంటి? అని ఆక్షేపించారు. పదేళ్లు అధికారంలో ఉన్న వారు నిబంధనలకు విరుద్ధంగా సభలో నినాదాలు చేయడం తగదని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన మంచి పద్ధతి కాదని అన్నారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్‌ను ఉద్దేశించి.. బడే భాయ్, చోటా భాయ్ ఏక్ హోగయా అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినదించారు. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ ఇది పూర్తిగా కౌరవ సభగా మారిందని, అంతిమంగా పాండవులదే విజయమని అన్నారు. స్కిల్ వర్సిటీ ఏర్పాటుకు తమ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు.

సీఎం చాంబర్ వద్ద బైఠాయింపు

సభలో నిరసన తర్వాత కేటీఆర్ ఆధ్వర్యంలో హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, పద్మారావు, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్‌జాదవ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి సీఎం చాంబర్ వద్ద బైఠాయించారు. దీంతో మార్షల్స్.. వారందన్నీ మోసుకుంటూ వెలుపలకు తీసుకురాగా.. పోలీసులు అరెస్టు చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సీఎంగా రేవంత్ అన్‌ఫిట్ అని విమర్శించారు. కాగా, సీఎం చాంబర్ ఎదుట నిరసన వీడియో బయటకు రావడంపై సీరియస్ అయిన స్పీకర్.. సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నించినట్లు సమాచారం.

జిల్లాల్లో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

హైదరాబాద్ సిటీ: మహిళా ఎమ్మెల్యేలను సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారంటూ పలు చోట్ల బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్ నుంచి బజాజ్ ఎలక్ట్రానిక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నిజాం కళాశాల నుంచి అసెంబ్లీ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్వీ నాయకులను బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మియాపూర్ ప్రాంతాల్లో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు.. హనుమకొండలోని కాళోజీ జంక్షన్ వద్ద దాస్యం వినయభాస్కర్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి రాస్తారోకో చేశారు. ఎల్కతుర్తి, వేలేరు, పరకాలలోనూ నిరసనలు కొనసాగాయి.

దళిత బిడ్డను అధ్యక్షా అనలేకే..

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. దళితుల్ని మోసం చేసిన కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడాలంటే... అధ్యక్షా మైక్ ఇవ్వండంటూ అడ్డుక్కునే పరిస్థితికి తీసుకువచ్చామని పేర్కొన్నారు. కేసీఆర్‌కు రాజకీయ జీవితం ఇచ్చింది కాంగ్రెస్సేనని, వార్డు మెంబర్‌గా గెలవని హరీశ్ రావును మంత్రిని చేసిందని గుర్తు చేశారు. అలాంటి వారికి కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అసెంబ్లీలో స్కిల్ వర్సిటీ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్కలను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. సభలో అంశాల వారీగా మాట్లాడకుండా... అన్నీ కలగాపులగం చేస్తోందని మండిపడ్డారు. రైతు రుణ మాఫీ రెండో విడత నిధులు విడుదల చేస్తే... సభలో ఆ చర్చే జరగకుండా చేసిందని విమర్శించారు. "సబిత, సునీతా లక్ష్మారెడ్డిని నా సొంత అక్కలుగా భావించా. ఒక అక్క నడిబజారులో వదిలేసినా నేను ఏం అనలే. ఇంకో అక్క ఎన్నికల ప్రచారానికి వెళ్తే రెండు కేసులు అయినయి. ఈ రోజుకు కోర్టుల చుట్టు తిరుగుతున్నా. మరోవైపు.. ఆదివాసీ బిడ్డ సీతక్క గురించి అసభ్యంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఒక వీడియో పెట్టారు. ఆ మీమ్స్ చూస్తే.. అలా పెట్టిన వాళ్లను సబిత, సునీతలే చెప్పుతో కొడతారు. ఇదేనా నీతి.. ఇంత నీచ రాజకీయాలకు పాల్పడతారా? ఎవరి ఉచ్చులో పడి మీరు తప్పుదోవ పడుతున్నారో వాళ్ల సొంత చెల్లే తీహార్ జైల్లో ఉంది. మమ్మల్ని మాత్రం లోపలెయ్యద్దు.. అవసరమైతే మా చెల్లెల్ని మరో ఏడాది లోపల పెట్టండని బేరసారాలు చేసుకున్న నీచులు వాళ్లు. ఈ తమ్ముడ్ని నమ్ముకున్న అక్కలు మంత్రులై ముందు వరుసలో ఉన్నారు. ఆ దిక్కుమాలిన తమ్ముడ్ని నమ్ముకున్న అక్కల పరిస్థితి ఏవిటో అందరికీ తెలుసు" అని వ్యాఖ్యానించారు. అక్కల్ని అవమానించేంత నీచ సంస్కృతి తనది కాదని, చెల్లెలు జైల్లో ఉంటే రాజకీయాలకోసం బజారులో తిరిగే వాడ్ని కాదన్నారు. దొరకుట్రలో చిక్కుకున్న అక్కలు.. అక్కడ ఉండలేక, బయటకు రాలేక ఇబ్బంది పడుతున్నారని, మీరైనా దారి చూపాలని స్పీకర్‌ను కోరారు.

రాహుల్ కుట్టిన చెప్పు 10లక్షలు


» అయినా అమ్మని షాప్ యజమాని

సుల్తాన్‌పూర్, ఆగస్టు 1: కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కుట్టిన చెప్పుకు రూ.10 లక్షల ప్రతిపాదన వచ్చినప్పటికీ ఓ చెప్పులు కుట్టే వ్యక్తి దాన్ని అమ్మనని చెప్పాడు. అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యల కేసు విషయమై ఎంపీ- ఎమ్మెల్యే కోర్టులో హాజరయ్యేందుకు జూలై 26న ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ వెళ్లిన రాహుల్ గాంధీ అక్కడ ఓ చెప్పులు కుట్టే షాప్ వద్ద కాసేపు ఆగి దాని యజమానితో ముచ్చటించారు. అతని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అతని వద్ద ఓ చెప్పు తీసుకుని కుట్టారు. ఆ మరుసటి రోజు నుంచి తనకు చాలా మంది ఫోన్ చేసి రాహుల్ గాంధీ కుట్టిన చెప్పుని అమ్మమని అడిగారని, ఓ వ్యక్తి ఏకంగా రూ. 10 లక్షలకు కొంటానని చెప్పాడని షాప్ వ్యక్తి తెలియజేశాడు. అయినా తాను ఆ ప్రతిపాదనను ఒప్పుకోలేదని చెప్పాడు. రాహుల్ మాట్లాడి వెళ్లిన తర్వాత చాలా మంది ప్రభుత్వాధికారులు షాప్ వద్దకు వచ్చి తన సమస్యలను అడిగి తెలుసుకుని వెళ్లారని తెలిపాడు. రాహుల్ తన షాప్‌లో కూర్చుని చెప్పు కుట్టిన తర్వాత ఆయన తన భాగస్వామి అయ్యారని చెప్పాడు. ఆయన కుట్టిన చెప్పుని గ్లాస్ ఫ్రేమ్ చేయించి తన షాప్‌లో పెట్టుకుంటానని వెల్లడించాడు.

సివిల్ జడ్జీల కేసుల పరిధి కుదింపు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సివిల్ జడ్జిల న్యాయస్థానాల్లో విచారణకు స్వీకరించే కేసుల విలువను కుదిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శాసనసభలో 'తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ బిల్లు-2024'ను ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఆస్తి విలువ రూ.10 లక్షలలోపు ఉంటేనే జూనియర్ సివిల్ జడ్జిలు కేసుల విచారణ స్వీకరించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం 2020లో చట్ట సవరణ చేసి వివాదంలోని ఆస్తి విలువను రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచడంతో ఆయా కోర్టుల్లో కేసులు గణనీయంగా పెరిగాయి. దాంతో వివాదంలోని ఆస్తి విలువను రూ.10 లక్షలకు కుదించాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ప్రభుత్వానికి నివేదించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బిల్లు చట్టరూపం దాల్చితే జూనియర్ సివిల్ జడ్జి ఆస్తులు/భూముల విలువ రూ.10 లక్షల లోపు ఉంటేనే కేసులు విచారణకు స్వీకరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత సీనియర్ సివిల్ జడ్జిలు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలలోపు విలువ ఉన్న ఆస్తులు/భూముల కేసులే స్వీకరించాల్సి ఉంటుంది. ఇప్పటిదాకా వీరికి రూ.20-50లక్షల దాకా విలువ కలిగిన కేసులు స్వీకరించే అవకాశం ఉండేది. తాజా బిల్లుతో వీరి పరిధిని రూ.20 లక్షలకు కుదించారు.

లోకం తీరు



నా వెనకే ఉన్నావ్.. నిక్కి నిక్కి చూశావ్

» నాకు మంత్రి పదవి వచ్చినపుడు ఊరేగింపులో ఉన్నావ్

» నేను రాజీనామా చేసినప్పుడూ టీఆర్ఎస్‌లోనే ఉన్నావ్

» రేవంత్ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): "నాకు మంత్రి పదవి వచ్చినపుడు ఊరేగింపులో.. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ నేను మంత్రి పదవికి రాజీనామా చేసినప్పుడు కూడా టీఆర్ఎస్‌లోనే ఉన్నావ్. నా వెనకే ఉన్నావ్.. నిక్కినిక్కి చూశావ్" అని రేవంత్‌ను విమర్శిస్తూ.. అందుకు సంబంధించిన ఓ వీడియోను మాజీ మంత్రి హరీశ్ రావు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అప్పుడు ఇదంతా ఆయన కళ్లముందు జరిగిందని.. ఇవేమీ తెలియనట్లు రేవంత్‌రెడ్డి చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం హోదాలోనూ ఆయన హుందాగా ప్రవర్తించడం లేదని, చిల్లరగా మాట్లాడే చీఫ్ మినిస్టర్‌గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పదవులను త్యజించిన చరిత్ర తమదని తెలిపారు. తనకు మంత్రి పదవి ఎవరి భిక్షవల్లనో రాలేదని, సోనియాగాంధీ సూచన మేరకు అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరాం తప్ప.. పదవుల కోసం కాదని స్పష్టం చేశారు. పదవులు, విలువల గురించి మాట్లాడే హక్కు రేవంత్‌రెడ్డికి ఎక్కడిదని.. పదవుల కోసం పెదవులు మూసుకున్నది, పూటకో పార్టీ మారిన రాజకీయ చరిత్ర ఆయనదని హరీశ్‌రావు విమర్శించారు. కాగా, కొలువులను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నా సీఎంకు చీమ కుట్టినట్లైనా లేదని హరీశ్ రావు విమర్శించారు. చాయ్ తాగేలోపు జీవో ఇచ్చి మీ ముఖాల్లో సంతోషం చూడొచ్చు అంటూ ఎన్నికల సమయంలో రేవంత్ హామీ ఇచ్చిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా రేవంత్‌రెడ్డికి చాయ్ తాగే సమయం కూడా దొరకడం లేదా?" అని ప్రశ్నించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని సీతక్క చేసిన డిమాండ్ కూడా ఆ వీడియోలో ఉంది.

హోం మంత్రి లేకపోవడం వల్లే.. నేరాలు పెరిగాయి: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడిచినా రాష్ట్రానికి హోంశాఖ మంత్రి లేకపోవడం ఏంటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఇది నేరాలు పెరగడానికి కారణమవుతోందని అన్నారు. రాష్ట్రంలో ఇటీవల మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని కేటీఆర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. కేవలం 48 గంటల్లోనే సామూహిక అత్యాచారాలు, దాడులు సహా నాలుగు దారుణ ఘటనలు జరగడం సిగ్గుచేటన్నారు. శాలిగౌరారం, నిర్మల్, పుప్పాలగూడలో జరిగిన దారుణ ఘటనలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. దోషులను కఠినంగా శిక్షించాలని, మహిళల భద్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్‌బోర్డు భూములకు రుణాలు..!

» 1,800 డమ్మీ వ్యక్తులు, సంస్థలకు బంగారు రుణాలు

» సోదాల్లో కోటి నగదు, రూ.4.27 కోట్ల విలువైన ఆభరణాలు సీజ్


» ఏపీ మహేష్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కేసులో ఈడీ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన భూములతో పాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేటు భూములకు సంబంధించి నకిలీ పత్రాలతో ఏపీ మహేష్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రమోటర్లు భారీగా రుణాలు ఇచ్చారని, 10శాతం కమీషన్ తీసుకున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణలో తేలింది. నకిలీ పత్రాలు సృష్టించడం, నిబంధనలకు విరుద్ధంగా రూ.300 కోట్లకు పైగా రుణాల మంజూరు, బ్యాంకు నుంచి నిధులు దారిమళ్లించడంవంటి ఆరోపణలపై ఈడీ ప్రత్యేక బృందాలు హైదరాబాద్‌లో బుధవారం బ్యాంక్ వైస్‌చైర్మన్ పురుషోత్తమదాస్, ఎండీ ఉమేష్ చంద్ అస్వాతోపాటు మరికొందరి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా రూ.కోటి నగదు, రూ.4.27 కోట్ల విలువైన ఆభరణాలు, విదేశీ కరెన్సీ, ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు లాకరు తాళం చెవి, ఇతర కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు సీజ్ చేసినట్లు ఈడీ అధికారులు గురువారం వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.300 కోట్ల రుణాలు మంజూరు చేసి అవతలి వ్యక్తుల నుంచి 10శాతం కమీషన్ తీసుకున్నట్లు తేలిందన్నారు. రూ.18.30 కోట్లతో బ్యాంకు ప్రధాన కార్యాలయ భవన నిర్మాణం, తప్పుడు బిల్లులతో రూ.6.5 కోట్ల దారిమళ్లింపు, 1,800 మంది డమ్మీ వ్యక్తులు, సంస్థల పేరుతో బంగారు రుణాలు పంపిణీ చేసినట్లు విచారణలో తేలింది. ప్రధాన నిందితులు ఉమేష్ చంద్ అస్వా, పురుషోత్తమ దాస్, ఇతర నిందితులు, కేసుతో సంబంధం ఉన్న వారి ఇళ్లలో సోదాలు జరిపారు. కేసు విచారణ కొనసాగుతోందని హైదరాబాద్ ఈడీ జోనల్ అధికారులు తెలిపారు.

మధుర ఆలయం-మసీదు వివాదంలో.. హిందువుల పిటిషన్లు విచారణార్హమైనవే!

అలహాబాద్ హైకోర్టు స్పష్టీకరణ.. ముస్లిం పక్ష పిటిషన్ కొట్టివేత

ఉత్తరప్రదేశ్‌లోని మధురలో శ్రీకృష్ణ జన్మభూమి-షాహి ఈద్గా మసీదు వివాదానికి సంబంధించి హిందూ పక్షం దాఖలు చేసిన పిటిషన్లు విచారణార్హమైనవేనని అలహాబాద్ హైకోర్టు తేల్చిచెప్పింది. దాఖలైన 18 కేసుల్లో విచారణ ప్రారంభించవచ్చని తెలిపింది. మసీదు స్థానంలో శ్రీకృష్ణుడి ఆలయాన్ని పునరుద్ధరించాలంటూ వేసిన దావాలను కొట్టివేయాలంటూ ముస్లిం పక్షం దాఖలుచేసిన పిటిషన్‌ను గురువారం కొట్టివేసింది. ప్రార్థనా స్థలాల చట్టం సహా మరే చట్టమూ వారు పిటిషన్లు వేయకుండా నిషేధించడం లేదని న్యాయమూర్తి జస్టిస్ మయాంక్‌కుమార్ జైన్ తెలిపారు.



ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచే కోరుతున్నా: వెంకయ్య

ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో మరింత వెనుకబడిన కులాల వారికి కోటా కల్పించడానికి వీలుగా ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం. రిజర్వేషన్ల విధానంలో మరో ముందడుగు పడింది. ఎస్సీ, ఎస్టీ కులాల వారిలో మరింత అణగారిన వర్గాలకు రిజర్వేషన్ల ఫలాలు అందాలంటే ఉప వర్గీకరణ ఉండాలని శాసన సభ్యుడిగా ఉన్నప్పటి నుంచి కోరుతూనే ఉన్నా. వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్న మందకృష్ణకు అభినందనలు. ఆయన ఉద్యమ కల సాకారమైంది.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి: దండోరా

పార్లమెంటులో బిల్లు పెట్టి రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ హక్కుల దండోరా డిమాండ్ చేసింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో దండోరా జాతీయ, రాష్ట్ర అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ, కొంగరి శంకర్ మాదిగ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సుప్రీం తీర్పుతో మాదిగల బతుకుల్లో వెలుగులు వచ్చాయని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ అన్నారు. వర్గీకరణపై సుప్రీం తీర్పు వల్ల తెలంగాణ మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమంతోనే పేరు చివరన 'మాదిగ'!

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావం తోనే ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తుల పేరు చివరన 'మాదిగ' అనే పదం చేరింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పేరు అప్పటివరకు మంద కృష్ణగా ఉండేది. ఎమ్మార్పీఎస్ స్థాపించిన సమయంలో తన పేరును కృష్ణ మాదిగగా ప్రకటించుకున్నారు. అప్పటి నుంచి ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులతో పాటు ఆ సామాజిక వర్గానికి చెందినవారు చాలావరకు తమ పేరు చివరన 'మాదిగ' చేర్చుకున్నారు. దీనిని ఆత్మగౌరవంగా భావించారు. అప్పటి వరకు కొన్ని సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు మాత్రమే పేరు చివరన.. రెడ్డి, రావు అని కులం పేరు పెట్టుకునేవారు.



వర్గీకరణకు సై!

(మొదటిపేజీ తరువాయి)

చేకూరనుంది. వెనుకబాటుతనంపై పూర్తి కసరత్తు తర్వాతే వర్గీకరణ అమలు చేయాలని సుప్రీంకోర్టు 565 పేజీల సుదీర్ఘ తీర్పులో స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉప కులాల ప్రాతినిధ్యంపై, వెనుకబాటుతనంపై పూర్తి శాస్త్రీయమైన, గణాంక వివరాలతో సమాచారాన్ని సిద్ధం చేసుకున్న తర్వాతే వర్గీకరణ చేపట్టాలని తేల్చిచెప్పింది. అయితే, ఒక ఉప కులానికి నూటికి నూరు శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్రాలు ఇష్టారాజ్యంగా నిర్ణయం తీసుకోవడం కుదరదని స్పష్టం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాలు నిర్ణయాలు తీసుకోరాదని, అలాంటి నిర్ణయాలపై న్యాయ సమీక్ష జరుగుతుందని హెచ్చరించింది. అంతేకాకుండా, ఎస్సీ, ఎస్టీల్లో సంపన్నులను(క్రీమీలేయర్) గుర్తించి వారికి రిజర్వేషన్ వర్తించకుండా చూడాలని స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం 6-1 మెజారిటీతో తీర్పునిచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చేపట్టి, ఐదేళ్ల పాటు అమలు చేసిన ఎస్సీ వర్గీకరణను 2004లో సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమంటూ కొట్టేసింది. రాజ్యాంగంలోని 341 నిబంధన కింద రాష్ట్రపతి జారీ చేసిన ఎస్సీ కులాల జాబితాలోని కులాలన్నీ ఒకే వర్గమని, వాటిని వర్గీకరించడం కుదరదని చెన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో ఇరవై ఏళ్ల క్రితం తీర్పునిచ్చింది. ఆ తర్వాత వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన ఎస్సీ వర్గీకరణలను 2004 సుప్రీం తీర్పు ఆధారంగా హైకోర్టులు కొట్టేశాయి. హైకోర్టులిచ్చిన తీర్పులపై సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు అయ్యాయి. 2004 నాటి తీర్పును పునస్సమీక్షిస్తూ, ఇతర అప్పీళ్లను పరిష్కరిస్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం తాజాగా తీర్పునిచ్చింది. రాజ్యాంగ ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బేల ఎం.త్రివేదీ, జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది ఆరంభంలో మూడు రోజులపాటు వాదనలు విని, ఫిబ్రవరి 8న తీర్పును రిజర్వు చేశారు. గురువారం తీర్పును వెలువరించింది. న్యాయమూర్తి జస్టిస్ బేల ఎం.త్రివేదీ మాత్రం వర్గీకరణను వ్యతిరేకిస్తూ విడిగా తీర్పునిచ్చారు.

2004 తీర్పులో ఏం చెప్పారు?

ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.సంతోష్ హెగ్డే, జస్టిస్ ఎస్.ఎన్.వరియవా, జస్టిస్ బి.పి. సింగ్, జస్టిస్ హెచ్.కె. సీమా, జస్టిస్ ఎస్.బి.సిన్హాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341లో పేర్కొన్న కులాల జాబితాను రాష్ట్రాలు మార్చలేవని స్పష్టం చేశారు. రాష్ట్రపతి మాత్రమే ఆర్టికల్ 341 కింద ఏ రాష్ట్రానికైనా కొన్ని వర్గాలను షెడ్యూల్డు కులాలుగా నిర్ణయించగలరని, గవర్నర్‌తో సంప్రదించి ఆయా రాష్ట్రాలకు ఎస్సీల నోటిఫై చేయాలని తెలిపారు. 1997లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాదిగల ఉద్యమం ఊపందుకోవడంతో అప్పటి ప్రభుత్వం జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్‌ని నియమించి, ఆ కమిషన్ సిఫారసుల మేరకు షెడ్యూల్డు కులాలను ఏబీసీడీలుగా వర్గీకరిస్తూ 2000 సంవత్సరంలో చట్టం చేసింది. ఈ చట్టాన్ని ఏపీ హైకోర్టులో సవాలు చేసినపుడు ఈ చట్టం సరైనదే నంటూ ఏపీ హైకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం మెజారిటీ తీర్పును ప్రకటించింది. దాన్ని ఈవీ చిన్నయ్య సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో జస్టిస్ సంతోష్ హెగ్డే నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు తీర్పును కొట్టేసింది. దాంతో నాలుగేళ్లుగా మాదిగలు అనుభవిస్తున్న వర్గీకరణ ఫలాలకు తెరపడింది. ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా పంజాబ్, హర్యానా హైకోర్టు కూడా 2010లో పంజాబ్‌లో ఎస్సీ వర్గీకరణను కొట్టివేసింది. ఎస్సీ కోటాలో సగం ఖాళీలను వాల్మీకులు, మరుబీ సిక్కులకు కేటాయిస్తూ పంజాబ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టేసింది. దవీందర్ సింగ్ వర్సెస్ పంజాబ్ ప్రభుత్వం పేరుతో ఈ కేసు సుప్రీంకోర్టుకు వచ్చినపుడు 2020లో ఐదుగురు సభ్యుల ధర్మాసనం దాన్ని రాజ్యాంగ ధర్మాసనం పరిశీలించాలని సిఫార్సు చేసింది. ఉప వర్గీరకణ ఆమోద యోగ్యం కాదంటూ ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని ఈ ధర్మాసనం కోరింది. ఆ మేరకు జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపిన తర్వాత గురువారం తన నిర్ణయాన్ని ప్రకటించింది.


సుప్రీంతీర్పును ప్రభావితం చేసిన బాలగోపాల్ వ్యాసం

పంజాబ్ ప్రభుత్వం తరఫున వాదించిన ప్రముఖ న్యాయవాది కపిల్ సిబాల్ తన వాదనలో 2005లో ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రముఖ తెలుగు రచయిత, మేధావి బాలగోపాల్ వ్యాసాన్ని విస్తృతంగా ఉటంకించారు. న్యాయ కోవిదుడైన బాలగోపాల్ ఆర్టికల్ 341కు వర్గీకరణ ఏ విధంగా విరుద్ధం కాదో స్పష్టంగా వివరించారని కపిల్ సిబాల్ వాదించారు. ఉప వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం కాదని బాలగోపాల్ చేసిన వాదనను ఉటంకిస్తూ ఆయన బాలగోపాల్ రాసిన వ్యాసాన్ని తన పిటిషన్‌కు అనుబంధంగా చేర్చారు. స్వజాతి వర్గమైన షెడ్యూల్డు కులాలను విభజించే అధికారం రాజ్యాంగంలోని 341 కింద శాసనసభకు లేదు అన్నపుడు ఆ అధికారం పార్లమెంటుకు మాత్రం ఎందుకు ఉంటుందని బాలగోపాల్ 'దళితుల్లో దళితులకు న్యాయం' అన్న పేరుతో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. ఈవీ చిన్నయ్య కేసులో జస్టిస్ సంతోష్ హెగ్డే బెంచ్ ఇచ్చిన తీర్పు సామాజిక వాస్తవికతలకు దూరంగా ఉన్నదని బాలగోపాల్ విమర్శించారు. విద్య, సామాజిక సంక్షేమం, ఉపాధి కల్పనకు సంబంధించి రాష్ట్రాలకు అధికారాలు ఉన్నపుడు షెడ్యూల్డు కులాల్లో ఒక ఉప కులానికి జరుగుతున్న అన్యాయాన్ని అవి ఎందుకు సరి చేయలేవని ఆయన ప్రశ్నించారు. మాదిగలకు చిరకాలంగా జరుగుతున్న అన్యాయాన్ని వివరించిన బాలగోపాల్ రాజ్యాంగాన్ని స్వేచ్ఛగా, విశాలంగా మారుతున్న కాలం, సామాజిక అవసరాలకు అనుగుణంగా అన్వయింప చేయాలని అభిప్రాయ పడ్డారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మాటలను జస్టిస్ సంతోష్ హెగ్డే ధర్మాసనం ఎలా తప్పుగా అన్వయించిందో ఆయన వివరించారు.

వర్గీకరణ రాజ్యాంగ ఉల్లంఘన కాదు: జస్టిస్ చంద్రచూడ్



చారిత్రక ఆధారాలు పరిశీలిస్తే ఎస్సీ వర్గంలో ఉన్న వారంతా నిజానికి ఒకే వర్గం కాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ జస్టిస్ మిశ్రాతో కలిసి స్వయంగా రాసిన తీర్పులో పేర్కొన్నారు. కులాలను వర్గీకరించడం రాజ్యాంగంలోని 14వ అధికరణలో పేర్కొన్న సమానత్వ హక్కును ఉల్లంఘించినట్లు కాదని చెప్పారు. ఎస్సీ కులాల్లో కొత్తగా ఏదైనా కులాన్ని చేర్చే హక్కు పార్లమెంటుకు ఉంటుందని చెప్పే ఆర్టికల్ 341(2)కు ఎస్సీ కులాల వర్గీకరణ విరుద్ధం కాదని అన్నారు. రాష్ట్రాలకు ఆర్టికల్ 15(వివక్ష లేని), ఆర్టికల్ 16(సమాన అవకాశాలు) కింద ఆయా వర్గాల వెనుకబాటుతనాన్ని గుర్తించి రిజర్వేషన్లను కల్పించే అధికారం ఉందన్నారు. ఆర్టికల్ 341లో పేర్కొన్న కులాలను వేరు చేసి చూడటానికి హేతుబద్ధమైన సూత్రం ఉన్నపుడు, ఆ సూత్రం వర్గీకరణ లక్ష్యంతో సంబంధం కలిగి ఉన్నపుడు వర్గీకరణ చేపట్టవచ్చని చెప్పారు. నిజమైన సమానత్వాన్ని సాధించడానికి ఉప వర్గీకరణ మార్గం అయినపుడు వర్గీకరణ రాజ్యాంగ బద్ధమే అవుతుందన్నారు. లభిస్తున్న డేటాను బట్టి చూస్తే ఎస్సీ కులాల మధ్య కూడా అసమానతలు ఉన్నాయని, ఆ కులాలు వర్గంగా అవతరించిన ఒకేరకమైన కులాలు కాదని చెప్పారు. ఎస్సీ కులాలను ఆర్టికల్ 341 ద్వారా కలిపినంత మాత్రాన విభజించడం కుదరనంత ఏకరూప వర్గంగా అవి ఏర్పడవని అన్నారు. కేవలం చట్టపరంగా ఇతర కులాలతో వేరు చేసి చూపడమనే పరిమిత లక్ష్యంతోనే ఎస్సీ కులాలను ఆర్టికల్ 341 రూపంలో ఒకచోట కలిపారని వివరించారు. వెనుకబాటుతనం, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం విషయంలో గణించదగ్గ, విశ్వసనీయమైన సమాచారం ఆధారంగానే వర్గీకరణ చేయవచ్చని చెప్పారు. ఇప్పటికే ఎస్సీ కులాల జాబితాలో ఉన్న ఏ కులానికైనా ఎస్సీ కులాలకు వర్తించే లబ్ధి చేకూరకుండా వర్గీకరణ చేపడితే రాజ్యాంగ విరుద్ధం అవుతుందని స్పష్టం చేశారు. బాగా వెనుకబడిన కులాలకు అధిక ప్రాధాన్యం లభించేట్లు చూడాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలదేనని జస్టిస్ గవాయ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీల్లో కొంతమంది వ్యక్తులే రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. వందల ఏళ్ల అణచివేతను ఎదుర్కొన్న ఎస్సీ, ఎస్టీ కులాల్లోనూ అంతరాలు ఉన్నాయని, క్షేత్ర స్థాయిలో కనిపిస్తున్న వాస్తవాలను కాదనలేమని చెప్పారు. రిజర్వేషన్లకు రాజ్యాంగంలోని 341 అధికరణే ప్రాతిపదిక అని ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీంకోర్టు భావించడమే మౌలిక లోపమని జస్టిస్ గవాయి వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ల కోసం కులాలను గుర్తించే పని మాత్రమే ఆర్టికల్ 341 చేస్తుందని చెప్పారు. ఒక పెద్ద వర్గంలో భాగమైన మరో ఉపవర్గం వివక్షను ఎదుర్కొంటున్నందుకే ఉప వర్గీకరణ చేయాల్సి వస్తోందని తెలిపారు.



లేని అధికారాన్ని కట్టబెడుతున్నారు: జస్టిస్ త్రివేదీ



రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం రాష్ట్రపతి జారీ చేసిన కులాల జాబితాను మార్చడానికి వీల్లేదని జస్టిస్ బేల ఎం.త్రివేదీ విడిగా ఇచ్చిన తన అసమ్మతి తీర్పులో పేర్కొన్నారు. పార్లమెంటు చట్టం ద్వారా అందులో కులాలను చేర్చడం, తీసివేయడానికి మాత్రమే అధికారం ఉందని చెప్పారు. వర్గీకరణ చేయడమంటే రాష్ట్రపతి జాబితాకు మార్పులు చేర్పులు చేయడమేనని అన్నారు. ఎస్సీ, ఎస్టీల జాబితాను రాజకీయ కారణాలతో ఇష్టం వచ్చినట్లు మార్చకుండా చూడటానికే రాజ్యాంగంలో 341 నిబంధనను చేర్చారని చెప్పారు. అధికరణానికి స్పష్టమైన అర్థం ఉన్నపుడు దాన్నే తీసుకోవాలని సూచించారు. రాష్ట్రపతి జాబితాలో ఉన్న ఒక వర్గంలో ఉప వర్గానికి అధిక ప్రాధాన్యమిచ్చినపుడు అదే వర్గంలోని ఇతర కులాలకు అన్యాయం జరుగుతుందని జస్టిస్ బేల ఎం.త్రివేదీ వ్యాఖ్యానించారు. అందరు ఎస్సీలకు వర్తించే రిజర్వేషన్ ఫలాలను కొన్ని ఉప కులాలకు కేటాయించే అధికారం రాష్ట్రాలకు లేదని చెప్పారు. రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి కార్యనిర్వాహక, చట్టపరమైన అధికారాలు రాష్ట్ర ప్రభుత్వాలకు లేవన్నారు. అలా చేసేందుకు రాష్ట్రాలను అనుమతించడం.. లేని అధికారాన్ని కట్టబెట్టడం అవుతుందని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీల్లోనూ క్రీమీలేయర్: జస్టిస్ గవాయ్



సకారాత్మక కార్యాచరణలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన రిజర్వేషన్ల ప్రయోజనాల నుంచి సంపన్నులను తప్పించాలని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. నిజమైన సమానత్వం సాధనకు అదే మార్గమని చెప్పారు. వర్గీకరణ చేసే క్రమంలో క్రీమీలేయర్ వాళ్లను తప్పించినపుడే నిజమైన సమానత్వం జరుగుతుందని, క్రీమీలేయర్‌లను గుర్తించేందుకు ప్రభుత్వం ఒక విధానం ఏర్పర్చుకోవాలని సూచించారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఓబీసీలకు వర్తింపజేస్తున్న క్రీమీలేయర్ ఎస్సీలకూ వర్తింపజేయాలన్నారు. రిజర్వేషన్లు ఒక తరానికి మాత్రమే వర్తింపజేయాలని జస్టిస్ పంకజ్ మిథాల్ సూచించారు. మొదటితరం రిజర్వేషన్లతో ఉన్నత స్థానాన్ని అందుకుంటే తర్వాతి తరానికి రిజర్వేషన్లు వర్తింపజేయొద్దని చెప్పారు. జస్టిస్ సతీశ్ చంద్ర కూడా క్రీమీలేయర్‌ను సమర్థించారు.

మోదీ మద్దతే కీలక మలుపు

పరేడ్ గ్రౌండ్స్ సభలో ప్రధాని కీలక ప్రకటనే టర్నింగ్ పాయింట్

ఆ తర్వాతే న్యాయపరమైన చిక్కులు తొలగింపునకు కమిటీ వేసిన కేంద్రం

మాదిగలు ఇక మా వైపే.. కమలనాథుల్లో ధీమా

స్పందనపై మాత్రం వ్యూహాత్మక మౌనం.. మాలలు దూరమవుతారనేనా?

హైదరాబాద్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పట్ల బీజేపీలో జోష్ వ్యక్తమవుతోంది. వర్గీకరణ అంశాన్ని తాము ఎన్నికల కోణంలో కాకుండా సామాజిక కోణంలోనే చూశామని, ఫలితంగా ముమ్ముందు మాదిగ సామాజికవర్గం తమకు అండగా ఉంటుందని భావిస్తోంది. సుదీర్ఘకాలం కొనసాగిన వర్గీకరణ ఉద్యమంలో తమ పార్టీది కీలక పాత్ర అని పార్టీ ముఖ్యనేతలు పేర్కొంటున్నారు. వర్గీకరణకు ఇతర పార్టీలు కూడా మద్దతిచ్చినా ప్రధాని మోదీ ప్రత్యేక చొరవ తీసుకోవడమే కీలక మలుపు అని బీజేపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా, రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ, తొలుత ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణతో పాటు మరికొందరు ముఖ్యులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వర్గీకరణకు మద్దతుపై విస్పష్ట హామీ ఇచ్చారు. ఆ తర్వాత నవంబరు 9న మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పరేడ్‌గ్రౌండ్సులో నిర్వహించిన మాదిగల విశ్వరూప మహాసభకు మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్గీకరణ అంశానికి సంబంధించి న్యాయపరంగా ఎదురయ్యే చిక్కులు తొలగించేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేస్తామని కీలక ప్రకటన చేశారు. ఈ మేరకు కేంద్రం, గత జనవరి 19న ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఈ నిర్ణయంతో న్యాయపరంగా ప్రక్రియ వేగవంతమైంది. వర్గీకరణపై కేంద్రం కమిటీ ద్వారా తన వైఖరిని స్పష్టంగా సుప్రీంకు నివేదించింది. ఫలితంగా సామాజిక న్యాయానికి పార్టీ కట్టుబడి ఉంటామంటూ తాను ఇచ్చిన మాటను మోదీ నిలబెట్టుకున్నట్లయిందని పార్టీ ముఖ్యనేత ఒకరు వివరించారు. నాలుగు దశాబ్దాల కిందట మండల్ కమిషన్‌తో బీసీల్లో సామాజిక, రాజకీయ చైతన్యం వచ్చింది.. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణతో చిట్టచివరి దళితుడికి న్యాయం లభిస్తుందని బీజేపీ నేతలు భావిస్తున్నారు. దళితుల్లో దాదాపు 60 శాతం మాదిగలు ఉన్నట్లు అంచనా వేస్తున్న కమలనాథులు, వారంతా తమకే మద్దతిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 1997లో వరంగల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో బంగారు లక్ష్మణ్ నాయకత్వంలో, వి. రామారావులు చొరవ తీసుకుని అందరికీ సమన్యాయం అన్న అంశంపై తీర్మానం చేశారని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. అయితే ఎస్సీ వర్గీకరణపై తమ వాదనకు అనుకూలంగా సుప్రీం తీర్పు వచ్చినా, బీజేపీ అధికారికంగా ఎలాంటి స్పందనా వెల్లడించలేదు. ఇది వ్యూహాత్మకం అని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకే రాష్ట్రపార్టీ ముఖ్యనేతలు ఎవరూ స్పందించలేదని సమాచారం. మాదిగలకు న్యాయం చేసే సమయంలో మాలలు దూరం కావొద్దన్న అభిప్రాయంతో జాతీయ నాయకత్వం ఉంది. అందుకే ఆచీతూచి స్పందించాలని నిర్ణయించినట్లు పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం తీర్పు చారిత్రాత్మకమైందని బీజేపీ సీనియర్ నేత మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి తెలిపారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఊరూవాడా దండోరా!

30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమంలో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. గాంధీభవన్ ముట్టడిలో ఎమ్మార్పీఎస్‌కు చెందిన నలుగురు నాయకులు అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడగా... వారిలో ముగ్గురు మరణించారు.

23,560 పోలీసు కేసులు నమోదయ్యాయి. ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మూడుసార్లు ఏకగ్రీవ తీర్మానాలు జరిగాయి.

వర్గీకరణకు సభలు, యాత్రలు, దీక్షలతో మంద కృష్ణ పోరాటం

చంద్రబాబు హయాంలో నాలుగేళ్ల ఫలాలు

సాంకేతిక కారణాలతో జీవోను నిలిపిన సుప్రీంకోర్టు

పార్లమెంటులో సవరణ బిల్లుకోసం ఎమ్మార్పీఎస్ పోరు

ఇన్నేళ్లకు రాష్ట్రాలకే అధికారమిచ్చిన సుప్రీం కోర్టు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మూడు దశాబ్దాలకుపైగా అలుపెరగని ఉద్యమం! అనేక బలిదానాలు... వేలాది కేసులు! భారీ బహిరంగ సభలు! నిరాహార దీక్షలు... చైతన్య యాత్రలు! ఏళ్లు గడుస్తున్నా వెనుకడుగు వేసిందే లేదు! గమ్యం చేరేదాకా తగ్గేదే లేదు. ఇది.. ఎమ్మార్పీఎస్ 'వర్గీకరణ' ఉద్యమం సాగిన తీరు. మాదిగలకు రిజర్వేషన్ ప్రస్తావన వస్తే గుర్తుకొచ్చేది.. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్), దండోరా ఉద్యమం, మంద కృష్ణ మాదిగ! షెడ్యూల్డ్ కులాల జాబితాల్లో ఉన్న వారందరికీ సమానంగా రిజర్వేషన్ ఫలాలు అందించడానికి వర్గీకరణ సిద్ధాంతంతో ఇది ఆవిర్భవించింది. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు 'దండోరా' పేరుతో ఉద్యమాన్ని కొనసాగించారు. ఎమ్మార్పీఎస్ మొదటి సమావేశం 1995 మే 31న ఒంగోలులో జరిగింది. ఉద్యోగ, విద్యార్థి, యువసేన, మహిళా సమాఖ్య వంటి విభాగాలను ఏర్పాటుచేసి శక్తిమంతమైన సంస్థగా ఎదిగింది.

చలో హైదరాబాద్..

1996 మార్చి 2న హైదరాబాద్ నిజాం కళాశాల మైదానంలో మందకృష్ణ నేతృత్వంలో సుమారు 5 లక్షల మంది మాదిగలతో తొలి రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. వర్గీకరణ పోరాటంలో ఇదో కీలక ఘట్టం. మార్చి 25న నిజాం కళాశాలలోని జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద 80 వేల మంది మాదిగలతో ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ర్యాలీ అనంతరం సమావేశానికి అప్పటి సీఎం చంద్రబాబు, మాదిగ మంత్రులు హాజరయ్యారు. వర్గీకరణకు చంద్రబాబు హామీ ఇచ్చారు. 1996 సెప్టెంబరు 2న ఇందిరా పార్క్ నుంచి బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వరకు జరిగిన భారీ ర్యాలీలో 2 లక్షల మందికి పైగా మాదిగలు పాల్గొన్నారు. టీడీపీకి చెందిన మాదిగ ఎమ్మెల్యేల బృందాన్ని పంపి... మాదిగలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాత్రి 10 గంటలకు స్వయంగా జోక్యం చేసుకుని 45 రోజుల్లోగా విచారణ జరిపి వర్గీకరణ చేస్తామని ప్రకటించారు. కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కాగా, వర్గీకరణకు మద్దతుగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు మంద కృష్ణ మహా పాదయాత్ర (లాంగ్‌మార్చ్)లు నిర్వహించారు. చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లి నుంచి హైదరాబాద్‌లోని ఆయన అధికారిక నివాసం వరకు 1052 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అదే సమయంలో కమిషన్ నివేదికను సమర్పించింది. 1997లో హైదరాబాద్‌లో మహాపాదయాత్ర ముగిసినప్పుడు ప్రభుత్వం తమ డిమాండ్‌ను అంగీకరించే వరకు వెళ్లేది లేదని దండోరా నాయకులు భీష్మించారు. అయితే, కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీగా వర్గీకరిసూ టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.




న్యాయ స్థానాల్లో...

వర్గీకరణ జీవోను సవాల్ చేస్తూ మాల మహానాడు హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. సాంకేతిక కారణాలతో జీవోను కోర్టు సస్పెండ్ చేసింది. సాంకేతిక సమస్యలను సరిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఎస్సీ/ఎస్టీ కమిషన్‌ను సంప్రదించి మొత్తం సమాచారాన్ని సమర్పించింది. 1998 అక్టోబరు 1న ప్రభుత్వం వర్గీకరణపై ఆర్డినెన్స్ ఇవ్వాలని నిర్ణయించింది. మంత్రివర్గం అంగీకరించి గవర్నర్‌కు పంపారు. గవర్నర్ దానిని రాష్ట్రపతి అభిప్రాయానికి పంపారు. 1999 నవంబరు 30న రాష్ట్రపతి వర్గీకరణకు ఆర్డినెన్స్ జారీకి అనుమతించారు. 1999 డిసెంబరు 9న గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2000 ఏప్రిల్ 1న జీవో ఇచ్చింది. కానీ, మాల మహానాడు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వర్గీకరణ అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందంటూ 2004 నవంబరు 5న వర్గీకరణ జీవోను కొట్టివేసింది. ఈ నాలుగేళ్ల కాలంలో మాదిగలు వర్గీకరణ ఫలాలను అనుభవించారు.

వైఎస్ హయాంలో...

2004 నవంబరు 16న కడప జిల్లాలోని వైఎస్ జన్మస్థలం బలపనూరు నుంచి 'చైతన్య యాత్ర' ప్రారంభించిన మంద కృష్ణ జీపులో రాష్ట్రమంతా పర్యటించారు. ప్రభుత్వం 2004 డిసెంబరు 10న ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. అయినా వర్గీకరణ కల నెరవేరలేదు. బెంగళూరు నుంచి హైదరాబాద్ వరకు 'మాదిగల ధర్మ యుద్ధ మహా పాదయాత్ర', అమలాపురం నుంచి హైదరాబాద్‌కు 'తిరుగుబాటు మహాపాదయాత్ర'లు చేశారు. యాత్ర ముగింపు రోజున ఇందిరా పార్కు వద్దకు వేలాదిగా మాదిగలు తరలివచ్చారు. రాజ్యాంగ సవరణకు 24 గంటల గడువిచ్చి ధర్నా ప్రారంభించారు. వైఎస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ప్రకటించింది. 2007 మే 17న లక్షలాదిమందితో విజయవాడ సింగ్‌నగర్ స్టేడియంలో విశ్వరూప మహాసభ నిర్వహించారు. వర్గీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం కమిషన్‌కు చైర్మన్లను నియమించినా వారెవరూ బాధ్యతలు స్వీకరించలేదు. ఈ జాప్యాన్ని నివారించేందుకు మందకృష్ణ మాదిగ 2007 మే 17న సీఎం నివాసాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు. పోలీసులు ఆయనను అరెస్టు చేసి గాంధీ ఆసుపత్రికి తరలించారు. దీంతో సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండిలో ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటం, ఉద్యమ తాకిడికి తట్టుకోలేని వైఎస్ సర్కార్ కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి 2007 మే 21న ఉషా మెహ్రాను చైర్మన్‌గా నియమించేలా చూసింది. ఆమె నివేదిక సిద్ధం చేసినా సమర్పణలో జాప్యం జరిగింది. దీనిపై ఎమ్ఆర్‌పీఎస్ మరోసారి ఉద్యమం చేసింది. జస్టిస్ ఉషా మెహ్రా 2008 మే 1న నివేదికను సమర్పించారు. డిసెంబరు 14న మంద కృష్ణ నిరాహార దీక్ష ప్రారంభించి వర్గీకరణ బిల్లును పార్లమెంటులో పెట్టినప్పుడే విరమిస్తానని చెప్పారు. కాగా, జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ వర్గీకరణను సమర్థించినా తదుపరి చర్యలు తీసుకోకపోవడంతో 2009 ఫిబ్రవరి 16న విశ్వరూప మహా సభను నిర్వహించారు. ఫిబ్రవరిన 4న అసెంబ్లీని ముట్టడించారు. పార్లమెంటులో సవరణ బిల్లు ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో 2010 డిసెంబరు 4న నిజాం కళాశాలలో యుద్ధభేరి నిర్వహించారు. ఆ తర్వాత కృష్ణ వర్గీకరణపై రాజ్యాంగ సవరణపై హామీ ఇవ్వాలంటూ ఆమరణ దీక్ష చేపట్టారు. అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హామీ మేరకు విరవింపచారు.

వర్గీకరణ కోసం అనంతవాసి తొలి ఆత్మార్పణం



తాడిపత్రి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ కోసం ఉమ్మడి రాష్ట్రంలో ప్రాణత్యాగం చేసిన తొలి వ్యక్తి తెల్లబండ్ల రవి. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఈయన డిగ్రీ చదివారు. ఉద్యోగం రాకపోవడంతో గ్రామంలోనే వ్యవసాయ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవారు. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే తనలాంటి వారికి న్యాయం జరుగుతుందని నమ్మేవారు. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్‌లో చేరి.. 1994 నుంచి ఉద్యమంలో పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 1998లో హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆమరణ దీక్షకు దిగారు. ఆయనకు మద్దతుగా ఆ ఏడాది జూన్ 9న తెల్లబండ్ల రవి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నారు. రవి శరీరం బాగా కాలింది. ఆయన్ను హైదరాబాద్ అపోలో ఆస్పత్రికి తరలించారు. ఐదు రోజులు మృత్యువుతో పోరాడి జూన్ 14న రవి తుది శ్వాస విడిచారు. ఆయన ప్రాణత్యాగానికి గుర్తుగా యర్రగుంటపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు స్థూపం నిర్మించారు.


ప్రకాశంలో పుట్టిన మాదిగ దండోరా.!

హైదరాబాద్ సిటీ - ఆంధ్రజ్యోతి : మాదిగ దండోరా (ఎమ్మార్పీఎస్ ఉద్యమం) పుట్టింది ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మారుమూల గ్రామం ఈదుముడిలో..! అదివరకే ఆ ఊరిలో సామాజిక స్పృహ కలిగిన మాదిగ యువకులు చెరువు నీళ్ల కోసం, భూపంపకాల్లో సమన్యాయం కోసం పోరాడిన సందర్భాలున్నాయి. వారిలో కొమ్మూరి విజయకుమార్ ఒకరు. కారంచేడు దుర్మార్గాన్ని నిరసిస్తూ పురుడుపోసుకొన్న 'దళిత మహాసభ'లో జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న సమయంలో మాదిగలను తగిన ప్రాధాన్యత లభించడం లేదంటూ నాయకత్వాన్ని విజయకుమార్ ప్రశ్నించారు. ఆ తర్వాత ఒంగోలు వేదికగా జరిగిన 'శక్తి ప్రదర్శన' సమావేశంలో విజయకుమార్‌ను దళిత మహాసభ నాయకులు వేదిక మీదకు ఆహ్వానించకుండా అవమానించారని ఒంగోలుకు చెందిన సామాజికవేత్త కత్తి కల్యాణ్ వివరించారు. అదే సభలో పాల్గొనడానికి వచ్చిన మంద కృష్ణను కలిసిన విజయకుమార్.. విద్య, ఉద్యోగ అంశాలలో మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై సుదీర్ఘంగా చర్చించారు. జనాభాలో ఎక్కువగా ఉన్న మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు అందడంలో తలెత్తుతున్న నష్టాన్ని వివరించారు. అప్పుడప్పుడే ప్రారంభమైన కాపు రిజర్వేషన్ పోరాట సమితి స్ఫూర్తితో మరో 13 మంది స్థానిక మాదిగ యువతతో కలిసిన మంద కృష్ణ.. 1994, జూలై 7న ఈదుముడిలో ఎమ్మార్పీఎస్‌ను స్థాపించారు.

ఎస్సీ వర్గీకరణపై.. తొలి అడుగు మాదే

సామాజిక న్యాయం కోసమే నాడు ఏ, బీ, సీ, డీ నిర్ణయం

అది సరైనదేనని ఇప్పుడు సుప్రీం తేల్చింది: చంద్రబాబు



అమరావతి/అనంతపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. దీనిపై ముందడుగు వేసింది టీడీపీయేనని గుర్తుచేశారు. గురువారం శ్రీశైలం సున్నిపెంటలో, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం గుండుమలలో జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. 'ఎక్స్' వేదికగానూ స్పందించారు. 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ వేసి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణపై టీడీపీయే ముందడుగు వేసిందని గుర్తుచేశారు. "సామాజిక న్యాయం కోసం ఎస్సీ వర్గీకరణకు ఏ, బీ, సీ, డీ కేటగిరీ నిర్ణయం తీసుకున్నాం. మా నిర్ణయం సరైనదేనని, న్యాయమైనదని, చట్టబద్ధత ఉందని సుప్రీంకోర్టు ఇప్పుడు తీర్పు ఇచ్చింది. అన్ని కులాలు, అన్ని మతాలు, అన్ని ప్రాంతాలకు న్యాయం జరగాల్సి ఉంది. ఎస్సీ వర్గీకరణను ప్రధాని మోదీ కూడా ఆమోదించారు. ఇది శుభ పరిణామం. ఎవరికీ అన్యాయం జరుగకుండా అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం. అన్ని వర్గాలకు న్యాయం జరగాలి.. సామాజిక న్యాయం గెలవాలన్నదే టీడీపీ సిద్ధాంతం. అత్యంత నిరుపేదలకు ఫలాలు అందించడానికి వర్గీకరణ ఉపయోగపడుతుంది. దళితులు ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలి. ఆర్థికంగా, సామాజికంగా వారి జీవితాల్లో వెలుగులు రావాలి" అని ఆయన ఆకాంక్షించారు.

వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం:కిషన్‌రెడ్డి



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కేంద్ర ప్రభుత్వం, బీజేపీ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ స్వయంగా హైదరాబాద్ వచ్చి ఎస్సీ వర్గీకరణ గురించి ప్రకటన చేశారని గుర్తుచేశారు. సుప్రీం కోర్టు తీర్పు తర్వాత ఢిల్లీలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు చాలా సంతోషకరమని అన్నారు. సుప్రీం తీర్పును అన్ని వర్గాల ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనదని తమిళనాడు సీఎం స్టాలిన్ హర్షం వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పును తమ ప్రభుత్వం వెంటనే అమలు చేస్తుందని అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఒక వర్గం సాగించిన నిరంతర పోరాటానికి దక్కిన ఫలితమని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విజ్ఞప్తి చేశారు. వర్గీకరణపై దశాబ్దాలుగా నెలకొన్న వివాదాన్ని సుప్రీంకోర్టు పరిష్కరించడం శుభ పరిణామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు.

సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తున్నాం: హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును వ్యతిరేకిస్తున్నామని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ చెప్పారు. రాజమహేంద్రవరంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు కాని ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు ధర్మాసనం ఎలా సమర్థిస్తుందని ప్రశ్నించారు. రాజ్యాంగానికి అతీతంగా ఎస్సీలపై జరుగుతున్న కుట్రకు వ్యతిరేకంగా 3న అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

ధర్మమే గెలిచింది..

30 ఏళ్ల ఉద్యమంలో అమరులైన మాదిగ బిడ్డలకు అంకితం

- వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దు
- చంద్రబాబు చేసిన చట్టాన్నే అత్యున్నత కోర్టు సమర్థించింది..
- త్వరలోనే ఒకే వేదికపై విజయోత్సవ సభ
- 'ఆంధ్రజ్యోతి'తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ



న్యూఢిల్లీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం అకుంఠిత దీక్షతో పోరాడామని, ఈ ప్రయాణంలో ఎందరినో కోల్పోయామని, చివరికి ధర్మమే గెలిచిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఏపీ, తెలంగాణలో వర్గీకరణను వెంటనే చేపడతారనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేదాక ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని కోరారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లను అవసరం మేరకు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. తీర్పు తర్వాత సుప్రీంకోర్టు నుంచి బయటకు వచ్చిన మందకృష్ణ ఉద్వేగంతో కంటతడి పెట్టారు. ఆయన వెంట పెద్ద సంఖ్యలో వచ్చిన కార్యకర్తలు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మందకృష్ణ మాట్లాడారు. "న్యాయం, ధర్మం కోసం చేసిన పోరాటం గెలిచింది. 29 ఏళ్ల వయసులో ఉద్యమం ప్రారంభించా. ఒక జాతికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు 30 ఏళ్లు ఎంతో తపించాం. మమ్మల్ని దెబ్బతీసేందుకు ఎన్నో కుట్రలు జరిగాయి. పలుకుబడి ఉన్న స్వార్థపరులు వెన్నుపోటు పొడిచే ప్రయత్నం చేశారు. అయినా, మేం సహనం కోల్పోలేదు. ఇవాళ విజయం సాధించాం. పోరాటంలో ప్రాణాలొదిలిన మాదిగ బిడ్డలకు దీనిని అంకితం చేస్తున్నాం" అని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీ సీఎంగా ఉండగా ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకొచ్చింది చంద్రబాబు అని మంద కృష్ణ గుర్తు చేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అనివార్యం

ఎస్సీ వర్గీకరణను తెలంగాణలో అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అనివార్యమని మంద కృష్ణ తెలిపారు. "వర్గీకరణకు అనుకూలమని, సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలు అనేకసార్లు చెప్పారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిని ఏర్పాటు చేశామని తెలిపారు. కర్ణాటకలోనూ వర్గీకరణ అమలు చేస్తారనే నమ్మకం ఉంది. దేశంలో రిజర్వేషన్ల చట్టం రెండో అడుగు వేయబోతోంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చాక ఉమ్మడి రిజర్వేషన్ల విధానమే ఉంది. కొన్ని కులాలకే రిజర్వేషన్లు మళ్లీమళ్లీ దక్కాయి. ఇకపై మాత్రం ఆ ఫలాలు అన్ని వర్గాలు, వ్యక్తులు, కుటుంబాలకు అందుతాయి. రాజ్యాంగంలో అంబేడ్కర్ రిజర్వేషన్లు పొందుపరిచారు. వాటిని ముందుకు నడిపే ప్రక్రియను ఎమ్మార్పీఎస్ భుజానికెత్తుకుంది" అని అన్నారు. పదేళ్లకోసారి ఎస్సీ, ఎస్టీ జనాభా లెక్కలు ప్రభుత్వాల దగ్గర సిద్ధంగా ఉంటాయని.. కొత్తగా లెక్కలు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్రాలు వర్గీకరణను చేపట్టాలని మంద కృష్ణ డిమాండ్ చేశారు. ఇప్పుడు అమలు చేయకుంటే సుప్రీం కోర్టు తీర్పునకు అన్యాయం చేసినట్టేనని వ్యాఖ్యానించారు. ఒకటి, రెండ్రోజులు ఢిల్లీలోనే ఉండి పెద్దలను కలిసి కృతజ్ఞతలు చెబుతానని మంద కృష్ణ వివరించారు. "హైదరాబాద్ వెళ్లాక అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి తేదీని ప్రకటించి విజయోత్సవ సభ, సహకరించిన వారికి అభినందన సభ నిర్వహిస్తాం. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను హైదరాబాద్‌కు తీసుకురావడంలో, వర్గీకరణను ముందుకు తీసుకెళ్లడానికి కమిటీ ఏర్పాటులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎంతో చొరవ చూపారు. వారందరినీ కలుస్తా. విజయోత్సవ, అభినందన సభలకు రావాలని కోరుతా" అని మందకృష్ణ తెలిపారు.

ఇది ఒకరి గెలుపు కాదు.. ఒకరి ఓటమి కాదు..

ఇది ఒకరి గెలుపు కాదు.. ఒకరి ఓటమి కాదని, సోదర వర్గమైన మాలలు పరిస్థితిని అర్థం చేసుకోవాలని, అడ్డంకులు సృష్టించొద్దని మంద కృష్ణ విజ్ఞప్తి చేశారు. "న్యాయమైన వాటా కోసమే తప్ప రిజర్వేషన్ ఫలాలన్నీ మాదిగలే తీసుకోవాలని నేను పోరాటం చేయలేదు. మాదిగల కంటే వెనకబడిన ఉప కులాలు ఉంటే వారి వాటా వారికి అందాలి. ఎక్కడ ఏ వర్గానికి, ఏ తెగకు అన్యాయం జరిగినా అక్కడ వర్గీకరణ అమలు చేయవచ్చన్న కోణంలో సుప్రీం కోర్టు తీర్పుని మనం చూడాలి" అని మందకృష్ణ తెలిపారు. "2004లో వర్గీకరణను రద్దు చేయకపోతే మన ఉద్యమాలు మరోలా ఉండేవి. 20 ఏళ్లలో ఉమ్మడి ప్రయోజనాల కోసం ఎన్నో పోరాటాలు చేసేవాళ్లం. దళిత, గిరిజన, బహుజన వర్గాల హక్కులను సాధించేవాళ్లం. దురదృష్టవశాత్తు 2004 నుంచి మా శక్తినంతా వర్గీకరణ మీదనే కేంద్రీకరించాల్సి వచ్చింది. గుండె జబ్బులున్న పిల్లల కోసం పోరాడితే ఆరోగ్య శ్రీ వచ్చింది. వికలాంగుల కోసం పోరాడితే పింఛన్లు పెరిగినయ్. ఇలా ఒకటి రెండు కాకుండా పూర్తిస్థాయిలో ఉద్యమిస్తే ఎన్నో సాధించేవాళ్లం. ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థల్లో రిజర్వేషన్ల పరిధి తగ్గిపోతున్నది. ప్రైవేట్ రంగం పెరిగిపోతున్నది. ఈ రంగంలోని అంశాలను ఎజెండాగా చేసుకుని భవిష్యత్తులో దళిత, గిరిజన, బీసీలు ముందుకు నడవాల్సిన అవసరం ఉంది. బడ్జెట్‌లో న్యాయం కోసం పోరాడుదాం. భిన్నాభిప్రాయాలు, అవరోధాలు లేకుండా పనిచేద్దాం. అట్రాసిటీ చట్టం రద్దు కాకుండా కాపాడుకున్నట్లే భవిష్యత్తులో కలిసి పోరాడుదాం" అని మంద కృష్ణ పిలుపునిచ్చారు.

మోదీ, వెంకయ్య సహా ఎందరో సహకారం.. అందరికీ ధన్యవాదాలు

తమను ఎందరో పెద్దలు, భిన్న రాజకీయ ఆలోచన లున్న నాయకులు సమర్థించారని మంద కృష్ణ తెలిపారు. "యావత్ సమాజం మాదిగ దండోరాకు అండగా నిలిచారు. 30 ఏళ్లుగా నావెంట ఉన్న సహచరులు, నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. ఒక పోరాటం విజయం సాధించింది అంటే అందుకు ప్రజాస్వామ్యవాదులు, పెద్దలు, మీడియా సంపూర్ణ సహకారం వల్లనే. పెద్దలు వెంకయ్యనాయుడు అండగా నిలిచారు. కిషన్‌రెడ్డి భుజానికెత్తుకున్నారు. రఘునందన్‌రావు, బండి సంజయ్, ఈటల రాజేందర్.. ఇలా దక్షిణాదికి చెందిన బీజేపీ పెద్దలంతా సహకరించారు. న్యాయాన్ని బతికించేందుకు, పేద వర్గాలకు అండగా నిలిచేందుకు ఇచ్చిన తీర్పుగా దీనిని మేం భావిస్తున్నాం" అని అభివర్ణించారు.

1996 నుంచి 'ఆంధ్రజ్యోతి' మా ఉద్యమంలో ఉంది.

ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో 'ఆంధ్రజ్యోతి'ది కీలక పాత్ర అని మందకృష్ణ మాదిగ తెలిపారు. 1996 నుంచి మాదిగ దండోరా ఉద్యమం ప్రతి దశలోనూ తమ వెన్నంటి నిలిచిందన్నారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటంలో వెలకట్టలేని మద్దతు ఇచ్చి.. తాము విజయం సాధించడంలో విశేష తోడ్పాటు అందించిందని కొనియాడారు.

చంద్రబాబు చేసిన చట్టమే నడిపించింది..

"మా పోరాటం ముందుకునడిచి విజయం దక్కిందంటే చంద్రబాబు తెచ్చిన చట్టమే కారణం. నాడు ఆయన వర్గీకరణ చేయకపోతే వేలాది ఉద్యోగాలు వచ్చేవి కాదు. విద్యావకాశాలు దక్కేవి కాదు. చంద్రబాబు చేసిన చట్టాన్నే సుప్రీం కోర్టు సమర్థించింది. ఆయన ఎప్పుడూ న్యాయం, ధర్మం వైపే ఉంటారని మరోసారి రుజువైంది. సుప్రీం తీర్పు చంద్రబాబుకే గర్వకారణం. ఈ సమయంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉండడం మా జాతి భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది. చంద్రబాబు స్థానంలో వైఎస్ జగన్ ఉంటే ఏపీలో వర్గీకరణ అమలయ్యేది కాదేమో?" అని మంద కృష్ణ వ్యాఖ్యానించారు.

ఓబీసీ ఉపకులాల వర్గీకరణకు మోక్షం ఎప్పుడు?

ఏడాది క్రితమే జస్టిస్ రోహిణీ కమిషన్ నివేదిక

- ఇంతవరకు బయటపెట్టని ఎన్డీయే సర్కారు
- ఉప కులాల్లో గందరగోళం రేగితే ఎన్నికలలో దెబ్బతింటామన్న భయంతో వెనుకడుగు!
- సుప్రీం 'వర్గీకరణ' తీర్పుతో తెరపైకి 'ఓబీసీ'

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల్లో ఉప కులాలను వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు వారికి అందజేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఓబీసీ ఉప కులాలకు వర్గీకరణ మాటేమిటన్న విషయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ఓబీసీల్లో ఉప కులాలను వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు అందించేందుకు 2017లో ఢిల్లీ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రోహిణి నేతృత్వంలో ఏర్పాటైన కమిషన్ తన నివేదికను రాష్ట్రపతి ముర్ముకు గత ఏడాది జూలైలోనే సమర్పించింది. కానీ ఇంతవరకూ ఆ నివేదిక వివరాలను ప్రభుత్వం బయటపెట్టలేదు. దాన్ని ప్రభుత్వం ఇంకా ఆమోదించలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై జస్టిస్ రోహిణితో మాట్లాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రాష్ట్రపతి భవన్ నుంచి ఆ నివేదిక సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖకు కూడా చేరలేదని అధికార వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో ఇండియా కూటమి కులాలవారీగా జనగణన, రిజర్వేషన్ల అంశం తెరమీదకు తేవడంతో రోహిణీ కమిషన్ నివేదికను బయటపెడితే తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఎన్డీఏ ప్రభుత్వం భావించిందన్న అభిప్రాయం ఉంది. ఇప్పుడైనా వెల్లడిస్తుందా లేదా అన్నది చర్చనీయాంశమవుతోంది. కానీ, ప్రభుత్వ ప్రతిస్పందన మాత్రం తెలియడం లేదు. ఆ నివేదికను ప్రభుత్వం ఆమోదిస్తే పార్లమెంట్‌లో ప్రవేశపెడతారని, అప్పుడే అందరికీ అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నిజానికి ప్రభుత్వం రోహిణీ కమిషన్‌ను నియమించిన తర్వాత 13సార్లు పదవీకాలం పొడిగించింది. కాగా, కమిషన్ తన నివేదికను రూపొందించేటప్పుడు పలు అధ్యయనాలు చేసింది. దాదాపు 5 వేల ఓబీసీ కులాల్లో ఒక శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లను పొందారని, 40 కులాలకే ప్రయోజనాలు దక్కాయని కమిషన్ దృష్టికి వచ్చింది. ఈ విషయంపై కమిషన్ శాస్త్రీయంగా అధ్యయనం చేసి నివేదిక సమర్పించింది. ఓబీసీలకు కల్పిస్తున్న 27 శాతం రిజర్వేషన్ ఇతర ఉపకులాలకు కూడా సమానంగా పంచాలని కమిషన్ అభిప్రాయపడినట్లు తేలింది. ఈ నివేదిక బయటపడితే ఓబీసీ ఉపకులాల్లో గందరగోళం చెలరేగుతుందని, కులాల మధ్య చిచ్చు రేగుతుందని, ఎన్నికల సమయంలో తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని ప్రభుత్వం భావించిందన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. మణిపూర్‌లో రెండు తెగల మధ్య చిచ్చు రేగడం, ఈ ఏడాది ఆఖరిలోపు మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ నివేదిక ఇప్పట్లో బయటకు వచ్చే అవకాశాలు కనపడడం లేదు. అయితే ఎస్సీ ఎస్టీల వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఓబీసీల అంశం కూడా తెర ముందుకు రానున్నది.



సీఎం రేవంత్‌కు స్వీటు తినిపిస్తున్న దామోదర రాజనర్సింహ, కడియం శ్రీహరి, ఇతర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

ఎస్సీ వర్గీకరణ తొలుత రాష్ట్రంలోనే!

దేశంలోనే అందరికంటే ముందుగా అమలుచేస్తాం

- ఇదివరకే ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకూ వర్తింపజేస్తాం
- ఇందుకు కోసం అవసరమైతే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తెస్తాం
- సుప్రీంది గొప్ప తీర్పు.. : సీఎం రేవంత్
- న్యాయం గెలిచింది: దామోదర
- అఫిడవిట్ ఇచ్చిన సీఎంకు కృతజ్ఞతలు: కడియం
- సీఎంకు స్వీట్లు తినిపించిన నేతలు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ధర్మాసనం అనుమతించినందున తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అందరికంటే ముందు భాగాన నిలబడి షెడ్యూల్డు కులాల (ఎస్సీ) ఏబీసీడీ వర్గీకరణను అమలు చేసే బాధ్యత తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అవసరమైతే ఇదివరకే జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లకూ వర్గీకరణను వర్తింపజేయడానికి ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి.. మాదిగ, ఉప కులాల సోదరులకు న్యాయం చేసే బాధ్యతను తీసుకుంటాం అని చెప్పారు. వర్గీకరణ అత్యంత ప్రధానమైన అంశం అని.. దీనికి సభ ఏకాభిప్రాయానికి రావాలని, మాదిగ, మాదిగ ఉప కులాలకు సంపూర్ణంగా సహకరించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున నేను విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు విపక్షాల నుంచి అభిప్రాయాలు తీసుకుంటాం అని చెప్పారు. షెడ్యూల్డు కులాలను ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరించడానికి గురువారం సుప్రీంకోర్టు ధర్మాసనం అనుమతించింది. ఆ మేరకు సుప్రీం ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం శాసనసభలో సీఎం ఓ ప్రకటన చేశారు. "ఎస్సీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగ, మాదిగ ఉప కులాలకు సంబంధించిన యువకులు కొన్ని దశాబ్దాల నుంచి పోరాటాలు చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నుంచి 27 ఏళ్లుగా జరుగుతున్న వర్గీకరణ పోరాటానికి ఇప్పుడు అనుకూల తీర్పు వచ్చింది. అప్పట్లో ఇదే శాసనసభలో మాదిగ, ఉపకులాల వర్గీకరణ కోసం వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదిస్తే నాతో పాటు ఆనాటి శాసన సభ్యుడు సంపత్‌కుమార్‌ను సభ నుంచి బహిష్కరించారు. ఏబీసీడీ వర్గీకరణపై ప్రధానమంత్రిని కలవడానికి గత ప్రభుత్వం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళతామని చెప్పి, తీసుకెళ్లకుండా మాదిగ సోదరులను మోసం చేసింది. 2023 డిసెంబరు 3న మా ప్రజా ప్రభుత్వం బాధ్యత తీసుకున్నాక మా ఉప ముఖ్యమంత్రి సూచన మేరకు.. మాజీ ఉప ముఖ్యమంత్రి, ప్రస్తుత మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో మా శాసనసభ్యులు, అడ్వొకేట్ జనరల్ బృందాన్ని ఢిల్లీకి పంపాం. సుప్రీం కోర్టు న్యాయ కోవిదులతో చర్చించాలని చెప్పాం. సుప్రీం కోర్టులో తెలంగాణ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించింది. ఆ మేరకు సుప్రీంకోర్టు మాదిగ, మాదిగ ఉప కులాల వర్గీకరణకు అనుకూలమైన తీర్పు ఇచ్చింది" అని రేవంత్‌రెడ్డి వివరించారు. సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి తాను మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు చాలా గొప్పదని, ఇంత ప్రధానమైన అంశం ప్రస్తావనకు వచ్చిన సమయంలో ప్రతిపక్ష నేత కేసీఆర్ సభలో లేరు అని పేర్కొన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. ఈ రోజు న్యాయం, ధర్మం గెలిచిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం తరఫున అఫిడవిట్ ఇప్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మందుల సామేలు, వేముల వీరేశం, లక్ష్మీకాంతరావు తీర్పు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సభలో ఈ అంశంపై మాట్లాడడానికి విపక్ష సభ్యులకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ అనుమతించారు. కాగా అంతకుముందు సుప్రీం తీర్పు అనంతరం మంత్రి దామోదర, ఎమ్మెల్యే కడియం, ఇతర ఎమ్మెల్యేలు సీఎం చాంబర్‌లో రేవంత్‌ను కలిసి డప్పు దరువులతో కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు మిఠాయిలు తినిపించారు.

వర్గీకరణ తీర్మానం కాపీని కేసీఆరే మోదీకి ఇచ్చారు: హరీశ్

సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఇది చాలా హర్షణీయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లోనే 2014 నవంబరు 29న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా శాసనసభలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపించామని చెప్పారు.తీర్మానం కాపీని కేసీఆరే స్వయంగా మోదీకి ఇచ్చారన్నారు. వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చినందున వెంటనే కార్యాచరణను చేపట్టి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 70 ఏళ్లుగా సాగుతున్న వర్గీకరణ పోరాటానికి ప్రధాని మోదీ మద్దతిచ్చారని బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఇది చరిత్రాత్మకమైన తీర్పు అని, చాలా సంతోషంగా ఉందని చెప్పారు. సుప్రీం కోర్టు ధర్మాసనాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు.

రిజర్వేషన్లు ఎలా?

- జనాభా లెక్కల దాకా ఆగాల్సిందేనా?
- సమగ్ర కుటుంబ సర్వే పనికొస్తుందా!
- లేక రాష్ట్ర ప్రభుత్వమే గణన చేపట్టాలా??

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులా(ఎస్సీ)ల వర్గీకరణ పీటముడి వీడింది..! వర్గీకరణ అధికారాలు రాష్ట్రాలకు ఉంటాయని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో ఎస్సీల్లో కేటగిరీల వారీగా రిజర్వేషన్ల ఖరారు ఎలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నిజానికి రిజర్వేషన్ల లెక్క తేల్చడానికి జనాభా లెక్కలను ప్రామాణికంగా తీసుకోవడం ఆనవాయితీ..! అయితే.. చివరిసారి జనగణన 2011లో జరిగింది. సాధారణంగా జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలను గణిస్తారు. వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను నమోదు చేస్తారు. కానీ, ఉపకులాల వివరాలకు ప్రాధాన్యత ఉండదు. ఈ నేపథ్యంలో ఎస్సీల్లో ఏయే కులాలను ఏబీసీడీలుగా విభజించాలి? రిజర్వేషన్లను ఎలా ఖరారు చేయాలి? రోస్టర్ పాయింట్లను ఎలా కేటాయించాలి? అన్నదే ఇప్పుడు ప్రభుత్వాల ముందున్న సవాళ్లు..!

59 ఉప కులాలు

తెలంగాణలో అధికారికంగా గుర్తింపు పొందిన ఎస్సీ ఉపకులాల సంఖ్య 59గా ఉంది. 2014లో విడుదలైన జీవో-11, 2015లో జీవో 2, 5ల ప్రకారం వీటిని నోటిఫై చేశారు. ఇన్ని ఉపకులాలు ఉన్నా.. జనాభా ఎక్కువగా ఉన్న వారికి కాకుండా.. రిజర్వేషన్ల ఫలాలు కొందరికే దక్కుతున్నాయనే కారణంతో ఏబీసీడీల వర్గీకరణకు ఉద్యమాలు జరిగాయి. అయితే.. ఉపకులాల వారీగా జనాభా ఎంత? వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఏమిటి? అనేది తేలితేనే.. వర్గీకరణ, కోటా తేలుతుందని రాజ్యాంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దాన్ని బట్టే రాజ్యాంగంలోని అధికరణలు 15, 16 ప్రకారం సమానావకాశాలు దక్కుతాయని వివరిస్తున్నారు. దీంతో.. ఇప్పుడు ఉపకులాల వారీగా ఎస్సీల జనాభా.. వృత్తులు, సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన పరిస్థితులను గుర్తించాకే.. ఏబీసీడీల వర్గీకరణ సాధ్యమవుతుందని చెబుతున్నారు.

కిం కర్తవ్యమ్..!

2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత.. సర్కారు సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీల సంఖ్య 54.08 లక్షలుగా ఉండగా.. 2014 సమగ్ర కుటుంబ సర్వేలో ఆ సంఖ్య 64.44 లక్షలకు పెరిగింది. అయితే.. ఇందులో మాదిగల శాతం ఎంత? మాలలు ఎందరు? ఇతర ఉప కులాలైన ఆది ఆంధ్ర, దాసరి, గోసంగి, డక్కలి, పామిడి.. ఇలా ఎవరి జనాభా ఎంత? అనే వివరాలు లేవు. ఉపకులాల వారీగా జనాభా, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులేమిటి? ఎలాంటి వృత్తులు చేస్తున్నారు? రాజ్యాంగ, చట్టపరమైన హక్కులకు దూరంగా ఉంటూ.. ఇంకా వివక్షతకు గురవుతున్న వారెందరు? అనేది తేలితేనే.. వర్గీకరణ సాధ్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది జరగాలంటే.. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న తదుపరి(ఈ ఏడాది చివర్లో) జనాభా లెక్కల వరకు వేచి ఉండాల్సిందే..! లేదంటే.. రాష్ట్ర ప్రభుత్వమే ఎస్సీల కుల గణన చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే రేవంత్ సర్కారు కులగణన చేపడతామని ప్రకటించిన నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వమే కుల గణన జరిపితే వర్గీకరణ ప్రక్రియ వేగం పుంజుకుంటుందని స్పష్టమవుతోంది.

నాడు వర్గీకరణ ఇలా..

- 2000-2004 మధ్య ఏపీలో అమలు
- దీనికోసం చంద్రబాబు ప్రత్యేక జీవో
- విద్యా, ఉద్యోగ రంగాల్లో అమలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'సమాజంలోని అన్ని వర్గాలు, కులాల వారికి న్యాయం జరగాలి. వారి జనాభా ప్రకారం.. వారికి అందాల్సిన అవకాశాలు అందాలి'.. ఇదే లక్ష్యంతో 24 ఏళ్ల కిందటే చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో... అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం వర్గీకరణను ఎలా అమలు చేసిందనే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 సంవత్సరంలో ప్రత్యేక జీవోను తెచ్చి వర్గీకరణ విధానాన్ని అమలుచేశారు. 2004లో సుప్రీంకోర్టు ఈ జీవోను రద్దు చేసేవరకు ఈ విధానం కొనసాగింది. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు మెడికల్, ఇంజనీరింగ్ సీట్లలో భారీగా ప్రయోజనాలు కలిగించారు. 2000-2004 మధ్య కాలంలో మాదిగలకు ఈ విధానంలో 22 వేల ఉద్యోగాలు దక్కాయి.

1981 జనగణన ప్రాతిపదికన...

రాజ్యాంగం ఎస్సీ వర్గీకరణ కింద 15 శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఎస్సీ కులాలు, ఉప కులాలకు ఉమ్మడిగా రిజర్వేషన్లు అమలయ్యేవి. అయితే, సామాజిక, చారిత్రక కారణాల వల్ల ఈ కులాల్లో కొన్ని రిజర్వేషన్ ఫలాలను అధికంగా అనుభవిస్తే, కొన్ని అసలు పొందలేకపోయాయి. మరికొన్ని కులాలకు అరకొరగా ప్రయోజనాలు అందాయి. దీంతో ఎస్సీ ఉపవర్గీకరణ డిమాండ్ తెరపైకి వచ్చింది. జనాభా దామాషాను పరిగణనలోకి తీసుకోవాలని కూడా అప్పట్లో కోరారు. ముఖ్యంగా మాదిగ సామాజికవర్గం ఈ డిమాండ్‌ను వినిపించింది. అయితే, ఉపవర్గీకరణ అంశాన్ని తొలినుంచీ టీడీపీ బలపరుస్తూ వచ్చింది. 1997 నుంచి 2004 వరకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విధానాన్ని సమగ్రంగా అమలుచేశారు. దీనికోసం 1981 జనాభా లెక్కలను ప్రాతిపదికగా చేసుకున్నారు. దాని ప్రకారం, ఉమ్మడి ఏపీలోని ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లో ఎస్సీ కులస్థుల్లో రెల్లి 1.67 శాతం, మాదిగలు 46.94 శాతం, మాలలు 40 శాతం, ఆది-ఆంధ్రకు సంబంధించి 8.96 శాతం మంది ఉన్నట్టు గుర్తించారు. టీడీపీ ప్రభుత్వం నాడు ఈ దామాషా ప్రకారం కేటగిరి ఏ కింద ఉన్న రెల్లి కులస్థులకు 1 శాతం, మాదిగలకు 7 శాతం, మాలలకు 6 శాతం, ఆది-ఆంధ్రులకు 1 శాతంగా రిజర్వేషన్‌ను విభజించారు. రెల్లిలో 12 కులాలు, మాదిగల్లో 18, మాలల్లో 25, ఆది-ఆంధ్రలో 4 కులాలు ఉన్నాయి. కాగా, 2004లో సుప్రీంకోర్టు ఆదేశాలతో వర్గీకరణ జీవో రద్దయింది. 2004 తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలేవీ.. వర్గీకరణ విషయంలో చొరవను చూపలేదు. 2014లోమళ్లీ సీఎంగా చంద్రబాబు అధికారంలోకి రావడంతో మాదిగల్లో ఆశలు చిగురించాయి.

ఆ తర్వాతా కొనసాగిన స్ఫూర్తి

సుప్రీంకోర్టు ఆదేశాలు ఉండటంతో 2004 తర్వాత వర్గీకరణను చేపట్టే పరిస్థితి లేదు. ఈ క్రమంలో 2014లో నవ్యాంధ్రకు తొలి సీఎం చంద్రబాబు అయ్యారు వర్గీకరణ స్ఫూర్తిని ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కొనసాగించారు. మాదిగ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం సంక్షేమ పథకాల్లో వాటా తగ్గకుండా చూశారు. దీనికోసం సాంఘిక సంక్షేమశాఖ 2015 మే 1న జీవో 25ను తెచ్చింది. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఆయా కులాల కేటగిరీవారీగా పంపిణీ చేయాలని ఆ జీవోలో స్పష్టం చేశారు. దీనికోసం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంది. దాని ప్రకారం సంక్షేమ ఫలాల పంపిణీ నాడు అందించింది.

చంద్రబాబు చొరవతోనే...

తొలిసారి సీఎం అయిన కొత్తల్లోనే చంద్రబాబు వర్గీకరణ అంశంపై దృష్టి సారించారు. దీనిపై పరిశీలనకు రిటైర్డ్ జస్టిస్ పి.రామచంద్రరాజు నేతృత్వంలో ఏకసభ కమిషన్‌ను నియమించారు. 28-05-1995న తన నివేదికను కమిటీ సమర్పించింది. కమిటీ నివేదికను పరిశీలించేందుకు అప్పటి ముగ్గురు మంత్రులు తమ్మినేని సీతారాం, కె.చంద్రశేఖర్, నిమ్మల కిష్టప్ప ఆధ్వర్యంలో 02-06-1997న కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటుచేశారు. తన సిఫారసులను 04-06-1997న సబ్ కమిటీ ఇచ్చింది. ఈ సిఫారసుల మేరకు షెడ్యూల్డ్ కులాలకు ఉన్న 15 శాతం రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరిస్తూ 06-06-1997న జీఓ 68 జారీచేశారు. దీని ప్రకారం.. మాదిగ సామాజికవర్గాన్ని షెడ్యూల్డ్ కులాలలో రెండో వెనుకబడిన కులాల గ్రూపుగా గుర్తించారు. వర్గీకరణ ప్రకారం బ్యాక్‌లాగ్ పోస్టులను వర్గీకరణ ప్రకారం భర్తీ చేయడానికి 07-06-1997న జీఓ నెం.69 జారీచేశారు. ఈ క్రమంలో అసెంబ్లీలో చంద్రబాబు హయాంలోనే వర్గీకరణకు అనుకూలంగా 3 తీర్మానాలు చేశారు. అవి.. 1)22-04-1998న జస్టిస్ రామచంద్రరాజు సిఫారసుల మేరకు వర్గీకరణ చేస్తూ తీర్మానం. 2)01-04-2000న ఎస్సీ కులాల రిజర్వేషన్ బిల్లు-2000ను ఆమోదిస్తూ తీర్మానం. 3)ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో పార్లమెంట్ స్థాయిలో తగు చర్యలు తీసుకోవాలని 10-12-2004న శాసనసభలో తీర్మానం.

2011 జనాభా లెక్కల ప్రకారం ఏపీ, తెలంగాణలో కులాలవారీగా ఎస్సీ జనాభా

	ఎస్సీ కులాల జనాభా	మాదిగ జనాభా	మాల జనాభా	తేడా
ఆంధ్రప్రదేశ్	84,45,398	34,68,967	40,43,101	5,74,134
తెలంగాణ	54,32,680	32,33,642	15,27,143	17,06,499



'రీ ఇమాజినింగ్ హైదరాబాద్'ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

పెట్టుబడులంటే హైదరాబాద్ అనేలా మూసీ అభివృద్ధి చేపడతాం

- హైదరాబాద్ 4.0 అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పన
- 'రీ ఇమాజినింగ్ హైదరాబాద్'లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మూసీ నది అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. మూసీనది అభివృద్ధి ప్రాజెక్టుతో.. ఇక పెట్టుబడులంటే హైదరాబాద్ గుర్తొచ్చేలా చేస్తామని ప్రకటించారు. మూసీలో శుద్ధ జలాల ప్రవాహం ఉండేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. క్రెడాయ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో గురువారం సాయంత్రం జరిగిన 'రీ ఇమాజినింగ్ హైదరాబాద్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. పాలకులు మారినా.. చారిత్రక హైదరాబాద్ అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలను కొనసాగించారని, అందుకే హైదరాబాద్‌కు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. 1965లో నాటి పాలకులు తీసుకున్న నిర్ణయాల ఫలితంగానే ఫార్మా రంగంలో హైదరాబాద్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. 25ఏళ్ల క్రితం గచ్చిబౌలి అటవీ ప్రాంతమని, అలాంటిది హైదరాబాద్‌లో ఉన్నామా? ఇంకెక్కడైనా ఉన్నామా?అనే స్థాయిలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని తెలిపారు. బ్యాగరి కంచెలో స్కిల్ వర్సిటీకి శంకుస్థాపన చేశామని, ఆ ప్రాంతం పేరు పలికేందుకు ప్రస్తుతం కొందరు ఇబ్బంది పడొచ్చు కానీ నాలుగైదేళ్లలో బ్యాగరికంచె గురించి గొప్పగా చెప్పుకునేలా చేస్తామన్నారు. హైదరాబాద్ 4.0 అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నామని, మరో ఏడాదిలోగా మాస్టర్‌ప్లాన్ 2050 అందుబాటులోకి రాబోతుందన్నారు. సిద్ధాంతపరంగా కొందరితో విభేదాలున్నా అభివృద్ధి అంశంలో ప్రభుత్వానికి ఎవరితోనూ ఎలాంటి విభేదాలు లేవన్నారు. బిల్డర్లు రాజకీయ నాయకులుగా మారితే.. వారిని ప్రత్యర్థులుగానే చూస్తామని సీఎం చెప్పారు. కేవలం వ్యాపారాలు చేసే వారికే ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గోషా మహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి?

- ఇప్పుడున్న చోటుకు 2-3 కిమీల దూరంలో..
- 20-30 ఎకరాల్లో కొత్త భవనాల నిర్మాణం

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనం నిర్మాణం అంశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో ఉన్న ఆస్పత్రిని అలానే వదిలేసి మరోచోట కొత్తగా ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్టు వైద్య వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత ఆస్పత్రి నుంచి 2-3 కిలోమీటర్లలోపు దూరంలో సుమారు 20-30 ఎకరాల్లో కొత్త భవనాన్ని నిర్మించాలని అనుకుంటున్నారు. ఈ స్థలంలో ఒక్కోటి 7-8 అంతస్తుల ఉండేలా బ్లాక్‌లు నిర్మించనున్నారు. ప్రస్తుత ఆస్పత్రికి సమీపంలో ఇంత స్థలం గోషామహల్ ప్రాంతంలోనే ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.

కాంగ్రెస్‌లోనే గద్వాల ఎమ్మెల్యే: మంత్రి జూపల్లి

- ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి బుజ్జగింపు

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 1: "గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. రెండు రోజులుగా కొన్ని ప్రధాన పత్రికలు, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు వాస్తవం కాదు. అసెంబ్లీ లాబీల్లో పరిచయం ఉన్న బీఆర్ఎస్ నాయకులతో కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడినంత మాత్రాన ఆయన కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు కాదు" అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి గురువారం ఉదయం మంత్రి జూపల్లి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి వెళ్లి ఆయనను బుజ్జగించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి జూపల్లి మాట్లాడారు. గద్వాల నియోజకవర్గంలోని పెండింగ్ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి రైతాంగానికి పూర్తి స్థాయిలో నీరు అందేలా కృషి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యేకు జ్వరం ఉన్నందున రెండు రోజులు ఫోన్‌లో అందుబాటులో లేరని, దీంతో పార్టీ మారారనే అనుమానాలకు తావులేదన్నారు. అనంతరం మంత్రి జూపల్లి తన కారులోనే కృష్ణమోహన్‌రెడ్డిని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

పదేళ్ల తర్వాత వైద్య శాఖలో హెచ్‌వోడీ పోస్టులు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు వైద్య ఆరోగ్య శాఖలో కీలకమైన విభాగాధిపతుల పోస్టులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు (డీహెచ్), తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్, డ్రగ్ కంట్రోల్ జనరల్ పోస్టులకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్నా ఇప్పటికీ కీలకమైన ఈ మూడు పోస్టులు మంజూరుకాలేదు.2014 నుంచి 2023వరకు డీఎంఈ పోస్టును సృష్టించలేదు. దీంతో రెగ్యులర్ డీఎంఈ పోస్టుపై సీనియర్ అధ్యాపకులు కోర్టుకు వెళ్లడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దీన్ని సృష్టించారు. ఇక అడిషనల్ డీఎంఈల పదవీ విరమణ వయసు పెంపు బిల్లుకు తాజాగా గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో గురువారం పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచుతూ సర్కారు గెజిట్‌ను జారీ చేసింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో టీవీవీపీలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ 010 పద్దు కింద వేతనాలు వస్తాయి.

వేగంగా విద్యుత్ సరఫరా ఫిర్యాదుల పరిష్కారం

- గణనీయంగా తగ్గిన ఫిర్యాదులు: దక్షిణ డిస్కమ్ సీఎండీ

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాపై ఫిర్యాదులను అతి తక్కువ కాలంలో పరిష్కరించేలా విద్యుత్ కంట్రోల్ రూమ్‌తో పాటు ఆధునిక టెక్నాలజీతో కూడిన ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ (ఎఫ్‌వోసీ)లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు దక్షిణ డిస్కమ్ అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న సామర్థ్యాన్ని పెంచుతూ ఏకకాలంలో 400 మంది ఫిర్యాదులు చేసినా అందుకునేలా మార్పులు చేశారు. గురువారం డిస్కమ్ ప్రధాన కార్యాలయంలో 1912 కాల్ సెంటర్‌తోపాటు ఎఫ్‌వోసీల పనితీరుపై సంస్థ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ సమీక్ష నిర్వహించారు. బ్రేక్‌డౌన్, ఫీడర్ల సమాచారంతో పాటు బిల్లింగ్, కలెక్షన్‌ల వివరాలతో సమీకృత డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తెచ్చామని సీఎండీ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఆరు నెలలుగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయని చెప్పారు.

మహానగరంగా ముచ్చర్ల!

న్యూయార్క్‌ను మించి నిర్మిస్తాం.. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్.. నాలుగో నగరంగా ముచ్చర్ల

- శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మెట్రో
- ఓఆర్ఆర్‌ను కలిపేలా 200అడుగుల రోడ్డు
- 3 నెలల్లో రీజనల్ రింగ్ రోడ్డు పనులు
- 150 కోట్లతో స్కిల్ వర్సిటీ నిర్మాణం
- వర్సిటీ శంకుస్థాపన సభలో సీఎం రేవంత్



స్కిల్ వర్సిటీకి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి తదితరులు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/కందుకూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముచ్చర్లలో న్యూయార్క్‌ను మించిన మహానగరాన్ని నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. నిజాం నవాబు హైదరాబాద్‌ను, బ్రిటిష్ వాళ్లు సికింద్రాబాద్‌ను, చంద్రబాబు, వైఎస్‌లు సైబరాబాద్‌ను నిర్మించగా.. నాలుగో నగరాన్ని తాము ముచ్చర్లలో నిర్మిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగురోడ్డు నిర్మాణం వల్ల శివారు ప్రాంతాల్లో ఎకరా రూ.100 కోట్ల వరకు ధరలు పెరిగాయని రేవంత్ చెప్పారు. ఇక్కడ కొత్తగా ఏర్పాటు చేయనున్న అధునాతన మహానగరంతో చుట్టుపక్కల ప్రాంతాల రూపురేఖలు మారిపోతాయన్నారు. వేలాది ఎకరాల భూముల్లో న్యూయార్క్, సింగపూర్, దుబాయ్‌లకు మించిన మహానగరాన్ని నిర్మిస్తామని తెలిపారు. కాలుష్యరహిత పరిశ్రమలతో పాటు విద్య, ఆరోగ్యం, పర్యాటక హబ్‌లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. 'కొందరు వెటకారంగా మాట్లాడుతున్నారు. ఈ వేదిక ద్వారా ఒకటే చెబుతున్నా.. ఇక్కడకు రూ.వేల కోట్ల పెట్టుబడులు తెచ్చి న్యూయార్క్ కంటే అధునాతన నగరాన్ని కచ్చితంగా నిర్మిస్తాం' అని రేవంత్ స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా 57 ఎకరాల్లో రూ.150 కోట్లతో స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ముచ్చర్ల-బేగరి కంచె ప్రాంతం రూపురేఖలన్నీ మారిపోతాయని చెప్పారు. ఈ ప్రాంతానికి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మెట్రోలైన్ అనుసంధానం చేస్తామని, అలాగే ఔటర్ రింగురోడ్డుకు నేరుగా వెళ్లేందుకు 200 అడుగుల రోడ్డు నిర్మాణం చేపడతామని ప్రకటించారు. ఈ భూసేకరణ బాధ్యతను మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి అప్పగిస్తున్నట్లు తెలిపారు. ముచ్చర్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో భూములు ఇచ్చిన రైతులందరికీ అండగా ఉంటామని, వారిని అన్ని విధాలా ఆదుకునే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రైతు కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఈ యూనివర్సిటీలో నైపుణ్య శిక్షణ ఇప్పించి, వారికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలకు ముందుగా ఫలాలు అందాలనే ఉద్దేశంతోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు మంత్రివర్గ ఆమోదం తీసుకుని, అసెంబ్లీలో బిల్లు ఆమోదించి, ఇళ్లకు కూడా వెళ్లకుండా సరాసరి ఇక్కడకే వచ్చామని రేవంత్ తెలిపారు. యూనివర్సిటీ నుంచి ఏటా వేలాది మందికి శిక్షణ ఇచ్చి రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు అందిస్తామని వెల్లడించారు. అలాగే ఈ ప్రాంతానికి ఆనుకుని ఉన్న రిజర్వుడు ఫారెస్ట్‌ను అభివృద్ధి చేసి నైట్ సఫారీ ఏర్పాటు చేస్తామని, పర్యాటకులను ఆకర్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వర్సిటీలో అడ్మిషన్ వస్తే జాబ్ గ్యారెంటీ!

తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగ సమస్య ఒక కారణమని, లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యమంలో ముందు నడిచారని సీఎం రేవంత్ గుర్తుచేశారు. ఏటా లక్ష మంది ఇంజనీర్లు బయటకు వస్తున్నారని.. నైపుణ్యాలు లేకపోవడంతో వారికి ఉద్యోగావకాశాలు దక్కడం లేదని చెప్పారు. స్కిల్ వర్సిటీ నిరుద్యోగులకు ఉజ్వల భవిష్యత్తు అందిస్తుందన్నారు. అనేక మంది పారిశ్రామికవేత్తలు, అధికారులు దీనికి సహకరిస్తున్నారని చెప్పారు. ప్రజాప్రభుత్వం గొప్ప ఆశయంతో, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వర్సిటీలో అడ్మిషన్ వస్తే జాబ్ గ్యారెంటీ అని సీఎం పేర్కొన్నారు. ఈ యూనివర్సిటీలో శిక్షణ పొందే వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఇప్పటికే రెడ్డి ల్యాబ్, ఎస్‌బీఐ లాంటి సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిలో కీలకమైన రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు మూడు నెలల్లో చేపడతామని సీఎం చెప్పారు. ఓఆర్ఆర్ పనులు వైఎస్ చేపడితే ఆర్ఆర్ఆర్ పనులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్నాయని తెలిపారు.

అందరి సహకారంతో నిర్మాణం: శ్రీధర్‌బాబు

అందరి సహకారంతో ముచ్చర్లలో కొత్త నగర నిర్మాణాన్ని పూర్తిచేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. కొత్త ఆలోచనతో కొత్త నగర నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ముందడుగు వేశామని చెప్పారు. నూతన మహానగరంలో ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి స్థానికుల సహకారం ఎంతో అవసరమన్నారు.

కార్యక్రమానికి సబిత దూరం

స్కిల్ వర్సిటీ శంకుస్థాపనకు స్థానిక ఎమ్మెల్యే సబిత దూరంగా ఉన్నారు. బుధవారం అసెంబ్లీలో సీఎం రేవంత్, సబిత మధ్య వాగ్వాదం జరగడం, ఆమె కన్నీరు పెట్టడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన నియోజకవర్గంలో జరిగిన సీఎం కార్యక్రమానికి సబిత హాజరు కాకపోవడం గమనార్హం. గురువారం సాయంత్రం శంకుస్థాపన ఉంటే అధికారులు తనకు ఉదయం సమాచారం ఇచ్చారని, ప్రజాప్రతినిధులతో వ్యవహరించే తీరు ఇదేనా? అని సబిత ప్రశ్నించారు. వేదికపై వేసిన పోస్టర్‌లో కూడా తన ఫొటో లేదని చెప్పారు.

అల ముచ్చర్ల నగరిలో!!

13,973 ఎకరాల విస్తీర్ణంలో నెట్ జీరో సిటీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ముచ్చర్లలో నిర్మించ తలపెట్టిన నెట్ జీరో సిటీ(కర్బన ఉద్గార రహిత నగరం) అభివృద్ధికి ప్రభుత్వం అద్భుత ప్రణాళిక సిద్ధం చేసింది. 14వేల ఎకరాల్లో 10 హబ్‌లుగా నిర్మాణాలు చేపట్టనుంది. సీఎంకు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మొత్తం 13,973 ఎకరాల విస్తీర్ణంలో నెట్ జీరో సిటీ ఏర్పాటు చేయనున్నారు. భవిష్యత్తులో ఈ విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇందులో 4,774 ఎకరాలను ఎలక్ట్రానిక్, జనరల్ ఇండస్ట్రీస్ కోసం కేటాయించారు. 4,207 ఎకరాల్లో లైఫ్ సైన్సెస్ హబ్ ఏర్పాటు చేయనున్నారు. 1,013 ఎకరాల్లో రెసిడెన్షియల్ జోన్, 761 ఎకరాల్లో స్పోర్ట్స్ హబ్, ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ మిక్స్‌డ్ యూజ్ కోసం 470 ఎకరాలు, ఎడ్యుకేషన్ వర్సిటీ జోన్‌కు 454 ఎకరాలు, ఏఐ సిటీ కోసం 297 ఎకరాలు కేటాయించారు. ఇవి కాక, పక్కనే ఉన్న రిజర్వు ఫారెస్టులో నైట్ సఫారీ ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు.

ఇంత కంటే ఆత్మ సంతృప్తి ఏముంటుంది?: భట్టి

సభలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సీఎం రేవంత్‌రెడ్డిని పొగడ్తలతో ముంచెత్తారు. ముచ్చర్లలో జరుగుతున్న కార్యక్రమాన్ని సువర్ణాక్షరాలతో లిఖించదగినదని అభివర్ణించారు. రాష్ట్రాభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్న తపన, అందులో నుంచి వచ్చిన ఆలోచనలే ఈ బృహత్తర కార్యక్రమానికి పునాది అని చెప్పారు. రేవంత్ నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం తమకు ఎంతో సంతృప్తి కలిగిస్తోందని, ఇంత కంటే ఆత్మ సంతృప్తి మరేదీ ఉండదన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఈ యూనివర్సిటీ మంచి భవిష్యత్తును అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం భూములన్నింటినీ పారిశ్రామికవేత్తలకు ఇచ్చిందని, భూములు ఇచ్చిన వారు ఏమైనా పర్వాలేదన్నట్టుగా వ్యవహరించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం నిర్వాసితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు 600 ఎకరాల్లో ఇళ్లు నిర్మించనుందని వెల్లడించారు. ఏడాదిలో ఈ ప్రాంత రూపురేఖలు మార్చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనలో మంత్రి శ్రీధర్‌బాబు కృషి ఎంతో ఉందన్నారు.



రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటలో స్కిల్ యూనివర్సిటీ శంకుస్థాపన సభకు హాజరైన ప్రజలు

స్కిల్ వర్సిటీ కులపతిగా సీఎం!

- ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ.1.25 లక్షల ఖర్చు
- నిధుల సమీకరణ బాధ్యత వర్సిటీదే
- 'స్కిల్ వర్సిటీ' బిల్లులో కీలకాంశాలు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ (యువ భారత నైపుణ్యాల విశ్వవిద్యాలయం)'కి ముఖ్యమంత్రే కులపతిగా వ్యవహరించనున్నారు. సాధారణంగా ప్రతి ప్రభుత్వ విశ్వవిద్యాలయానికి రాష్ట్ర గవర్నర్ కులపతిగా ఉంటారు. అయితే రేవంత్ సర్కారు ప్రవేశపెట్టిన స్కిల్ వర్సిటీ బిల్లులో కులపతిగా రాష్ట్ర గవర్నర్/ముఖ్యమంత్రి అని పేర్కొన్నారు. ఇద్దరిలో ఎవరైనా ఉండవచ్చని బిల్లులో పేర్కొన్నప్పటికీ వర్సిటీ ఆలోచన సీఎం రేవంత్‌రెడ్డిదే కావడం, దాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో కులపతిగా ఆయనే ఉంటారని తెలిసింది. స్కిల్ యూనివర్సిటీలో చేరాలనుకున్న వారికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. మార్కుల ఆధారంగా కూడా ప్రవేశాలు కల్పిస్తారు. పరిశ్రమలే ఈ విశ్వవిద్యాలయానికి నిధులు అందిస్తాయి. విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో కూడా వర్సిటీ నిధులు సమకూర్చుకుంటుంది. వివిధ పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలపై ఇక్కడ శిక్షణ ఇచ్చేలా కోర్సులను డిజైన్ చేస్తారు. ఈ కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులకు పరిశ్రమలు ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్‌లు అందించాలి. కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులకు నియామకాలకు తోడ్పాటునివ్వాలి. మరోవైపు వర్సిటీలో నిర్మించే భవనాలకు విరాళాలిచ్చిన వ్యక్తులు, సంస్థల పేర్లు పెడతారు. వర్సిటీకి నిధులు అప్పుగా తెచ్చుకునేందుకు వెసులుబాటు కల్పించారు. వర్సిటీకి అనుబంధంగా ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుచేసే కేంద్రాల్లో కల్పించే ప్రవేశాల్లో మహిళలు, ఇతర వెనకబడిన వర్గాల విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ వర్సిటీలో ఇచ్చే డిగ్రీలకు ఇతర వర్సిటీల సర్టిఫికెట్లతో సమాన గుర్తింపు కల్పిస్తారు. ఇక్కడ ఒక్కో విద్యార్థికి నైపుణ్యాల శిక్షణ కయ్యే ఖర్చు రూ.1.25 లక్షలు. ఇందులో రూ.75 వేలను వర్సిటీయే భరిస్తుంది. విద్యార్థి నుంచి రూ.50వేలు వసూలు చేస్తుంది. ఇందులో మళ్లీ 30 శాతం రీయింబర్స్‌మెంట్‌గా ఇవ్వనున్నారు.

జాబ్ క్యాలెండర్‌కు చట్టబద్ధత!

(మొదటిపేజీ తరువాయి)

భర్తీచేస్తారనే వివరాలను కూడా సభలోనే చెప్పనున్నారు. సీఎం రేవంత్ అధ్యక్షతన గురువారం సాయంత్రం అసెంబ్లీ కమిటీ హాల్లో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఈ భేటీలో పాల్గొన్నారు. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలు, భర్తీచేసే ఉద్యోగాలు, నియామకాలకు నిర్దిష్ట కాలవ్యవధితో కూడిన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. జాబ్ క్యాలెండర్‌పై విపక్షాలు ఇచ్చే సలహాలు, సూచనలు కూడా స్వీకరిస్తామని తెలిపారు. పేదలకు కొత్త రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు విడివిడిగా జారీచేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. కొత్త కార్డుల జారీకి విధివిధానాల కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుచేశారు. ఇందులో రాష్ట్ర మంత్రి ఉత్తమ్ ఛైర్మన్‌గా, మంత్రులు దామోదర, పొంగులేటి సభ్యులుగా ఉంటారు. నెల రోజుల్లో విధివిధానాలు ఖరారుచేయాలని గడువు పెట్టారు. ప్రభుత్వానికి సబ్‌కమిటీ నివేదిక ఇవ్వగానే.. రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ విడివిడిగా ప్రారంభించాలని నిర్ణయించారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరామ్, సియాసత్ ఎడిటర్ ఆమెర్ అలీఖాన్‌లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా గతంలో ప్రతిపాదిస్తే.. రాజ్‌భవన్ నుంచి ఫైల్ తిరిగొచ్చింది. అప్పటి గవర్నర్ ఆమోదం తెలపలేదు. తాజా క్యాబినెట్ సమావేశంలో మళ్లీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీల అంశంపై చర్చించారు. కోదండరామ్, ఆమెర్ అలీఖాన్ పేర్లనే ఎమ్మెల్సీలుగా ప్రతిపాదిస్తూ మంత్రివర్గం నిర్ణయించింది. క్రీడాకారులు నిఖత్ జరీన్, మహ్మద్ సిరాజ్, ఈషా సింగ్‌లకు 600 గజాల చొప్పున హైదరాబాద్‌లో ఇంటి స్థలాలు ఇవ్వాలని నిర్ణయించారు. నిఖత్, సిరాజ్‌లకు గ్రూప్-1 కేడర్ ఉద్యోగాలు కూడా ఇవ్వాలని నిర్ణయించారు. విధి నిర్వహణలో మృతిచెందిన ఇంటలిజెన్స్ డీజీ రాజీవ్ రతన్ తనయుడు హరి రతన్‌కు మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగం, దివంగత అడిషన్ డీజీ పి. మురళి తనయుడికి డిప్యూటీ తహసీల్దారు ఉద్యోగమివ్వాలని నిర్ణయించారు. గోదావరి జలాలను మల్లన్న సాగర్ నుంచి శామీర్‌పేట చెరువుకు తరలించి.. అక్కడ నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు నింపి తాగునీటి సరఫరా చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. గ్రేటర్ హైదరాబాద్ బయట, ఔటర్ రింగురోడ్డు లోపల ఉండే అర్బన్ ప్రాంతం తాగునీటి అవసరాలకు 10 టీఎంసీలు కేటాయించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తాగునీటి అవసరాలు తీరుస్తున్న జంట జలాశయాలు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌తోపాటు మూసీలో నిరంతరం పరిశుభ్రమైన జలాలు ప్రవహించటానికి 5 టీఎంసీలు కేటాయించారు. మొత్తం 15 టీఎంసీల గోదావరి జలాలను తాగునీటి అవసరాలు, మూసీ ప్రక్షాళనకు వినియోగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. హుస్నాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు, భూసేకరణ, ఇతరత్రా పనులకు రూ. 437 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రివైజ్‌డ్ ఎస్టిమేట్స్‌కు ఆమోదం తెలపటంతోపాటు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసి 2 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని నిర్ణయించారు.

నిజాం చక్కెర కర్మాగారం పునరుద్ధరణ

దశాబ్దకాలంగా మూతపడి ఉన్న నిజాం చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఇందుకు మంత్రి శ్రీధర్‌బాబు ఛైర్మన్‌గా వేసిన మంత్రివర్గ ఉపసంఘం చేసిన ప్రతిపాదనలమేరకు రెండో విడత బకాయిల విడుదలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇథనాల్, విద్యుదుత్పత్తి అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేయాలని సబ్‌కమిటీకి బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ధరణి సమస్యలపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ నిర్వహించాలని భేటీలో నిర్ణయించారు. 'ధరణి' పేరును 'భూమాత'గా మారుస్తారని చర్చ జరుగుతోంది. రైతుభరోసాపై రైతులు, రైతుసంఘాల నుంచి వచ్చిన అభిప్రాయాలను శుక్రవారం అసెంబ్లీలో చర్చించి, ఆ తర్వాత మార్గదర్శకాలను వెల్లడించాలని నిర్ణయించినట్లు సమాచారం. కేరళలోని వయనాడ్ విపత్తుపై క్యాబినెట్ దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపింది. వైద్య సాయం, ఆహార ధాన్యాలు, ఇతరత్రా వసతుల కల్పన ద్వారా కేరళకు ఆపన్నహస్తం అందించాలని నిర్ణయించింది.

'గ్రేటర్' శివారు మునిసిపాలిటీల విలీనంపై మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలుండే గ్రామాలు, మునిసిపాలిటీల విలీనంపై అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. గురువారం క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు ఆయన నిర్ణయం తీసుకున్నారు. రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఓఆర్ఆర్‌ను ఆనుకుని ఉన్న 44 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిలిపేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించినట్లు సమాచారం. ఈ గ్రామాలను ముందుగా సమీపాన ఉన్న మునిసిపాలిటీలలో విలీనం చేసి.. ఆ తర్వాత ఆయా మునిసిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయనున్నారు. ప్రస్తుతం పురపాలక శాఖ సీఎం వద్దనే ఉన్నందున మంత్రివర్గ ఉపసంఘంలో సభ్యులుగా ఎవరిని నియమిస్తారనే దానిపై ఆ శాఖ అధికారుల్లో చర్చ జరుగుతోంది.

గత ప్రభుత్వం ఏ పనులు సరిగా చేయలేదు- మంత్రి పొంగులేటి

గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఆర్భాటాలు తప్ప, ఆచరణలో ఏ పనులు సక్రమంగా చేయలేదని మంత్రి పొంగులేటి అన్నారు. కేసీఆర్ పాలనలో పేద ప్రజల కష్టాలు పట్టించుకోలేదని అన్నారు. రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు కూడా జారీచేయలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరామ్‌ను గత ప్రభుత్వం ఎలా గౌరవించిందో ప్రజలు చూశారని అన్నారు. పొన్నం మాట్లాడుతూ... బీసీ కులగణన చేపట్టే పనిలో ఉన్నామని, ఓటర్ లిస్టు విడుదలచేస్తామని... పంచాయతీరాజ్ శాఖకు ఓటర్ల జాబితా వచ్చిన తర్వాత అన్నీ సరిచూసి... స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. జీవో నంబరు- 317, జీవో- 46, 2008 డీఎస్సీ, 1998 డీఎస్సీ.. తదితర సమస్యలన్నింటికి ప్రభుత్వం పరిష్కారం చూపిస్తుందని పొన్నం ప్రకటించారు. హుస్నాబాద్ ప్రాంతంలో గౌరవెల్లి ప్రాజెక్టుకు ఈ ప్రభుత్వం రూ. 437 కోట్లు కేటాయించటం హర్షణీయమని అన్నారు. వీలైనంత త్వరగా ప్రాజెక్టు పనులు పూర్తిచేసి 2 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని ప్రకటించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 2 ఆగస్టు 2024

సైన్స్ పీజీల్లో ప్రవేశానికి జామ్



బయోటెక్నాలజీ, సైన్సెస్ విభాగాల్లో పీజీ చేయాలనుకొనేవారి కోసం ఉద్దేశించిన 'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్) 2025' షెడ్యూల్ వెలువడింది. దీనిని ఈ ఏడాది ఐఐటీ ఢిల్లీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారా ఎమ్మెస్సీ; ఎమ్మెస్సీ(టెక్); ఎంఎస్(రీసెర్చ్); జాయింట్/డ్యూయల్ డిగ్రీ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ; ఎమ్మెస్సీ-ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ; ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 21 ఐఐటీలు అందిస్తున్న వివిధ పీజీ ప్రోగ్రామ్‌లలో సుమారు 3000 సీట్లను జామ్ స్కోర్ ద్వారా నేరుగా భర్తీ చేస్తారు. అలాగే నిట్ సంస్థలు, ఐసర్లు, ఐఐఎస్సీ, ఐఐఈఎస్‌టీ, డీఐఏటీ, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్‌ఆర్, ఎస్ఎల్ఐఈటీ సహా ప్రముఖ సీఎఫ్‌టీఐ సంస్థల్లో 2300కు పైగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఈ స్కోరునే ప్రామాణికంగా తీసుకుంటారు.

జామ్ పేపర్లు: జామ్ ఎగ్జామ్‌ను ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్‌లో కెమిస్ట్రీ, జియాలజీ, మేథమెటిక్స్ పేపర్లు; మధ్యాహ్నం సెషన్‌లో బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు పేపర్లు రాయవచ్చు. రెండు పేపర్లు రాసేవారు ఉదయం సెషన్ నుంచి ఒక పేపర్, మధ్యాహ్నం సెషన్ నుంచి మరో పేపర్ ఉండేలా చూసుకోవాలి. పేపర్లకు నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కెమిస్ట్రీ పేపర్ సిలబస్ మారినందున దానిని త్వరలోనే అప్‌లోడ్ చేస్తారు.

అర్హత: అభ్యర్థి జామ్‌లో ఎంచుకొన్న పేపర్/పేపర్లను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; సంబంధిత ఇండియన్ డిగ్రీ పూర్తిచేసిన విదేశీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా జామ్ ఎగ్జామ్ రాయవచ్చు.

జామ్ 2025 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలో ప్రకటిస్తారు.

- గత ఏడాది నిర్వహించిన జామ్ 2024 ప్రకారం ప్రతి పేపర్లో మూడు సెక్షన్‌లు ఉన్నాయి. మొత్తం 60 ప్రశ్నలకుగాను 100 మార్కులు కేటాయించారు. మొదటి సెక్షన్‌లో 30 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇచ్చారు. వీటిలో పది ప్రశ్నలకు ఒక్కోదానికి ఒక మార్కు. మిగిలిన 20 ప్రశ్నలకు ఒక్కోదానికి రెండు మార్కులు నిర్దేశించారు. రెండో సెక్షన్‌లో 10 మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలను ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సమాధానాలు ఉండేలా ఇచ్చారు. ప్రశ్నకు రెండు మార్కులు ప్రత్యేకించారు. మూడో సెక్షన్‌లో 20 న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు ఇచ్చారు. వీటిలో పది ప్రశ్నలకు ఒక్కోదానికి ఒక మార్కు. మిగిలిన పది ప్రశ్నలకు ఒక్కోదానికి రెండు మార్కులు ప్రత్యేకించారు. వీటికి ఆప్షన్స్ ఇవ్వలేదు. ఒక నెంబర్ సమాధానంగా ఉంది. మొదటి సెక్షన్‌కు మాత్రమే కేటాయించిన మార్కుల్లో మూడోవంతు నెగెటివ్ మార్కులు నిర్దేశించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులు ఒక పేపర్ మాత్రమే రాయాలంటే రూ.1800; రెండు పేపర్లు రాయాలంటే రూ.2500 చెల్లించాలి. మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఒక పేపర్ రాయాలంటే రూ.900; రెండు పేపర్లు రాయాలంటే రూ.1250 చెల్లించాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 3
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 11
- **పరీక్ష కేంద్రం, టెస్ట్ పేపర్ తదితరాలను మార్చుకునేందుకు చివరి తేదీ:** నవంబరు 18
- **ఓబీసీ-ఎన్‌సీఎల్/ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసేందుకు చివరి తేదీ:** నవంబరు 20
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 జనవరిలో
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **జామ్ 2025 ఎగ్జామ్ తేదీ:** 2025 ఫిబ్రవరి 2
- **ఫలితాలు విడుదల:** 2025 మార్చి 19
- **స్కోర్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 మార్చి 25 నుంచి
- **అడ్మిషన్ పోర్టల్ ఓపెన్:** 2025 ఏప్రిల్ 2
- **వెబ్‌సైట్:** jam2025.iitd.ac.in

ఆలిండియా లా ఎంట్రెన్స్ టెస్ట్



న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్‌ఎల్‌యూ)- 'ఆలిండియా లా ఎంట్రెన్స్ టెస్ట్(ఏఐఎల్ఈటీ) 2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీకాం ఎల్ఎల్‌బీ(ఆనర్స్) ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీకాం ఎల్ఎల్‌బీ(ఆనర్స్), ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లలో ఒక్కోదానిలో అయిదు సీట్లను విదేశీ అభ్యర్థులకు మరో అయిదు సీట్లను ఓసీఐ/పీఐఓ అభ్యర్థులకు; పీహెచ్‌డీలో రెండు సీట్లను విదేశీయులకు ప్రత్యేకించారు. వీరికి అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. వీరు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీకాం ఎల్ఎల్‌బీ ఆనర్స్

- ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో 120 సీట్లు; బీకాం ఎల్ఎల్‌బీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు 42 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ఓసీఐ/పీఐఓ/విదేశీ అభ్యర్థులకు కనీసం 65 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఎల్ఎల్ఎం

- ఈ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో మొత్తం 81 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ లేదా తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీహెచ్‌డీ

- పీహెచ్‌డీ ఇన్ లా ప్రోగ్రామ్‌లో మొత్తం 27 సీట్లు ఉన్నాయి. యూజీసీ జేఆర్ఎఫ్ అభ్యర్థులకు 8 సీట్లు, ఏఐఎల్ఈటీ మెరిట్ సాధించిన అభ్యర్థులకు 16 సీట్లు, ఏఐఎల్ఈటీ మెరిట్ ద్వారా ఫెలోషిప్ పొందినవారికి ఒక సీటు, విదేశీ అభ్యర్థులకు రెండు సీట్లు ప్రత్యేకించారు.
- పీహెచ్‌డీ ఇన్ సోషల్ సైన్స్ ప్రోగ్రామ్‌లో 4 సీట్లు ఉన్నాయి. వీటిని యూజీసీ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఎల్ఎల్ఎం ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. యూజీసీ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

ఏఐఎల్ఈటీ 2025 వివరాలు

- బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీకాం ఎల్ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 50, కరెంట్ అఫైర్స్ అండ్ జనరల్ నాలెడ్జ్ నుంచి 30, లాజికల్ రీజనింగ్ నుంచి 70 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.
- ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో 'లా' విభాగాల నుంచి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.
- పీహెచ్‌డీలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. రీసెర్చ్ మెథడాలజీ నుంచి 50 ప్రశ్నలు, 'లా' విభాగాలనుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో సాధించిన స్కోర్‌కు 70 శాతం; రీసెర్చ్ ప్రపోజల్, ఇంటర్వ్యూ/వైవా మార్కులకు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.3500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో బీపీఎల్ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 18
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్ విండో ఓపెన్:** నవంబరు 18 నుంచి 21 వరకు
- **విదేశీ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ:** 2024 ఏప్రిల్ 30
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** నవంబరు 28 నుంచి
- **ఏఐఎల్ఈటీ 2025 తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** nationallawuniversitydelhi.in

జాబ్ కార్నర్

ఐటీబీపీలో కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు 143

భారత హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండో-టిబెటిన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: కానిస్టేబుల్(బార్బర్/సఫాయి కర్మచారి/గార్డెనర్)

అర్హతలు: కానిస్టేబుల్(బార్బర్/సఫాయి కర్మచారి) పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత వృత్తిలో పని అనుభవం ఉండాలి. కానిస్టేబుల్(గార్డెనర్) ఖాళీలకు 10వ తరగతితోపాటు సంబంధిత విభాగంలో ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు తప్పనిసరి.

పే స్కేల్: నెలకు రూ.21,700 - రూ.69,100

వయోపరిమితి: కానిస్టేబుల్(బార్బర్/సఫాయి కర్మచారి) పోస్టులకు 21-25 ఏళ్లు; కానిస్టేబుల్(గార్డెనర్) ఖాళీలకు 21-33 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), రాత పరీక్ష, ఒరిజినల్ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ప్రాక్టికల్ స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పరీక్ష రుసుము: యూఆర్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ రూ.100. ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 26

వెబ్‌సైట్: recruitment.itbpolice.nic.in/

ఎన్‌సీఈఆర్‌టీలో టీచింగ్ ఉద్యోగాలు

ఖాళీలు 123

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ)... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.


- **ప్రొఫెసర్:** 33 పోస్టులు
- **అసోసియేట్ ప్రొఫెసర్:** 58 పోస్టులు
- **అసిస్టెంట్ ప్రొఫెసర్/అసిస్టెంట్ లైబ్రేరియన్:** 32 పోస్టులు

విభాగాలు: హిస్టరీ, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్, ఉర్దూ, జాగ్రఫీ, సైకాలజీ, సివిల్ ఇంజనీరింగ్, హిందీ, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, చైల్డ్ డెవలప్‌మెంట్, ఇంగ్లీష్, ఆర్ట్స్, ఫిజిక్స్, జువాలజీ, అగ్రికల్చర్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత. నెట్/స్లెట్/సెట్ స్కోరుతో పాటు టీచింగ్ అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,44,200; అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400; అసిస్టెంట్ ప్రొఫెసర్/అసిస్టెంట్ లైబ్రేరియన్‌కు రూ.57,700

దరఖాస్తు ఫీజు: రూ.1,000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.



ఎంపిక విధానం: విద్యార్హతలు, దరఖాస్తుల షార్ట్ లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16

వెబ్‌సైట్: ncert.nic.in/

హడ్కోలో మేనేజీరియల్ ఉద్యోగాలు

ఢిల్లీలోని హౌజింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హడ్కో)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 66

1. సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్: 1 పోస్టు
2. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్: 1 పోస్టు
3. జనరల్ మేనేజర్: 1 పోస్టు
4. డిప్యూటీ జనరల్ మేనేజర్: 2 పోస్టులు
5. అసిస్టెంట్ జనరల్ మేనేజర్: 11 పోస్టులు
6. సీనియర్ మేనేజర్: 12 పోస్టులు
7. మేనేజర్: 5 పోస్టులు
8. ట్రెయినీ ఆఫీసర్: 33 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, సీఏ, బీఈ/బీటెక్/బీఎస్సీ, ఎంబీఏ, పీజీడీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 28 నుంచి 52 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: మేనేజీరియల్ పోస్టులకు రూ.1500; ట్రెయినీ ఆఫీసర్ పోస్టుకు రూ.1,000; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 11

వెబ్‌సైట్: https://hudco.org.in//

భువనేశ్వర్ ఎయిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్స్

ఖాళీలు 133

భువనేశ్వర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: సీనియర్ రెసిడెంట్

విభాగాలు: అనస్తీషియాలజీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, మైక్రోబయాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పాథాలజీ, ఫిజియాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, యూరాలజీ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, ఎమ్మెస్సీ, డీఎన్‌బీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.67,700

వయోపరిమితి: 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500, ఎస్సీ/ఎస్టీ/అభ్యర్థులకు రూ.1200, దివ్యాంగులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 15

వెబ్‌సైట్: https://aiimsbhubaneswa.nic.in/

చిట్టిపొట్టి



అనువు గాని చోట

ఒక అడవిలో పెద్ద అల్లరి కోతుల గుంపు ఉండేది. ఒక రోజు వాటికి ఎక్కడా నీళ్లు దొరకక చాలా దాహం వేసింది. ఆ గుంపులో పెద్దకోతి తొందరగా గొంతు తడుపుకోకపోతే నేను చచ్చిపోయేలాగా ఉన్నాను అన్నది. గుంపులోని మరో కోతి అదిగో అక్కడ మంచినీళ్లు ఉన్నాయి అల్లంత దూరంలో అని దూరంగా మెరుస్తున్న ఎండమావిని చూపించింది. అదేమిటో తెలియని మిగతా కోతులు ఉత్సాహంగా సరే అని, అటు వైపు వెళ్లాలి అనుకున్నాయి. పక్కనే ఉన్న పొదలో ఉండి ఈ మాటలన్నీ విన్న చిన్న



కుందేలు పిల్ల ఒకటి పాపం ఈ కోతులకు సాయం చేద్దామని అనుకుని, వాటితో ఇలా అన్నది. 'మిత్రులారా ఎక్కడైనా ఎండ మావుల్లో నీరు ఉంటుందా? అది మన భ్రమ మాత్రమే నీటిలాగా కనిపిస్తుంది కానీ అది నీరు కాదు' అని చెప్పింది. ఆ మాటలు విన్న కోతులు 'మాకు తెలియదా ఏం చేయాలో? మేమంత తెలివి తక్కువ వాళ్లమా? నువ్వు మాకు నేర్పుతావా?' అని విరుచుకు పడ్డాయి. ఆ కుందేలు అప్పటికీ ఊరుకోక ఇంకా ఏదో చెప్పబోయింది. వెంటనే కోతులు దాని మీదకు దూకి దాన్ని గాయపరిచాయి. అందుకే తగని చోట మనకు అనువు గాని చోట ఎక్కువ మాటలాడకూడదు.



జంతువులు ఎన్ని?



సరైన రెండు నీడలు ఏవి?

5 తేడాలను గుర్తించండి?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 373

					6		9	3
			2	7		1	6	
4		9	3		1	5		
			9	3				6
3		6	7		4	9		5
7				2	8			
		1	8		7	4		2
	4	8		5	2			
2	5		4					

సుడోకు - 372 సమాధానం

5	1	2	4	9	7	6	8	3
9	7	6	1	3	8	5	2	4
8	4	3	2	5	6	1	7	9
2	9	7	8	6	5	4	3	1
3	8	4	9	2	1	7	6	5
6	5	1	3	7	4	8	9	2
4	6	9	7	1	3	2	5	8
1	2	5	6	8	9	3	4	7
7	3	8	5	4	2	9	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.